

'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 223


శుక్రవారం 3-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి? –ఫ్యామిలీ లో



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 223

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

IV
సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 3-11-2023

యువర్స్

● టెక్.. టాక్

హువావే నోవా 11 ఎస్ఈ



సైజ్: 6.67 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బరువు: 186 గ్రా. బ్యాటరీ: 4500 ఎంఏహెచ్
కలర్స్: గ్రీన్, వైట్, బ్లాక్ ● 5జీ కనెక్టివిటీ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్

లెనోవా ట్యాబ్ పీ12



సైజ్: 12.7 అంగుళాలు
రిజల్యూషన్: 1840×2944
వోఎస్: ఆండ్రాయిడ్ 13 కలర్స్: స్టోర్మ్ గ్రే, ఓట్
ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్ / 128జీబి 8జీబి ర్యామ్ / 256 జీబి 8జీబి ర్యామ్
బరువు: 615 గ్రా. బ్యాటరీ: 10200 ఎంఏహెచ్

పోట్రానిక్స్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: పోట్రానిక్స్ కలర్: బ్లూ
మెటీరియల్: ప్లష్ బరువు: 50 గ్రా.
కంపాటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్లెట్ స్క్రీన్, స్మార్ట్ ఫోన్స్

గూగుల్ పాస్‌కీస్

ఆండ్రాయిడ్ డివైజ్‌ల కోసం సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ సరికొత్త క్రెడెన్షియల్ మేనేజర్‌ను తీసుకు రానుంది. 'పాస్ కీస్' ద్వారా ఈ టూల్ మన లాగిన్ అవసరాలకు ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ ఎకౌంట్స్‌లో లాగిన్ కావడానికి ఇదో కొత్త విధానం. దీని ద్వారా యూజర్‌లు పాస్‌వర్డ్ ఉపయోగించకుండానే వెబ్‌సైట్‌లు, అప్లికేషన్‌లలో లాగిన్ కావచ్చు. రైట్ అథంటికేషన్ మెథడ్ ద్వారా క్రెడెన్షియల్ మేనేజర్ 'పాస్‌కీస్' మరో లెవల్‌కు తీసుకువెళ్లనుంది.



ఇన్‌స్టాలో ఇంటర్నెట్ యాక్టివిటీ ట్రాకింగ్ స్టాప్ చేయడానికి...



● ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రొఫైల్ పిక్చర్ టాప్ చేయాలి
● టాప్ రైట్ కార్నర్‌లో ఉన్న మూడు హారిజంటల్ లైన్స్‌ను టాప్ చేయాలి
● సెట్టింగ్ అండ్ ప్రైవసీ-సెలెక్ట్
● ట్యాప్-యాక్టివిటీ
● ట్యాప్-యాక్టివిటీ ఆఫ్ మెటా టెక్నాజీస్
● ట్యాప్-డిస్‌కనెక్ట్ ఫ్యూచర్ యాక్టివిటీ

అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్



చాట్‌బాట్ కోసం 'అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్' అనే కొత్త ఫీచర్ గురించి ప్రకటించింది ఓపెన్ ఏఐ. దీని ద్వారా యూజర్‌లు పీడీఎఫ్ ఫైల్స్, డాటా ఫైల్స్, ఇతర ఫైల్స్ అప్‌లోడ్, ఎనాలసిస్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. సుదీర్ఘమైన డాక్యుమెంట్‌ల నుంచి సంక్షిప్త సమాచారం, రకరకాల డాటా పాయింట్స్‌ను అర్థం చేసుకోవడానికి, డాటా ఆధారంగా గ్రాఫ్స్ అండ్ చార్ట్స్ జనరేట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

● సక్సెస్ స్టోరీ



ప్రమోద్ గాడ్గే



షాహీద్ మెమన్

'భవిష్యత్ అనేది రకరకాల వస్తువులతో కూడిన బాక్స్‌లాంటిది. మనం తీసినప్పుడు ఏ వస్తువు చేతికందుతుందో తెలియదు. కొన్నిసార్లు నిరాశపరిచే వస్తువు. కొన్నిసార్లు అత్యంత విలువైన వస్తువు చేతికి అందవచ్చు'... ఈ సినిమా డైలాగ్‌ను ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌లు విన్నారో లేదో తెలియదుగానీ 'అన్‌బాక్స్' రూపంలో వారికి బాక్స్ నుంచి విలువైన కానుక లభించింది. తమ భవిష్యత్‌నే మార్చేసిన స్టార్టప్ కానుక అది.
లాజిస్టిక్ ఆటోమేషన్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు ప్రమోద్, షాహీద్‌లు...

అన్‌బాక్స్

అదరగొట్టారు

'మన దేశంలో ఇ-కామర్స్ వేగం పెరిగింది' అనే వార్త చదివి 'ఓహో అలాగా!' అనుకోవచ్చు. అద్భుతమైన 'ఐడియా' కూడా రావచ్చు. ఆ ఐడియా జీవితాన్నే మార్చేయవచ్చు. ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌ల విషయంలో జరిగింది ఇదే. మన దేశంలో ఇ-కామర్స్ స్పీడ్‌ను గమనించిన వీరు సప్లై చైన్ రోబోటిక్స్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రొబోటిక్స్'తో విజయపథంలో దూసుకుపోతున్నారు. ఇండియా దాటి యూఎస్, యూరప్ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టనున్నారు.

పుణే కేంద్రంగా మొదలైన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సప్లై చైన్ ఆటోమేషన్ సోల్యూషన్స్‌లో మార్పు తీసుకువచ్చింది. వినూత్న ఏఐ-ఆధారిత కంట్రోల్ సిస్టమ్ ద్వారా రోబోట్‌ల ఉత్పాదకతను పెంచింది. పనితీరును మార్చింది.

'మానవ శక్తి నుంచి రోబోట్స్ వరకు ప్యాకేజీలను క్రమబద్ధీకరించడం, రవాణా చేయడం... మొదలైన విధానాలు మన దేశంలో ఇ-కామర్స్ వేగాన్ని అందుకోలేకపోతున్నాయేమో అనిపించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మొబైల్ రోబోటిక్స్ సిస్టమ్‌ను నిర్మించాలనుకున్నాం. లాజిస్టిక్స్, రిటైల్ ప్లేయర్‌ల కోసం ప్యాకేజీ సార్టింగ్, ఆర్డర్ కన్సాలిడేషన్ ప్రక్రియలను ఆటోమేట్ చేయడానికి శక్తిమంతమైన రోబోటిక్స్ వ్యవస్థను నిర్మించాలనుకున్నాం' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సీఇవో ప్రమోద్ గాడ్గే.

'అన్‌బాక్స్ రోబోటిక్స్'కు ముందు ఫ్లిప్‌కార్ట్‌లో సార్టింగ్‌కు సంబంధించి ఆటోమేషన్ విభాగంలో, మన దేశంలోని తొలి రోబోట్-బేస్డ్ సార్టింగ్ ప్రాజెక్ట్‌లో పనిచేశాడు ప్రమోద్.

'అన్‌బాక్స్ రోబోటిక్స్' కో-ఫౌండర్, సీటీవో షాహీద్ రోబోటిక్స్. ఇంటెలిజెన్స్ సిస్టమ్స్, స్వార్మ్ ఇంటిలిజెన్స్‌లో మంచి అనుభవం ఉంది. రోబోటిక్స్, ఆటోమేషన్ ఫీల్డ్స్‌లో సీటీవోగా పనిచేశాడు.

'అన్‌బాక్స్'కు ముందు 'వనోర రోబోట్స్' అనే స్టార్టప్ ప్రారంభించాడు.

చిత్తశుద్ధి, కష్టపడే తత్వం, అంకితభావం లేకపోతే పేపర్ మీద రాసుకున్న కాన్సెప్ట్ అక్కడే నిలిచిపోతుంది. అయితే ఈ ఇద్దరు మిత్రులు వారి బృందం బాగా కష్టపడి 'అన్‌బాక్స్'ను సూపర్ హిట్ చేశారు.

స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది. టీమ్‌ను విస్తరించడానికి, అంతర్జాతీయ స్థాయిలో కస్టమర్‌ల డిమాండ్‌ను నెరవేర్చడానికి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై సమీకరించిన నిధులను వాడారు.

2021లో థర్డ్-పార్టీ లాజిస్టిక్స్, ఇ-కామర్స్ ప్లేయర్స్‌తో కంపెనీ బీటా పైలట్స్ లాంచ్ చేసినప్పుడే లీడింగ్ ఇ-కామర్స్ లాజిస్టిక్స్ కంపెనీల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది. ఇది భవిష్యత్ విజయానికి సూచికలా పనిచేసింది. ఇన్వెస్టర్లలో మరింత నమ్మకాన్ని నింపింది.

'అన్‌బాక్స్' స్టార్టప్ ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్‌లాంటి సెక్టార్‌లలో ఏడు పెద్ద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. క్లయింట్ సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'రోబోట్ యాజ్ ఏ సర్వీస్'ను కూడా కంపెనీ ప్రారంభించింది.

ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాలకు సంబంధించి రోబోటిక్-బేస్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ టెక్నాలజీలో ప్రత్యేకత సాధించిన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతుంది.

స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది.



● ఇంగ్లిష్ ఇడియమ్స్

ఏ హెడ్‌స్టార్ట్

ఏదైనా విషయంలో, పోటీలో, పరీక్షలో....ఒక వ్యక్తికి అడ్వాంటేజ్ ఉంటే వాడే మాట... ఏ హెడ్‌స్టార్ట్.
ఉదా: మెర్లిన్స్ బ్యూటీ అండ్ నేచురల్ గ్రేస్ గేవ్ హర్ ఏ బిగ్ హెడ్‌స్టార్ట్ ఇన్ ది మోడలింగ్ అండ్ యాక్టింగ్

పాసింగ్ ది బక్

ఒక పనిలో తన రెస్పాన్సిబిలిటీని తప్పించుకోవడంలో భాగంగా నెపాన్ని ఇతరుల మీద నెట్టి బ్లేమ్ చేసే సందర్భంలో వాడే మాట...పాసింగ్ ది బక్.
ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్- దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

● మ్యూజిక్ వరల్డ్

సంగీతమే శ్వాసగా...

కోల్‌కతాకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ అమిక శైల్. తొమ్మిది సంవత్సరాల వయసులో 'లిటిల్ చాంప్స్' రియాలిటీ షోలో పాల్గొంది. ఫోక్, జాజ్, క్లాసిక్‌లో 'వావ్' అనిపించుకుంది. డిగ్రీ పూర్తయిన తరువాత తన కలను సాకారం చేసుకోవడానికి ముంబైకి వచ్చింది. 'స్ట్రగుల్' అంటే ఏమిటో అప్పుడే తెలిసింది. సినిమాల్లో పాడడానికి చేసే ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. హిందుస్థానీ క్లాసిక్ మ్యూజిక్‌లో అమికకు మంచి పట్టు ఉంది. అవకాశాలు వచ్చే వరకు ఖాళీగా కూర్చోవడం ఎందుకని మ్యూజిక్ టీచర్‌గా జాబ్‌లో చేరింది. ఎట్టకేలకు 'వెడ్డింగ్ యానివర్సరీ' సినిమాతో బ్రేక్ వచ్చింది. ఎన్నో టీవీ సీరియల్స్‌కు టైటిల్ సాంగ్స్ పాడింది. ఎన్నో రియాల్టీ షోలలో పాల్గొంది. 'సంగీతం అనేది నాకు అభిరుచి కాదు శ్వాస లాంటిది. సంగీత సాధనకు ఎన్ని గంటలైనా సరిపోవు. యాంత్రికంగా, మొక్కుబడిగా కాకుండా ప్రశాంత చిత్తంతో సంగీత సాధన చేయాలి' అంటున్న అమిక నటిగా కూడా రాణిస్తోంది. 'పవర్‌ఫుల్ డైలాగులో చెప్పడంలో. సరియైన భావోద్వేగాలు ప్రదర్శించడంలో నాలోని సింగర్ గురువులా మార్గదర్శనం చేస్తోంది' అంటుంది అమిక శైల్.



అమిక శైల్



అమిక శైల్

● గేమింగ్



అగ్గిబరాట

అడ్వెంచర్ వీడియో గేమ్ 'థ్రస్టీ సూటర్స్' విడుదల అయింది. యంగ్ లేడీ జాల తన సోదరి వివాహం సందర్భంగా స్వస్థలానికి వస్తుంది. ఆ తరువాత ఏమైంది అనేది ఈ గేమ్. సంస్కృతి, భావోద్వేగాలు, కుటుంబ ఒత్తిళ్లు, బంధాలకు ఈ గేమ్ కేంద్రబిందువు. సినిమాటిక్, టర్న్-బేస్డ్ బ్యాటిల్ సీక్వెన్స్‌లు ఉంటాయి.

గేమ్ ప్లే: కంబాట్, స్కేట్ బోర్డింగ్, కుకింగ్
జానర్స్: రోల్-ప్లేయింగ్ గేమ్, అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, అడ్వెంచర్
ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ వన్, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్, సిరీస్ ఎస్

సినిమా



● రామ్‌చరణ్

ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో...

రామ్ చరణ్‌కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఆస్కార్ కమిటీ) తాజాగా వెల్లడించిన 'మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్' జాబితాలో రామ్‌చరణ్‌కి సభ్యత్వం దక్కింది. 'ఆర్ఆర్ఆర్'లో రామరాజు పాత్రలో అద్భుతంగా నటించినందుకుగాను చరణ్‌కి ఈ స్థానం లభించింది. కాగా 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఆ మధ్య విడుదల చేసిన యాక్టర్స్ బ్రాంచ్‌లో తెలుగు నుంచి ఎన్టీఆర్‌కి చోటు దక్కిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌చరణ్‌తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీనటులకు ఈ కమిటీలో చోటు దక్కింది. ''ఈ నటులు వెండితెరపై తమ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. వాస్తవానికి, కల్పితానికి మధ్య వారధులుగా నిలిచారు. ఎన్నో సినిమాల్లో వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. వారి కళతో సాధారణ సినిమాతో ప్రేక్షకులకు అసాధారణ అనుభవాలను అందిస్తున్నారు. అలాంటి వారిని 'యాక్టర్స్ బ్రాంచ్'లోకి ఆహ్వానిస్తున్నాం'' అని సోషల్ మీడియా వేదికగా ఆస్కార్ అకాడమీ ప్రతినిధులు షేర్ చేశారు. కాగా 96వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చిలో జరగనుంది.



హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మెగా, అల్లు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితులు హాజరయ్యారు. హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అల్లు అయాన్, కుమార్తె అల్లు అర్హతో కలిసి వివాహానికి హాజరై వధూవరులకు అభినందనలు తెలిపారు.

మా వ్యూహం మాకుంది

- రామ్‌గోపాల్ వర్మ



● కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరు. అలాగే మా 'వ్యూహం' సినిమా విడుదలను కూడా ఆపలేరు. ఈలోగా మా సినిమాపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయకుండా నేనే ముందుకొచ్చి మాట్లాడుతున్నా. ఒకవేళ మా చిత్రం రిలీజ్‌కి అడ్డంకులు సృష్టిస్తే ఏం చేయాలో మా వ్యూహం మాకుంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. అయితే రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–''వ్యూహం' చూసిన సెన్సార్ సభ్యులు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఎందుకు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నారో కారణాలు చెప్పలేదు. దీంతో ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నాం. రివైజింగ్ కమిటీల్లోనూ తేల్చకుంటే 'ఉడ్తా పంజాబ్, పద్మావత్' వంటి హిందీ సినిమాలకు కోర్టు ద్వారా రిలీజ్ ఆర్డర్ తెచ్చుకున్నట్లే మేమూ తెచ్చుకుంటాం. చట్టపరంగా ఉన్న పద్ధతుల ద్వారా 'వ్యూహం'ను రిలీజ్ చేసుకుంటాం. ఈ సినిమా విడుదల ఆపాలని నారా లోకేశ్ సెన్సార్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. అయితే అదెంత నిజమో చెప్పడానికి నా దగ్గర ఆధారాలు లేవు. మీడియా, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు చెప్పినట్లే 'వ్యూహం' ద్వారా నా అభిప్రాయాలు చెప్పాను. అది ఎవరైనా వింటారా? లేదా అన్నది అర్థం లేని ప్రశ్న. సినిమా ఇవ్వడం వరకే నా బాధ్యత'' అన్నారు. ''మా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా నష్టం జరగదు. మేము అనుకున్నట్లే అన్నీ సకాలంలో జరుగుతాయని ఆశిస్తున్నాం. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తాం''అన్నారు దాసరి కిరణ్ కుమార్.

చేయి పోయినా ఆత్మవిశ్వాసంతో సినిమా పూర్తి చేశాను

- సెబాస్టియన్ నోవా అకోస్టా

రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా.అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సెబాస్టియన్ నోవా మాట్లాడుతూ– ''దర్శకుడు కావాలనేది నా కల. ఓ ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుని అవకాశాల కోసం ప్రయత్నించినా కుదర్లేదు. టెక్నాలజీపై అవగాహన కోసం 2012లో ప్రసాద్ ల్యాబ్‌లో చేరాను. అక్కడ రిలీజ్‌కు నోచుకోని సినిమాలు కనిపించాయి. దీంతో సినిమా తీయడం కాదు.. తీసిన సినిమాను మార్కెట్ చేసుకోవడం ముఖ్యమని భావించి సాయి కొర్రపాటిగారి సహాయంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలో చేరాను. ఆ తర్వాత నా దర్శకత్వంలో సినిమా కోసం కథ రెడీ చేసుకున్నాను. చిన్నతనంలో నేను తప్పిపోతే ట్రాన్స్‌జెండర్స్ నన్ను మా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కథకు ఈ సంఘటన ఓ స్ఫూర్తి. ఇక దర్శకుడిగా తొలి అవకాశమే కష్టం అనుకుంటే.. 'నరకాసుర' చిత్రీకరణ టైమ్‌లో ఒరిస్సాలో షూటింగ్ పూర్తి చేసుకుని జబల్‌పూర్ వెళ్తుంటే ప్రమాదం జరిగి, నా చేయి పోయింది. ప్రమాదం జరిగిన తర్వాత 27వ రోజు నేను సెట్స్‌లోకి వచ్చి, ఆత్మవిశ్వాసంతో సినిమాను పూర్తి చేశాను. ఇక మాధవన్, అరుణ్ విజయ్, వివేక్ ఒబెరాయ్, టొవినో థామస్ వంటి స్టార్స్‌తో ట్రైబల్ నేపథ్యంలో ఓ సినిమా ప్లానింగ్‌లో ఉంది. మూడు భాషల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు.



లవ్ డ్యూయెట్

ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటించనున్న సినిమాకు 'డ్యూయెట్' టైటిల్‌ను ఖరారు చేశారు. ఏఆర్ మురుగదాస్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన మిథున్ వరద రాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, స్టూడియో గ్రీన్ పతాకంపై కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఆనంద్ తల్లి దండ్రులు గోవర్ధన్ దేవరకొండ, మాధవి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో హీరోయిన్లపై దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ ఇచ్చారు. తొలి సీన్‌కి దర్శకుడు చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక-నిర్మాత సాయిరాజేష్, నిర్మాత జ్ఞానవేల్ రాజా, ఈ చిత్ర సహ-నిర్మాత 'మధుర' శ్రీధర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు మిథున్‌కు అందజేశారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''డ్యూయెట్' నాకు స్పెషల్ ఫిల్మ్. మిథున్ మంచి కథ రాశాడు'' అన్నారు. ''ఇదొక మంచి లవ్‌స్టోరీ'' అన్నారు మిథున్. ''ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. జీవీ ప్రకాశ్‌కుమార్ ఆల్రెడీ రెండు పాటలు ఇచ్చేశారు. వారం రోజుల్లో తొలి షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ వేడుకకు హీరోలు విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అతిథులుగా హాజరయ్యారు.



● రితిక, ఆనంద్ దేవరకొండ

''చేసిన పాత్రలనే మళ్లీ చేస్తే నాకు బోరింగ్‌గా అనిపిస్తుంటుంది. ఎప్పటికప్పుడు వినూత్నంగా, ప్రయోగాత్మకంగా సినిమాలు చేసే కార్తీనే ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు. అంటే నేను నాలా ఉంటే ఆదరిస్తున్నారు. మరొకరిలా ఉండాలనుకోవడం లేదు. కాబట్టి నా తరహా సినిమాలే నేను చేస్తాను'' అని కార్తీ అన్నారు. కార్తీ హీరోగా 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన 'జపాన్' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కార్తీ చెప్పిన విశేషాలు.

అలాంటి కార్తీనే ఇష్టపడుతున్నారు!

- హీరో కార్తీ



● 'జపాన్' క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్. నిజమైన కథ కాదు. కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా కేవలం వినోదం ఇవ్వడం మాత్రమే కాదు... మన ఉనికిని, అస్థిత్వాన్ని ప్రశ్నించేలా కూడా ఉంటుంది. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. సోషల్ మీడియా అంశాన్ని కూడా టచ్ చేశాం. అలాగే మనకు 'జపాన్' అంటే హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు దాడి గుర్తుకు రావచ్చు. ఆ దాడి తర్వాత జపాన్ దేశం మళ్లీ పుంజుకుని అత్యున్నత స్థాయికి ఎదిగింది. ఈ రిఫరెన్స్ 'జపాన్' పాత్రలో కూడా కనిపిస్తుంది. ● చాలా కాలం తర్వాత మాస్‌తో కూడిన స్ట్రాంగ్ అండ్ సెటైరికల్ రోల్ నాకు మళ్లీ 'జపాన్'తో వచ్చినట్లు అనిపించింది. 'జపాన్' గ్రే క్యారెక్టర్ కాదు.. డార్క్ అంతే. నా క్యారెక్టర్‌లో డార్క్ హ్యూమర్ ఉంటుంది. 'జపాన్' కోసం రెగ్యులర్ కార్తీలా ఉండకూడదని అనుకున్నాను. దర్శకుడు కూడా ఇదే కోరుకున్నారు. ఈ సినిమా కోసం కొత్తగా మేకోవర్ అయ్యాను. నా వాయిస్ మాడ్యులేషన్, హెయిర్ స్టయిల్ అన్నీ కొత్తగా అనిపిస్తాయి. ● నేను నటించిన 'ఊపిరి' సినిమా తమిళ వెర్షన్‌కు దర్శకులు రాజు మురుగన్ డైలాగ్స్ రాశారు. ఆయనలో మంచి హ్యూమర్ ఉందని ఆ సమయంలో అనిపించింది. కానీ రాజుగారు తీసిన 'కుకు', 'జోకర్' సినిమాల్లో ఇది అంతగా లేదు. సాధారణంగా నేను నా కోసం ఏవైనా కథలు ఉన్నాయా? అని ఎవర్నీ అడగలేదు. తొలిసారి రాజు మురుగన్‌ని అడిగాను. ఓ డార్క్ ఎమోషనల్ స్టోరీ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. ఆ తర్వాత మరో కథలోని ఓ క్యారెక్టర్ నచ్చి, ఆ పాత్ర ఆధారంగా కథ రాయమన్నాను. అలా 'జపాన్' కథ మొదలైంది. రాజు మురుగన్‌గారు గతంలో జర్నలిస్ట్‌గా చేశారు. ఆయన తన జీవితంలో చూసిన కొన్ని ఘటనలను 'జపాన్'లో చూపించే ప్రయత్నం చేశారు. అలాగే నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియోస్‌తో అసోషియేట్ అవ్వడం ఆనందంగా ఉంది. ● దర్శకుడు నలన్‌కుమార్‌తో నేను చేస్తున్న సినిమా 70 శాతం షూటింగ్ పూర్తయింది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్‌తో ఓ సినిమా చేయనున్నాను. అలాగే 'ఖైదీ 2', 'సర్దార్ 2' చిత్రాలు చేయాల్సి ఉంది.

ఈ సినిమా నాకో పెద్ద వేడుక

- 'సత్యం' రాజేశ్



'సత్యం' రాజేష్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన తారాగణంగా, రాకేందు మౌళి, బాలాదిత్య, కరుణకుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'మా ఊరి పొలిమేర'కు ఇది సీక్వెల్ చిత్రం. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నేడు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర'కు వీక్షకుల నుంచి వచ్చిన స్పందనను బట్టి 'మా ఊరి పొలిమేర 2' చేద్దామని అనుకున్నాం. తొలి భాగం ముగిసిన దగ్గర్నుంచే మలి భాగం ఆరంభమవుతుంది. కొమరయ్య (సినిమాలో 'సత్యం' రాజేశ్ పాత్ర) గురించి నిజాలు తెలుసుకున్న లక్ష్మి (కామాక్షీ పాత్ర) ఏం చేసింది? ఏ విధంగా పగ తీర్చుకోవాలనుకుంది? కవిత ఎలా జీవించి ఉంది? ఇలాంటి ఆసక్తికరమైన కథనంతో మంచి ట్విస్ట్‌లతో సాగుతుంది. నా కెరీర్‌లో ఓ పెద్ద వేడుకలా ఈ సినిమాను భావిస్తున్నాను. ప్రస్తుతం 'గీతాంజలి' సీక్వెల్, వరుణ్‌తేజ్ 'మట్కా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు చేస్తున్నాను. హీరోగా 'టెనెంట్' చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

ఓ కల ఆధారంగా..



● రోహిత్ నందా

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం దర్శకత్వం వహించిన చిత్రం 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రోహిత్ నందా మాట్లాడుతూ– ''న్యూజిల్యాండ్‌లో చదువుకున్నాను. నటనపై ఆసక్తితో స్టేజ్ డ్రామాల్లో చేశాను. చిరంజీవిగారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. ఇక 'విధి' సినిమా రా అండ్ రస్టిక్ ఫిల్మ్. రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కు విభిన్నమైన పాత్రను ఈ సినిమాలో చేశాను. అలాగే మా 'విధి' సినిమాను చూపులేనివారు కూడా ఓ యాప్ సాయంతో ఆస్వాదించవచ్చు. ఈ ఆలోచన నాదే. కొన్ని కొత్త కథలు వింటున్నాను'' అన్నారు. ''మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి వచ్చిన ఓ కల ఆధారంగా 'విధి' సినిమా స్టోరీ లైన్‌ను డెవలప్ చేసి, కథ రెడీ చేసుకున్నాం. రోహిత్ బాగా చేశారు'' అన్నారు శ్రీనాథ్, శ్రీకాంత్.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 223

శుక్రవారం 3-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ జైత్రయాత్ర

- వరుసగా ఏడో విజయంతో సెమీఫైనల్‌కు టీమిండియా..
- శ్రీలంకపై 302 పరుగులతో విజయం
- బంతితో మెరిసిన షమీ, సిరాజ్, బుమ్రా
- బ్యాట్‌తో అదరగొట్టిన కోహ్లి, గిల్, అయ్యర్

-వివరాలు 14లో

ఒంటరిగానే పోటీ చేస్తాం

మీడియాతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



- 17 స్థానాల్లో బరిలోకి దిగుతాం.. రెండ్రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తాం
- రాష్ట్రంలో ఒక్క సీటు కూడా బీజేపీ గెలవొద్దన్నదే మా లక్ష్యం
- మా అభ్యర్థి లేని చోట బీజేపీని ఓడించేందుకు ఇతర పార్టీలకు మద్దతు
- సీపీఐ కలిసొస్తే ఓకే... కాంగ్రెస్‌తో ఆ పార్టీ పొత్తు పెట్టుకున్నా మద్దతిస్తాం

13 లో

సీపీఎం దారిలో సీపీఐ

ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగాలని సూత్రప్రాయ నిర్ణయం

- వివరాలు 13లో



పంటికి తగలకుండా మింగేస్తరు!

ఒక్క చాన్స్ అంటూ వస్తున్న వారిని నమ్మితే అంతే..

నిర్మల్, బాల్కొండ, ధర్మపురి ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్

- ఏ అభ్యర్థి ఎలాంటోడో, ఏ పార్టీతో ఏం లాభమో చూడాలి
- కాంగ్రెస్ హయాంలో దళిత సమాజాన్ని అణచివేశారు
- ఆ పార్టీకి ఓటేస్తే పెద్ద పాము మింగినట్లే..
- రైతుబంధు, కరెంటు ఆగిపోతాయి
- ధరణి తీసేస్తే మళ్లీ పైరవీకారుల రాజ్యమే
- రైతుబంధు, వడ్ల డబ్బులు ఖాతాల్లోకి ఎలా వస్తాయి?
- ప్రధాని మోదీకి ప్రైవేటు పిచ్చి పట్టింది
- వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలంటే.. ప్రాణం పోయినా పెట్టబోనన్న ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/మోర్తాడ్(బాల్కొండ)/సాక్షిప్రతినిధి,కరీంనగర్/ నిర్మల్: తెలంగాణ వచ్చిన తర్వాత మూడోసారి ఎన్నికలు జరుగుతున్నాయని, ఎవరో ఒకరు గెలుస్తారని... కానీ మీరు వేసే ఓటు మీ ఐదేళ్ల తలరాతను నిర్ణయిస్తుందని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. అందుకే అభ్యర్థుల గురించి తెలుసుకోవాలని, వాళ్ల మంచి చెడులు విచారించి, ఏపార్టీకి ఓటేస్తే లాభమో, ఏ ప్రభుత్వం ఏర్పడితే మంచి జరుగుతుందో ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. ఒక్క చాన్స్ అంటూ వస్తున్న వారిని నమ్మితే అంతేనని.. పంటికి కూడా తగలకుండా మింగేస్తారని వ్యాఖ్యానించారు. తాను చెప్పిన విషయంపై గ్రామాలకు వెళ్లిన తర్వాత లోతుగా చర్చించాలని కోరారు. నిర్మల్, బాల్కొండ, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ కోసం నేను 24 ఏళ్లుగా కష్టపడుతూనే ఉన్నా. 14 ఏళ్ల ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన. మరో పదేళ్లపాటు తెలంగాణ అభివృద్ధి కోసం మమేకమైన. ఇప్పుడు దుష్టశక్తుల నుంచి తెలంగాణను కాపాడుకునేందుకు మిగతా 2వ పేజీలో ▶

ఐటీ దాడుల కలకలం

కాంగ్రెస్ మహేశ్వరం అభ్యర్థి కేఎల్ఆర్, పీసీసీ నేత, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు

- 14 ప్రాంతాల్లో ఉదయం నుంచే సోదాలు
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తోడల్లుడు గిరిధర్‌రెడ్డి, వ్యాపారవేత్త వంగేటి లక్ష్మారెడ్డి ఇళ్లపైనా దాడి
- పారిజాతను తిరుపతి నుంచి, ఆమె భర్తను ఢిల్లీ నుంచి రప్పించిన అధికారులు
- సోదాల్లో కొంత నగదు, కీలక పత్రాలు స్వాధీనం!

3 లో

నేటి నుంచి నామినేషన్లు



- శుక్రవారం వెలువడనున్న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్..
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- నవంబర్ 30న పోలింగ్.. డిసెంబర్ 3న కౌంటింగ్
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఈసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నగారా నేడు మోగనుంది. కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఉదయం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రాష్ట్రంలోని 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వుడ్ స్థానాలతో సహా మొత్తం 119 నియోజకవర్గాలకు శాసనసభ్యులను ఎన్నుకోవాల్సిందిగా కోరనుంది. నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణం నుంచే నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు) అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. నవంబర్ 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలోని 35,356 కేంద్రాల్లో

మిగతా 2వ పేజీలో ▶

ఇసుక దందాపై సీఐడీ కొరడా

చంద్రబాబు ముఠా రూ.10 వేల కోట్ల ఇసుక దోపిడీపై కేసు నమోదు

ఏ-1 పీతల సుజాత, ఏ-2 చంద్రబాబు, ఏ-3 చింతమనేని, ఏ-4 దేవినేని ఉమా



- 'ఉచిత ఇసుక విధానం' ముసుగులో భారీ దోపిడీ
- ప్రభుత్వ ఖజానాకు రూ. వెయ్యి కోట్ల గండి
- గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు బేఖాతరు
- ఆర్థిక శాఖ ఆమోదం, మంత్రి మండలి తీర్మానం లేదు
- 'ప్రత్యేక మెమో' ద్వారా దోపిడీకి రాచబాట
- ఇసుక రీచ్‌లన్నీ టీడీపీ ప్రజాప్రతినిధుల హస్తగతం
- ఎక్కడ ఎంత ఇసుక తవ్వారన్న లెక్కలు లేకుండా పక్కా స్కెచ్

- వివరాలు 12లో

1
సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 3-11-2023

ఫ్యాషన్



ఉంగరాల గొలుసులు

వేళ్లకి ఉంగరాలు, మెడలో గొలుసులు ధరించడం సాధారణమే! చేతులకు ఉంగరాలు.. చెయిన్లు, హ్యాండ్ కఫ్స్ ధరించడం ఇప్పుడు ట్రెండ్. ఇండోవెస్టన్, వెస్టన్ డ్రెస్సుల మీదకు ఈ ఉంగరాలు, చెయిన్ల వరసలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. యువత వేగానికి, స్టయిల్‌కి అద్దంలా భాసిల్లుతున్నాయి.

బంగారు వరసలు

లైట్ వెయిట్ జ్యువెలరీలో భాగంగా హ్యాండ్ కఫ్స్, చెయిన్స్ డిజైనర్లను ఆధునికత వైపుగా పరుగులు తీయిస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు బంగారు లోహంతో వెస్టన్ స్టైల్ డిజైన్స్‌ను కొత్తగా మెరిపిస్తున్నారు.

వెండి వెలుగులు

తక్కువ ఖర్చు అనే జాబితాను ఈ తరం పక్కన పెట్టేస్తోంది. ఏ డిజైన్ తమకు మరింత అందాన్ని తీసుకువస్తుందో, నలుగురిలో గుర్తింపును సంపాదిస్తుందో దానినే ఇష్టపడుతోంది. అందుకే సిల్వర్ డిజైన్స్ మరింతగా యువత మదిని గెలుచుకుంటున్నాయి.

స్టీల్ మెరుపులు

స్ట్రీట్ అండ్ బోహో స్టైల్‌లో స్టీల్‌తో తయారైన ఆభరణాలను యువత ఎక్కువ ధరిస్తుంటుంది. క్యాజువల్ వేర్, పార్టీవేర్‌కీ నప్పే ఈ డిజైన్ వరసలు వందల రూపాయల నుంచి మార్కెట్‌లో లభిస్తున్నాయి.

బ్యూటిప్స్

వేకువ జాముకు చలి తొంగి చూస్తోంది. కిటికీలో నుంచి దొంగలా గదిలో దూరుతోంది. చల్లగా ఒంటికి హాయినిస్తుంది. కానీ చర్మాన్ని పెళుసుబారుస్తుంది కూడా. అందుకే ఆలస్యంగా చర్మసంరక్షణ మొదలవ్వాలి.

శీతాకాలానికి స్వాగతం

- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత బాదం నూనె లేదా ఆలివ్ ఆయిల్ రాయాలి.
- గోరువెచ్చటి నీటిని దోసిట్లోకి తీసుకుని ముఖాన్ని నీటిలో మునిగేటట్లు ఉంచాలి. ఇది హాట్‌థెరపీ. రోజుకొకసారి ఉదయం స్నానం చేయడానికి ముందు కానీ రాత్రి పడుకునే ముందుకానీ చేయవచ్చు.
- ఒక కోడిగుడ్డు సొనలో, టీ స్పూన్ కమలారసం, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, నాలుగైదు చుక్కల పన్నీరు, అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇది పొడిచర్మానికి వేయాల్సిన ప్యాక్.
- బాగా మగ్గిన అరటిపండును మెత్తగా చిదిమి ముఖానికి, మెడకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇది పొడిచర్మానికి మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది, మెడ నలుపు కూడా వదులుతుంది.



- పొడిచర్మాన్ని మృదువుగా మార్చడంలో గ్రేప్‌సీడ్ ఆయిల్ బాగా పని చేస్తుంది. ఆయిల్‌ను ఒంటికి రాసి మర్దన చేయాలి.
- ఫేస్‌ప్యాక్‌లకు బదులుగా స్వచ్ఛమైన ఆముదం ఒంటికి రాసి మర్దన చేసుకోవాలి. ఆముదం వల్ల చర్మం మృదువుగా మారడంతో పాటు అనేక చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.

పారా హుషార్

ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి?

మొన్నటి ఆదివారం జరిగింది ఇది: బెంగళూరులోని ఒక భారీ మాల్‌లో తన కుటుంబంతో షాపింగ్ చేస్తున్న జయప్రకాష్ (30)కి అతని చెల్లెలు దూరంగా ఉన్న ఒక వ్యక్తిని చూపింది. అన్నయ్యా... అతను ఆడవాళ్లను తాకుతున్నాడు అని చెప్పింది. జయప్రకాష్ పెద్దగా పట్టించుకోలేదు కాని కాసేపు ఆ వ్యక్తినే గమనిస్తే అతడు ఉద్దేశపూర్వకంగా ఆడవాళ్లను తాకుతున్నాడని అర్థమైంది. మాల్ రద్దీగా ఉండటంతో అతడు తాకుతున్నా ఆడవాళ్లు ఏదో యాదృచ్ఛికంగా తగిలాడు అన్నట్టుగా ముందుకు కదిలిపోతున్నారు. జయప్రకాష్ వెంటనే తన కెమెరాతో ఆ వ్యక్తి చర్యను రికార్డు చేశాడు. మాల్ వారికి కంప్లయింట్ చేశాడు. అంతేకాదు, సోషల్ మీడియాలో పెట్టాడు. అంతే! ఆ వీడియో దావానలంలా వ్యాపించింది. మాల్ వాళ్లిచ్చిన కంప్లయింట్ ఆధారంగా ఐపిసి సెక్షన్ 354 కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతణ్ణి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఒక రిటైర్డ్ హెడ్‌మాస్టర్. 8 నెలల క్రితమే రిటైర్ అయ్యాడు. వీడియో వైరల్ కావడంతో పోలీసులు రావడం కంటే ముందే అతను కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడు. అయినా పోలీసులు వెతుకుతున్నారు.

ఒక 'చిన్న దుశ్చర్య'- దారుణ ఫలితం: ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో అసభ్యంగా కొన్ని సెకన్లపాటు తాకడం పెద్ద తప్పేం కాదని మగవారనుకుంటారు. ఇది 'అత్యాచారం' కాదు కదా. బలవంతం చేయడం కాదు కదా... వారికి తెలిసే లోపల తాకి వెళ్లిపోతాం కదా అనుకుంటారు. కాని ఆ సెకన్ల చర్య కూడా స్త్రీలకు తెలుస్తుంది. వికారం కలిగిస్తుంది. ఇప్పుడు ఈ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ చేసిన చర్య బయట పడటంతో అతని పరువు, మర్యాదలు గంగలో కలిశాయి. కన్నడ టీవీ చానెళ్లు అతడి ఫొటో పెట్టి బజారుకు ఈడ్చాయి. పోలీసు కేసు నిరూపితమైతే శిక్ష కూడా పడుతుంది. బహుశా అతనికి ఎదిగొచ్చిన పిల్లలు, కొడుకు, కోడలు, కూతురు... వీరంతా ఉంటే వారి కుటుంబాలు కూడా మాటలు పడాలి. ఇవన్నీ మగవారు ఎందుకు ఆలోచించరు?



మ్యాన్ టచింగ్: ఇలా ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో తాకడాన్ని 'మ్యాన్‌టచింగ్' అని కొందరు అంటారు. ఒక స్త్రీ శరీరం అందుబాటులోకి వస్తే దానిని తాకొచ్చనే గుంపులో గోవింద స్వభావం మగవాణ్ణి ఇందుకు ఉసిగొల్పుతుంది. లైంగిక అభద్రతలు కొందరిని ఇలా చేయడానికి ప్రేరేపిస్తే, లైంగిక ఉద్రేకం కోసం కొందరు ఇలా చేస్తారు. గమనించాల్సిందేమంటే ఈ మగవారంతా మిగతా సమయాల్లో 'పరువు, మర్యాద, మంచి ఉద్యోగం' ఉన్న వ్యక్తులే. అపరిచితులు, పరిచితులు కూడా ఇలా చేస్తారు. ఎవరూ గమనించకుండా శరీర భాగాలు తాకేవారు కొందరైతే, వేదికల మీద పెళ్లిళ్లు, శుభకార్యాలలో పెద్దరికం వహిస్తూ బుగ్గలు పుణకడం, భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకోవడం మరికొందరు చేస్తారు. ఇవన్నీ స్త్రీల అనుమతి లేకుండా వారిని తాకడంగానే భావించాలి.

మగవాళ్లు దొంగసాకులు: 1. కొంచెమలా రాసుకుంటే ఏమవుతుంది అనుకోవడం... ఆమె మరీ రెచ్చగొట్టేలా ఉంది అనడం. 2. ఆమె నన్ను రెచ్చగొట్టి తాకేలా చేసింది అనడం 3. పరిచయం ఉన్న ఆమేగా... ఏమనుకుంటుందిలే అనుకోవడం 4. ఆమె పట్ల నా ఇష్టాన్ని తెలిపేందుకు అనడం... ఇలా ఏం చెప్పినా ఒక స్త్రీని ఆమె అనుమతి లేకుండా ఎక్కడా తాకకూడదు.

నిలువరించాలి: స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో 'ఎందుకులే రచ్చ' అనుకోకుండా ఇలా అసభ్యంగా తాకే వారిని వెంటనే నిలువరించాలి. చూపు ద్వారా, మాట ద్వారా వీరిని ఒక్క క్షణంలో నిలువరించవచ్చు. సాయం తీసుకుని పోలీసులకు పట్టివ్వొచ్చు. పరిచితులు అస్తమానం తాకుతూ ఉన్నా వారికి మొహమాటం లేకుండా తాకొద్దని చెప్పేయాలి. ముఖ్యంగా పిల్లలకు పబ్లిక్ ప్లేసుల్లో ఎవరినీ తాకనీకుండా చూసుకోవాలని హెచ్చరించాలి.

మన ఇంటి మగవారు: పై కేసులోని రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు కూడా ఒక ఇల్లు ఉంటుంది. ఇలా ఆడవాళ్లను తాకాలని చూసే మగవారు ఏ ఇంటిలో అయినా ఉండొచ్చు. ఇంటి ఆడవాళ్ల మాటల్లో మాటగా ఎవరైనా పబ్లిక్ ప్లేసుల్లో తమను తాకితే ఎంత కంపరంగా ఉంటుందో చెబుతుండాలి. అలా చేసిన వారిని పబ్లిక్‌గా పట్టుకొని దండిస్తే ఎంత అవమానంగా ఉంటుందో చెప్పాలి. స్త్రీలను గౌరవించి వారికి అసౌకర్యం కలిగించే ఏ పనీ చేయరాదని తప్పక చెప్పాలి. అలాగే సామాజిక ఆరోగ్యం కోసం మగవారు తమ చపలత్వాన్ని నివారించుకోవడం తప్పక అభ్యాసం చేయాలి- దొరికి దెబ్బలు తినడం కంటే అదే మేలు.

పురస్కారం

షేక్‌స్పియరే తన పవర్

'ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?

తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం'... మహాకవి మాట తిరుగులేని సత్యం అయినప్పటికీ కొన్నిసార్లు యుద్ధాలు, తారీఖులు, ప్రేమ పురాణాలు, ముట్టడికైన ఖర్చులు... చారిత్రక పరిశోధనకు అవసరం. ఏ సమాచారమూ వృథా పోదు.

వర్తమానంలో ఉండి ఆనాటి మొగల్, బ్రిటిష్ ఇండియాలోకి వెళ్లడం అంత తేలిక కాదు.

అలుపెరగని పరిశోధన కావాలి. అంతకుముందు కనిపించని ప్రత్యేక వెలుగు ఏదో ఆ పరిశోధనలో ప్రతిఫలించాలి.

అందమైన శైలికి అద్భుతమైన పరిశోధన తోడైతే...అదే 'కోర్టింగ్ ఇండియా' పుస్తకం.

ప్రొఫెసర్ నందిని దాస్ రాసిన 'కోర్టింగ్ ఇండియా: ఇంగ్లాండ్, మొఘల్ ఇండియా అండ్ ది ఆరిజిన్స్ ఆఫ్ ఎంపైర్' పుస్తకం ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్–2023 గెలుచుకుంది...



● నందినీ దాస్

ఇంట్లో, తరగతి గదిలో, పుస్తకాల్లో, టీవీల్లో విన్న కథల ద్వారా నందిని దాస్‌కు షేక్‌స్పియర్ ఇష్టమైన రచయితగా మారాడు. ఆ మహా రచయితపై ఇష్టం ఆంగ్ల సాహిత్యంపై ఇష్టంగా మారింది. ఆయన పుస్తకాలు తన మనోఫలకంపై ముద్రించుకుపోయాయి.

అలనాటి ప్రయాణ సాహిత్యం నుంచి భిన్న సంస్కృతుల మధ్య వైరుధ్యాల వరకు నందినికి ఎన్నో అంశాలు ఆసక్తికరంగా మారాయి. పరిశోధిస్తూ, రాసే క్రమంలో తన మానసిక ప్రపంచం విశాలం అవుతూ వచ్చింది.

యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో నందిని దాస్ ప్రొఫెసర్. షేక్‌స్పియర్ సాహిత్యం ఆమెకు కొట్టిన పిండి. ఆమె పేరు పక్కన కనిపించే విశేషణం...'స్పెషలిస్ట్ ఇన్ షేక్‌స్పియర్ స్టడీస్'

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో బీఏ ఇంగ్లీష్ చేసింది నందిని. ఆ తరువాత స్కాలర్‌షిప్‌పై యూనివర్శిటీ కాలేజి, ఆక్స్‌ఫర్డ్‌లో చేరింది. కేంబ్రిడ్జ్, ట్రినిటీ కాలేజిలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసింది. ఒక ప్రచురణ సంస్థలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా పని చేసిన నందిని సంవత్సరం తరువాత మళ్లీ అకాడమిక్ రిసెర్చ్‌లోకి వచ్చింది.

ఇక తాజా విషయానికి వస్తే...

'ది పవర్ ఆఫ్ గుడ్ రైటింగ్'గా విశ్లేషకులు కీర్తించిన 'కోర్టింగ్ ఇండియా' యూరోపియన్‌ల హింసా ధోరణి గురించి చెప్పింది. రాయబార కార్యాలయాల అసమర్థతను ఎత్తి చూపింది. మొఘల్ రాజకీయాలను ఆవిష్కరించింది.

'ఆనాటి బ్రిటన్, ఇండియాలకు సంబంధించి వాస్తవిక చిత్రాన్ని ఆవిష్కరించింది నందిని. మొగల్ రాజుల ఒడిదొడుకుల నుంచి బ్రిటీష్ వైఖరి వరకు ఈ పుస్తకంలో ఎన్నో కనిపిస్తాయి' అంటాడు బ్రిటీష్ అకాడమీ బుక్‌ప్రైజ్- చైర్ ఆఫ్ ది జ్యూరీ ప్రొఫెసర్ చార్లెస్ ట్రిప్.

వంటిల్లు

చలి కొరుకుడుని తట్టుకోవాలంటే నోటికి కాస్త వేడివేడి రుచులు తగలాల్సిందే. వేడితోపాటు కారం, కరకర లాడే కమ్మదనం తోడయితే చలిని కూడా కొరికేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు.

చలిని వెచ్చగా కొరికేద్దాం!



పొటాటో పాన్‌కేక్స్

కావలసినవి: ఉడికించి చిదుముకున్న బంగాళ దుంపలు – రెండు కప్పులు; గుడ్డు – ఒకటి; మైదా – ముప్పావు కప్పు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; చీజ్ తరుగు – కప్పు; క్యారట్ తురుము – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నూనె – అరకప్పు; పుల్లటి పెరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● గిన్నెలో చిదిమిన దుంపల మిశ్రమం, గుడ్డుసొన, మైదా, స్ప్రింగ్ ఆనియన్, చీజ్ తరుగు, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఈ మిశ్రమం చేతులకు అంటుకుంటున్నట్లు అయితే మరో టేబుల్ స్పూను మైదా వేసి కలపాలి ● పిండి ముద్దను ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసి పాన్‌కేక్‌లా వత్తుకోవాలి ● బాణలిలో నూనె వేయాలి. బాగా కాగిన నూనెలో ఒక్కో పాన్‌కేక్‌ను వేసి మీడియం మంట మీద కాల్చాలి ● క్రిస్పీగా బ్రౌన్ కలర్‌లోకి మారాక పాన్‌కేక్‌లను తీసేయాలి ● పాన్‌కేక్ పైన కొద్దిగా పుల్లటి పెరుగువేసి సర్వ్ చేసుకోవాలి.



పోహా వెజ్ కట్‌లెట్

కావలసినవి: అటుకులు – కప్పు; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; క్యాప్సికం తరుగు – రెండు టీస్పూన్లు; క్యారట్ తురుము – రెండు టీస్పూన్లు; పచ్చిబఠాణీ – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; కారం – టీస్పూను; పచ్చిమిర్చి పేస్టు – టీస్పూను; కార్న్‌ఫ్లోర్ – రెండు టేబుల్ స్పూన్లు; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అటుకులను శుభ్రంగా కడిగి పదినిమిషాలు నానబెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత నానిన అటుకుల్లో తొక్కతీసిన దుంపలు, బఠాణీ, క్యాప్సికం, క్యారట్, కొత్తిమీర తరుగు వేయాలి ● పచ్చిమిర్చి పేస్టు, చాట్ మసాలా, ధనియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ముద్దలా కలపాలి ● పిండిని ఉండలుగా చేసి, కట్‌లెట్‌లా వత్తుకుని పక్కన పెట్టుకోవాలి ● కార్న్‌ఫ్లోర్‌లో నీళ్లు పోసి పేస్టులా కలపాలి ● ఒక్కో కట్‌లెట్‌ను కార్న్‌ఫ్లోర్ పేస్టులో ముంచి, తరువాత బ్రెడ్ ముక్కల పొడిని అద్దాలి ● బ్రెడ్ ముక్కల పొడి అద్దిన తరువాత డీప్ ఫ్రై చేసుకోవాలి ● గోల్డెన్ కలర్‌లోకి మారాక తీసి సాస్ లేదా గ్రీన్ చట్నీతో సర్వ్ చేయాలి.



పనీర్ కుర్‌కురే

కావలసినవి: నిలువుగా కోసిన పనీర్ ముక్కలు – రెండు కప్పులు; పసుపు – టీస్పూను; కారం – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కసూరీ మేథీ – టేబుల్ స్పూన్; వాము – అరటీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; కార్న్‌ఫ్లేక్స్ – రెండు కప్పులు; శనగపిండి – రెండు కప్పులు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● పనీర్ ముక్కలపైన చిటికెడు సాల్ట్, కారం, టేబుల్ స్పూను కొత్తిమీర తరుగు, చాట్ మసాలా వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నె తీసుకుని శనగపిండి, వాము, అల్లం వెల్లుల్లి పేస్టు, కసూరీ మేథీ, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఇప్పుడు నీళ్లు పోసి బజ్జీపిండిలా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి ● ఒక ప్లేటులో కార్న్ ఫ్లేక్స్‌ను నలిపి పెట్టుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పనీర్ ముక్కను తీసుకుని ముందుగా శనగపిండి మిశ్రమంలో ముంచాలి. తరువాత కార్న్‌ఫ్లేక్స్‌ను అద్ది సలసలా కాగుతోన్న నూనెలో వేసి డీప్‌ఫ్రై చేయాలి ● పనీర్ ముక్క క్రిస్పీగా మారితే పన్నీర్ కుర్‌కురే రెడీ.



పాలక్ మేథీ పూరీ

కావలసినవి: జీలకర్ర – టేబుల్ స్పూను; సోంపు – టేబుల్ స్పూను; వాము – టీస్పూను; నువ్వులు – టేబుల్ స్పూను; ధనియాల పొడి – టేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; అల్లం తరుగు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; పాలకూర తరుగు – రెండు కప్పులు; మెంతికూర తరుగు – కప్పు; గోధుమ పిండి – రెండు కప్పులు; శనగపిండి – పావు కప్పు; పసుపు – అరటేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – టేబుల్ స్పూను; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● జీలకర్ర, సోంపు, నువ్వులు, వాము, ధనియాల పొడి, పచ్చిమిర్చి; అల్లం తరుగు, కరివేపాకుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర, మెంతికూర తరుగుని గిన్నెలో వేయాలి. దీనిలోనే గోధుమపిండి, శనగపిండి, కారం, పసుపు, గ్రైండ్ చేసిన మసాలా పొడి, రుచికి సరిపడా ఉప్పు, టేబుల్ స్పూను నూనె వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్ది కొద్దిగా వేడినీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి ● పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పూరీలా మందంగా వత్తుకోవాలి ● గుండ్రని గిన్నె లేదా చిన్న గ్లాసుతో పూరీని చిన్న చిన్న చెక్కల్లా కట్ చేయాలి ● అన్నీ రెడీ అయ్యాక క్రిస్పీగా మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రుచికరమైన పాలక్ మేథీ పూరీ రెడీ.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 223

శుక్రవారం | 3-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



రేవంత్ పప్పు.. రాహుల్ ముద్దపప్పు..

ఇద్దరు బిత్తిరోళ్లు కాళేశ్వరాన్ని చూసి మహా ఇంజనీర్లలా బ్రిడ్జి కూలిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

- వివరాలు 2లో



రూ. 80 వేల కోట్ల 'కాళేశ్వరం'లో..

కాళేశ్వరానికి రూ. 80 వేల కోట్లు ఖర్చయితే రూ. లక్ష కోట్లు దుర్వినియోగమైందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని హరీశ్ మండిపడ్డారు.

- వివరాలు 13లో

మూడో జాబితాలో 35 మంది..



- ఆందోల్ నుంచి బాబూమోహన్ అంబర్‌పేట నుంచి కృష్ణయాదవ్‌కు బీజేపీ టికెట్
- ఐదు ఎస్సీ, మూడు ఎస్టీ స్థానాలకు ఎంపిక
- బీసీలకు ప్రాధాన్యం.. ఒకే మహిళా అభ్యర్థికి చోటు
- మూడు జాబితాల్లో కలిపి 88 మంది అభ్యర్థుల ప్రకటన
- మునుగోడు, చెన్నూర్ సహా మరో 31 స్థానాలు పెండింగ్
- జనసేనకు కేటాయించే సీట్లపై స్పష్టత వచ్చాక తుది జాబితా

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల మూడో జాబితాను బీజేపీ విడుదల చేసింది. ఢిల్లీ, హైదరాబాద్‌లలో సుదీర్ఘంగా జరిగిన కసరత్తు అనంతరం గురువారం 35 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. దీంతో ఇప్పటివరకు మొత్తంగా 88 మంది అభ్యర్థులను ప్రకటించినట్టు అయింది. ఇటీవల కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఇద్దరూ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ కండువా కప్పుకున్న నేపథ్యంలో వారికి సంబంధించిన మునుగోడు, చెన్నూరు సహా మొత్తం 31 స్థానాలకు ఇంకా అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

ఒకే మహిళకు చోటు..

తొలి జాబితాలో బీసీలకు, మహిళలకు పెద్దపీట వేసిన బీజేపీ అధిష్టానం.. మూడో జాబితాలో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చినా, ఒకే మహిళకు అవకాశం కల్పించింది. మొత్తం 14 మంది బీసీలకు చోటు కల్పించగా, 13 మంది ఓసీ, ఐదుగురు ఎస్సీ, ముగ్గురు ఎస్టీ అభ్యర్థులు ఉన్నారు. మూడో జాబితాలో ఆందోల్ నుంచి మిగతా 5వ పేజీలో ▶

8 మంది సీఎంలతో ఒప్పందం!



- గోదావరి–కావేరి, బెడ్తి–వార్దా నదుల అనుసంధానంపై కేంద్రం కసరత్తు -15లో
- రాష్ట్రాలకు చేరిన ముసాయిదా ఎంఓయూ
- 10న జలసౌధలో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం



మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న రాహుల్‌గాంధీ. చిత్రంలో రేవంత్‌రెడ్డి

లక్షన్నర కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి!

అంబట్‌పల్లి మహిళా సాధికారత సదస్సులో రాహుల్

- కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజా ధనం దోపిడీ
- కేసీఆర్‌కు, ఆయన ఫ్యామిలీకి అది ఏటీఎంగా మారింది
- దొరల సర్కారును పారదోలి ప్రజల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం
- మహిళలకు మేలు చేసే పథకాలు అమలు చేస్తాం
- టీపీసీసీ నేతలతో కలిసి మేడిగడ్డ ప్రాజెక్టు పరిశీలన
- పలు చోట్ల పగుళ్ల గమనించానంటూ ట్వీట్

సాక్షి ప్రతినిధి, వరంగల్: లక్షన్నర కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, కాళేశ్వరం పేరుతో లక్ష కోట్ల ప్రజాధనం దోపిడీ జరిగిందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. కాళేశ్వరం బీఆర్ఎస్ ఏటీఎం అని ఇక్కడి వాళ్లు చెబుతున్నారని, కానీ అది బీఆర్ఎస్ ఏటీఎం కాదు.. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యుల ఏటీఎం అని చెబుతున్నానని అన్నారు. ప్రాజెక్టులో ఏం జరుగుతోందో ప్రత్యక్షంగా చూసేందుకే మేడిగడ్డకు వచ్చానన్నారు. రాష్ట్ర సంపదను దోచుకుని ప్రతి కుటుంబంపై అప్పు భారాన్ని మోపారన్నారు. దొరల తెలంగాణ, ప్రజల తెలంగాణ మిగతా 13వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు బీఆర్ఎస్ గూటికి కాసాని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయ కూడదన్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆ పార్టీకి రాజీనామా చేసిన టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరనున్నారు. గజ్వేల్‌లోని ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ఆయన ఉదయం 11.30 గంటలకు గులాబీతీర్థం తీసుకోనున్నారు. యాగం జరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయక్షేత్రం వద్ద నెలకొన్న భద్రతా కారణాల దృష్ట్యా పరిమిత సంఖ్యలో ఆయన అనుచ రులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల్లో టీటీడీపీ పోటీ చేయరాదని పార్టీ అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో విభేదిస్తూ జ్ఞానేశ్వర్ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా లేదా రాజ్యసభ ఎంపీగా అవకాశమిస్తామని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ హామీనిచ్చినట్లు సమాచారం.

అలంపూర్ బీ ఫారం అబ్రహంకు ఖాయం!

నాంపల్లి, గోషామహల్ అభ్యర్థులు కూడా ఖరారు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెండింగ్‌స్థానాలకు కూడా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసినట్లు సమాచారం. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకుగాను గోషామహల్, నాంపల్లి మినహా మిగతా సెగ్మెంట్ల అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. ఆలంపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంతోపాటు హైదరాబాద్‌లోని మరో తొమ్మిది మంది అభ్యర్థులకు ఇంకా ఆ పార్టీ బీ ఫారాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహంతోపాటు గోషామహల్ నుంచి నందకిషోర్ వ్యాస్, నాంపల్లి నుంచి ఆనంద్‌గౌడ్‌కు కూడా శుక్రవారం బీ ఫారాలు ఇచ్చే అవకాశం ఉంది. వీరితోపాటు మజ్లిస్ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న మరో ఏడు నియోజకవర్గాల అభ్యర్థులకు కూడా శుక్రవారం బీ ఫారాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్లు సమాచారం.

దయచేసి ఆసుపత్రికి రావొద్దు

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి వీడియో సందేశం



దుబ్బాక టౌన్: భగవంతుడి ఆశీస్సులు.. కార్యకర్తల ఆశీర్వాదంతో ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డాను.. దయచేసి తనను చూసేందుకు ఆస్పత్రికి వచ్చి ఇబ్బంది పడొద్దని ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అందరినీ విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి ఆస్పత్రి నుంచి ఆయన మాట్లాడిన వీడియోను విలేకరులకు పంపించారు. 'దేవుడి దయతో కొద్దిరోజుల్లోనే కోలుకొని మీ ముందుకు వస్తాను.. దయచేసి నన్ను చూసేందుకు ఆసుపత్రికి ఎవరూ రావొద్దు'.. అని కొత్త ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీ సెగ్మెంట్లకు బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

సాక్షి, హైదరాబాద్: పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ సమన్వయకర్తలను భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు గురువారం ప్రకటించారు. పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల వెంకటరమణ(అశ్వారావుపేట), కడారి అంజయ్య(నాగార్జునసాగర్), ఈగ మల్లేశం(వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్) సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. గతంలో 54 నియోజకవర్గాలకు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలకు సమన్వయకర్తలుగా బాధ్యతలు అప్పగించారు.



కొత్తదనం కోసం వెతుక్కుంటూ సారు సంవత్సరానికోసారి పార్టీ మారతారు!

నేటి నుంచి నామినేషన్లు

▶ మొదటి పేజీ తరువాయి

పోలింగ్ జరగనుంది. ఇటీవల ప్రకటించిన తుది జాబితా ప్రకారం రాష్ట్రంలోని మొత్తం 3,17,17,389 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. త్వరలో ప్రకటించనున్న అనుబంధ ఓటర్ల జాబితాతో ఈ సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

సర్వం సిద్ధం...

రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో సమాయత్తమైంది. దాదాపుగా ఏడాది ముందు నుంచే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించింది. ప్రత్యేకంగా ఓటర్ల జాబితా రెండో సవరణ, ఈవీఎంలు సిద్ధం చేయడం, ఎన్నికలు/ పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కనీస సదుపాయాల కల్పన, దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాల కల్పన, భద్రత ఏర్పాట్లను పూర్తి చేసింది.

పటిష్ట బందోబస్తు, ఎక్కడికక్కడ నిఘా

ఎన్నికల్లో ఓటర్లను డబ్బులు, మద్యం, ఇతర కానుకలతో ప్రలోభపెట్టేందుకు జరిగే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఈసారి ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. 4 రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే 17 జిల్లాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. 89 పోలీసు చెక్‌పోస్టులు, 14 రవాణా, 16 వాణిజ్య పన్నులు, 21 ఎక్సైజ్, 8 అటవీ శాఖ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని జిల్లాల్లో వీడియో నిఘా బృందాలు, వీడియో వ్యూయింగ్ టీమ్‌లు, అకౌంటింగ్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలియన్స్ టీంలు, ఖర్చుల పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు 119 నియోజకవర్గాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన 67 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమించింది. శాంతిభద్రతల పర్యవేక్షణ, బందోబస్తు ఏర్పాట్లు, పరిపాలన, పోలీసు విభాగాల మధ్య సమన్వయం కోసం 39 మంది ఐపీఎస్ అధికారులను నియమించింది. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న సుమారు



50 మందిని వ్యయ పరిశీలకులుగా నియమించింది. పోలింగ్ రోజు అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

3 వాహనాలు.. ఐదుగురికే అనుమతి

శుక్రవారం ఉదయం 11 గంటలలోపు ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఆ వెంటనే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించే సహాయ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్వోలు) పేరు, రిటర్నింగ్ అధికారి కార్యాలయ చిరునామాను ప్రకటిస్తూ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి 'ఫారం-1'నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఉదయం 11 గంటల నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోపు ఒక్కో అభ్యర్థికి సంబంధించిన 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి రూమ్‌లోకి అనుమతిస్తారు. నామినేషన్‌తో పాటుగా నిర్దేశిత ఫారం -26లో అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు వంటి వివరాలను అఫిడవిట్ రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల వ్యయం పర్యవేక్షణ కోసం నామినేషన్ల దాఖలుకు కనీసం ఒకరోజు ముందు ప్రతి అభ్యర్థి ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన 'సువిధ' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చు. అయితే సంతకాలు చేసిన హార్డ్ కాపీని గడువులోగా ఆర్వోకు సమర్పించాల్సి ఉంటుంది.

రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్

అంశం	తేదీ
గెజిట్ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం	03.11.2023
నామినేషన్ల స్వీకరణకు తుది గడువు	10.11.2023
నామినేషన్ల పరిశీలన తేదీ	13.11.2023
నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు	15.11.2023
పోలింగ్ తేదీ	30.11.2023
ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన	03.12.2023
ఎన్నికల ప్రక్రియ ముగింపు తేదీ	05.12.2023

అంకెల్లో అసెంబ్లీ ఎన్నికలు

అక్టోబర్ 4న ప్రచురించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో ఉన్న ఓటర్లు

మహిళా ఓటర్లు	1,58,43,339
పురుష ఓటర్లు	1,58,71,493
ఇతరులు	2,557
మొత్తం ఓటర్ల సంఖ్య	3,17,17,389
మొత్తం సర్వీస్ ఓటర్లు	15,338
ఎన్ఆర్ఐ ఓటర్లు	2,780
100 ఏళ్ల పైబడిన ఓటర్లు	7,689
80 ఏళ్ల పైబడిన ఓటర్లు	4.43 లక్షలు
18–19 ఏళ్ల యువ ఓటర్లు	8.11 లక్షలు

శాసనసభ నియోజకవర్గాలు

ఎస్సీ రిజర్వుడ్	19
ఎస్టీ రిజర్వుడ్	12
జనరల్	88
మొత్తం	119

పోలింగ్ కేంద్రాలు

పట్టణ పోలింగ్ కేంద్రాలు	14,458
గ్రామీణ పోలింగ్ కేంద్రాలు	20,898
మొత్తం పోలింగ్ కేంద్రాలు	35,356
అనుబంధ పోలింగ్ కేంద్రాలు	217
సున్నిత పోలింగ్ కేంద్రాలు	10,969

గత రెండు శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోలింగ్ శాతం..

ఓటర్లు	2014 సాధారణ ఎన్నికలు	2018 సాధారణ ఎన్నికలు
పురుషులు	68.64 %	72.54%
మహిళలు	69.03 %	73.88%
మొత్తం	68.78 %	73.2%



పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు. చిత్రంలో స్వరూపానందేంద్రస్వామి

శివకామ సుందరీదేవిగా అమ్మవారు

రెండో రోజూ కొనసాగిన రాజశ్యామల యాగం

మర్కూక్ (గజ్వేల్): సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల పరిధిలో సీఎం కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం రెండో రోజు అత్యంత వైభవంగా కొనసాగింది. యాగంలో భాగంగా గురువారం రాజశ్యామల యంత్రపూజ కార్యక్రమాన్ని రుత్వికులు ఘనంగా నిర్వహించారు. విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములతో పాటు రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌రావు, ఎమ్మెల్సీ కవిత యాగ క్రతువును పర్యవేక్షించారు. యాగశాలలో రాజశ్యామల అమ్మవారు శివకామ సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ యాగంలో మూడు లక్షలకు మించి రాజశ్యామల మూల మంత్రాలను హవనం చేశారు. అలాగే 11సార్లు శాలిని దుర్గ కవచ పారాయణం నిర్వహించారు. సర్వలోక సంరక్షణార్థం ఇంద్రసుక్త హోమం, నవగ్రహ సుక్త హోమం నిర్వహించారు. షాడావరణ సహిత మూల మంత్రాలతో సుబ్రహ్మణ్య కవచ యాగం నిర్వహించారు.

పోలింగ్‌కు ముందే రాష్ట్ర సరిహద్దుల మూసివేత

- కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ ఆదేశం... నవంబర్ 28 నుంచి 30 వరకు డ్రై డేగా ప్రకటించాం
- ఈసీ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలిపిన సీఎస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల పోలింగ్ జరిగే నవంబర్ 30వ తేదీకి ముందే రాష్ట్ర సరిహద్దులను మూసివేసి బయటి రాష్ట్రాల నుంచి వ్యక్తులు రాష్ట్రంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అధికారులను ఆదేశించారు. తెలంగాణతో సహా 5 రాష్ట్రాల్లో శాసనసభ సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలతో పాటు వాటి సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్...ఎన్నికల కమిషనర్లు ఏసీ పాండే, అరుణ్ గోయెల్‌తో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ రాష్ట్ర సచివాలయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని, శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని శాంతికుమారి వివరించారు. సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో సంప్రదింపులు జరిపి సరిహద్దు చెక్‌పోస్టును కట్టుదిట్టం చేశామని వివరించారు. నవంబర్ 28 నుంచి పోలింగ్ జరిగే 30 వరకు రాష్ట్రంలో డ్రై డేగా ప్రకటించామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉన్నాయని, సాధారణ నేర కార్యకలాపాలు కూడా తగ్గుముఖం పట్టాయని డీజీపీ అంజనీకుమార్ తెలిపారు.

ఆలిండియా ముద్దపప్పు.. తెలంగాణ పప్పు

- రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ సెటైర్
- ఇద్దరు బిత్తిరోళ్లు కాళేశ్వరం బ్రిడ్జి కూలిపోతోందని ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా
- కాళేశ్వరం ప్రాజెక్టును అవినీతి అనడం వారి అవగాహనా రాహిత్యమని మండిపాటు
- పార్టీ టికెట్లు అమ్ముకున్న రేవంత్ రాహుల్‌నూ అమ్మేస్తాడని వ్యంగ్యాస్త్రం



గడ్డం నాగరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ పప్పు రేవంత్ రెడ్డి, ఆల్ ఇండియా ముద్దపప్పు రాహుల్ గాంధీ దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయ్యమన్నట్లు మాట్లాడుతున్నారు. ఇద్దరు బిత్తిరోళ్లు ఎగేసుకుని పోయి కాళేశ్వరం ప్రాజెక్టును చూసి వచ్చి మహా ఇంజనీర్లలా బ్రిడ్జి కూలిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బ్రిడ్జిపై ఉండే ఎక్స్‌పాన్షన్ జాయింట్ల ఫొటోలు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయం అనడం రాహుల్, రేవంత్‌ల అవగాహనారాహిత్యానికి నిదర్శనం'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మానకొండూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు గురువారం తన అనుచరులతో కలసి తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా చెత్తాచెదారం, టీపీసీసీ అంటే తెలంగాణ పెరట్లో చెత్తా చెదారంలా తయారైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'దేశంలోనే అతిపెద్ద అవినీతిపరుడు, బ్లాక్ మెయిలర్, నోటుకు ఓటు దొంగ, కాంగ్రెస్ పార్టీ టికెట్లను అంగట్లో పశువుల్లా అమ్ముతున్న రేవంత్‌ను పక్కన పెట్టుకొని రాహుల్ అవినీతి గురించి మాట్లాడుతున్నాడు. దావూద్ ఇబ్రహీం, చార్లెస్ శోభరాజ్ కంటే డేంజర్ అయిన రేవంత్‌రెడ్డి.. రాహుల్ గాంధీని కూడా కోఠిలో చారాణాకో, ఆఠాణాకో అమ్మేస్తాడు'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

దేశానికి శనీశ్వరం కాంగ్రెస్ పార్టీ..

'కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికి వరమైతే కాంగ్రెస్ పార్టీ దేశానికి శనీశ్వరం. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలనంటూ మాట్లాడుతున్న రాహుల్ తన కుటుంబ నేపథ్యం ఏమిటో చెప్పాలి? కాళేశ్వరం ప్రాజెక్టులోని చిన్న లోపాలను పెద్దవిగా చూపి బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారు. రెండు జీవ నదుల నడుమ ఉన్న తెలంగాణను దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ కరువు కోరల్లోకి నెట్టింది. కాంగ్రెస్ పుణ్యాన తెలంగాణలో నేల నెర్రెలు వారింది. విప్లవ ఉద్యమాల నెత్తురుతో ఎర్రవారింది. రాహుల్ గాంధీకి తెలంగాణ చరిత్ర తెలియదు. తెలుసుకొనే సోయి, పరిజ్ఞానం కూడా లేదు. 60 ఏళ్ల పాలనలో తెలంగాణలో ప్రాజెక్టులు, చెక్‌డ్యాంల నిర్మాణం జరగలేదు. కాంగ్రెస్ పాలన సక్రమంగా జరిగి ఉంటే నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఎందుకు ఉద్యమించారు?'అని కేటీఆర్ ప్రశ్నించారు.

ఢిల్లీ నుంచి వచ్చి దాడి చేస్తే ఊరుకోం..

'కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వరి సాగులో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రం తెలంగాణ. ప్రాజెక్టు ఫెయిలైతే 3.50 కోట్ల టన్నుల ధాన్యం ఎలా పండింది? కాళేశ్వరం గురించి ఆయన పక్కన ఉన్న సన్నాసులు చెప్పేది కాకుండా రాహుల్ అసలు విషయాలు తెలుసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ. 80 వేల కోట్లు ఖర్చు చేస్తే రూ. లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుంది? కుంభకోణాల కుంభమేళా కాంగ్రెస్ పార్టీ నీతి, నిజాయతీ గురించి మాట్లాడితే జనం నవ్వుకుంటున్నారు. ఇది ఢిల్లీ దొరలకు, 4 కోట్ల తెలంగాణ ప్రజలకు నడుమ జరుగుతున్న ఎన్నిక. మోదీ విధానాలు జుమ్లా లేదా హమ్లా. ఢిల్లీ నుంచి వచ్చి తెలంగాణపై దాడి చేస్తే సహించేది లేదు'అని కేటీఆర్ హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, దరువు ఎల్లన్న, సిద్దం వేణు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో సాగితే విజయం తథ్యం

- అందుకు ముఖ్యమంత్రి కేసీఆరే చక్కటి ఉదాహరణ
- తెలంగాణ లక్ష్యసాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిలబడి గెలిచారు
- ఎస్టీ ఆంట్రప్రెన్యూర్స్ సక్సెస్ మీట్‌లో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రతి వ్యక్తీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడితే విజయం తప్పకుండా వరిస్తుందని మంత్రి కె.తారక రామారావు అన్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ మన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అని వివరించారు. కేసీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక సింగిల్ విండో ఎన్నికల్లో నిరుత్సాహపడినా ఆ తర్వాత పట్టుదలతో కష్టపడ్డారన్నారు. తెలంగాణ లక్ష్యసాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా తట్టుకొని నిలబడ్డారని.. ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదని చెప్పారు. గురువారం ఓ హోటల్‌లో ఎస్టీ ఆంట్రప్రెన్యూర్స్ సక్సెస్ మీట్‌లో మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలసి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలలు కనాలని, అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. గిరిజన పారిశ్రామికవేత్తలను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలతో గిరిజన యువత అత్యున్నత స్థాయికి ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ఏ కులంలో పుట్టామనేది ముఖ్యం కాదని, అవకాశాలను అందిపుచ్చుకోవడం అత్యంత కీలకమని చెప్పారు. ఆంట్రప్రెన్యూర్స్‌గా ఎదిగిన గిరిజన యువత భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు కావాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ గతంలో జరిగిన ఆసక్తికరమైన ఘటనను తెలియజేశారు. గతంలో సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు షాపూర్జీ–పల్లోంజీ గ్రూప్‌కు చెందిన దివంగత బిజినెస్ టైకూన్ సైరస్ మిస్త్రీ వచ్చారని చెప్పారు. అప్పుడు తన తండ్రి షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌లో సబ్‌కాంట్రాక్టర్‌గా పనిచేసినట్లు కేసీఆర్ గుర్తుచేసుకోగా మిస్త్రీ ఆశ్చర్యపోయారని కేటీఆర్ పేర్కొన్నారు. సైరస్ మిస్త్రీ ఇంటికి వెళ్లిన తర్వాత రికార్డులు తిరగేసి ఫోన్ చేశారని, 1950–60 మధ్య కాలంలో పనిచేసినట్లు వివరించారన్నారు.

ఎన్నికల్లో గెలిచేది మళ్లీ మేమే..

త్వరలో ఎస్టీ ఆంట్రప్రెన్యూర్స్ కోసం ఉత్పత్తుల పార్కు పెడతామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలో ముగ్గురు దళితబంధు లబ్ధిదారులు రైస్‌మిల్లు పెట్టుకున్నారని చెప్పారు. అదేవిధంగా వాటర్ వర్క్స్ విభాగానికి దళితబంధు పథకం కింద 150 వాహనాలు పంపిణీ చేశామన్నారు. వచ్చే నెల 3న మరోసారి బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని, అప్పుడు మళ్లీ సక్సెస్ మీట్ జరుపుకుందామని చెప్పారు.

సీఎం వల్లే ఎస్టీల ఎదుగుదల: సత్యవతి రాథోడ్

రాష్ట్రంలో గిరిజనులు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని, సీఎం కేసీఆర్ విజన్ వల్లే ఇది సాధ్యమైందని మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. గతంలో అనేక పార్టీలు, ప్రభుత్వాలను చూశామని, కానీ గిరిజనులను ఎవరూ పట్టించుకోలేదన్నారు. గిరిజనులు చదువు తర్వాత ఉద్యోగం చేసే స్థాయి నుంచి ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదిగారని, గిరిజనులపై సీఎం కేసీఆర్‌కు ప్రేమ ఉందన్నారు. బీఆర్ఎస్ పాలన లోనే గిరిజన రిజర్వేషన్ పెంచుకోవడంతోపాటు మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎస్టీలకు మరిన్ని అవకాశాలు కల్పించామని, గిరిపుత్రులకు పోడు పట్టాలు అందించామని గుర్తుచేశారు. ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని, ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తే మనం నష్టపోతామని వ్యాఖ్యానించారు.

పంటికి తగలకుండా మింగేస్తరు!

▶ మొదటి పేజీ తరువాయి

మీరే కొట్లాడాలి. ప్రజలు ఎన్నికల్లో నిలబడే అభ్యర్థుల మంచి చెడులను విచారించాలి. ఆగం కావొద్దు. నేను మాట్లాడిన మాటలు ఇక్కడనే విడిచిపెట్టొద్దు. మీ గ్రామాలకు వెళ్లిన తర్వాత చర్చ పెట్టాలి. ఎన్నికల్లో పార్టీలు కాదు ప్రజలు గెలవాలి. ఈ ప్రజాస్వామ్య దేశంలో మీ దగ్గరున్న విలువైన వజ్రా యుధం ఓటు. పోటీచేసే ప్రతి అభ్యర్థి గుణగణా లు, ఆయా పార్టీల చరిత్ర, నడవడిక, దృక్పథం మీద చర్చ జరగాలి. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో కర్ఫ్యూ లేదు. మత కల్లోలాలూ లేవు. అలాంటిది బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపైనే కాంగ్రెస్ కత్తుల దాడి జరిగింది. వాళ్ల దుర్మార్గమైన సంస్కృతిని తయారు చేస్తున్నారు. కేసీఆర్ ప్రాణంతో ఉన్నంత వరకు తెలంగాణలో శాంతిభద్రతలు ఉంటాయి.

నెహ్రూ కాలం నుంచే దృష్టిపెట్టి ఉంటే..

కాంగ్రెస్ హయాంలో దళిత సమాజం అణచి వేయబడింది. వారిని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారు. నెహ్రూ కాలం నుంచే వీరి సంక్షేమంపై దృష్టిపెట్టి ఉంటే దళితుల పరిస్థితి ఇలా ఉండేది కాదు. అసలు దళితబంధు అనే పథకాన్ని పుట్టించినదే బీఆర్ఎస్ పార్టీ. దళిత సమాజాన్ని ఉద్ధరించాలన్నదే మా లక్ష్యం. ఏ ప్రధాని, సీఎం కూడా దళితబంధు లాంటి ఆలోచన చేయలేదు. గిరిజనులకూ పోడు పట్టాలు ఇవ్వడంతోపాటు రైతుబంధు, రైతు బీమా ఇస్తున్నాం.

కరెంటు, నీళ్లు, రైతుబంధు..

నీటి తీరువా రద్దుచేశాం. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్నాం. పండిన పంటనూ ప్రభుత్వమే కొంటోంది. రైతు రుణమాఫీ అందరికీ వస్తోంది. ఒకప్పుడు అంజుమన్ బ్యాంక్ అప్పులు బాకీ ఉంటే రైతుల ఇండ్ల తలుపులు గుంజుకుపోయేవారు. అలాంటి పరిస్థితులు రాకుండా, రైతుల బాధలు తీర్చాలని రైతుబంధు అమలు చేస్తున్నాం. ఇదేదో ఎలక్షన్ల కోసం చేయలేదు. నాకు రైతుబంధు పెట్టాలని ఎవరైనా దరఖాస్తు ఇచ్చారా? ఉద్యమం చేశారా? నా అంతట నేను రైతు నాయకులు, మేధావులతో చర్చించి నిర్ణయం తీసుకున్నా. దాని ఫలితం తెలంగాణ ఇవాళ 3కోట్ల టన్నుల ధాన్యం పండిస్తున్నది.

కాంగ్రెస్‌కు ఓటేస్తే పెద్ద పాము మింగినట్టే!

ఎన్నికలు రాగానే కాంగ్రెస్ పార్టీ ఒక్క చాన్స్ అంటూ వస్తోంది. ఇంతకుముందు 11 సార్లు అధికారంలో ఉన్నప్పుడు వారు ఏంచేశారో ప్రజలు ఆలోచన చేయాలి. అన్నిరంగాల సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌కు ఓటేస్తే కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్టే. ప్రజల పన్నులను దుబారా చేస్తూ రైతుబంధు ఇస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు. వ్యవసాయానికి 24 గంటలు కరెంటు వృథా, మూడు గంటలు ఇస్తే చాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్తున్నారు. ధరణి పోర్టల్ వద్దంటున్నారు. ధరణిని రద్దుచేస్తే మళ్లీ పైరవీకారుల దందాలు షురూ అవుతాయి. ధరణి పోర్టల్ తీసివేస్తే రైతుబంధు, వడ్ల డబ్బులు ఎట్లా ప్రజల ఖాతాల్లోకి రావాలి?

పదేళ్లలో నంబర్ వన్‌గా నిలిచాం

గత పదేళ్లలో దేశంలో తెలంగాణ అన్ని విషయాల్లో నంబర్ వన్‌గా నిలిచింది. తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉన్నాం. తలసరి విద్యుత్ వినియోగంలో రాష్ట్రం నంబర్ వన్‌గా ఉంది. త్వరలోనే మిగులు విద్యుత్ సాధించబోతున్నాం. బీఆర్ఎస్ గెలిస్తే రైతుబీమా తరహాలో రాష్ట్రంలో రేషన్‌కార్డున్న 93 లక్షల కుటుంబాలకు రూ.5లక్షల బీమా పథకాన్ని అమలు చేస్తాం. ఒకవేళ కాంగ్రెస్, బీజేపీలలో ఎవరు అధికారంలోకి వచ్చినా రైతుబంధుకు రాంరాం పలుకుతారు. దళితబంధుకు జైభీం చెప్తారు. కరెంట్ కట్ చేస్తారు. ఇచ్చే కొంచెం కూడా పగలు, రాత్రి సరఫరా చేస్తారు. కర్ణాటకలో వ్యవసాయానికి ఐదు గంటలే కరెంట్ ఇస్తున్నారు. ఏది మంచో, ఏది చెడో రైతులు తేల్చుకోవాలి.



ధర్మపురిలో గురువారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభకు భారీగా హాజరైన ప్రజలు

మోటార్లకు మీటర్లు పెట్టేదేలేదని చెప్పిన

ప్రధాని మోదీకి ప్రైవేటీకరణ పిచ్చిపట్టింది. విమాన రంగం, రైల్వేలు, విద్యుత్ వ్యవస్థలను ప్రైవేటు బాట పట్టించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడి తెస్తే.. చావడానికైనా సిద్ధమేగానీ మీటర్లు పెట్టనని చెప్పిన. మనకు రావాల్సిన రూ.25వేల కోట్ల నిధులకు కేంద్రం కోత పెట్టినా మీటర్లు పెట్టలేదు. యూపీ సీఎం బీజేపీ తరఫున ప్రచారానికి వచ్చి నోటికి ఏది వస్తే అది మాట్లాడుతారు. వాళ్ల మాటలు వింటే నెత్తి పగలగొట్టుకోవాలి అనిపిస్తుంది.

ఆ నియోజకవర్గాలకు హామీలు

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే జేఎన్టీయూతో మాట్లాడి నిర్మల్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ పెట్టిస్తామని కేసీఆర్ ప్రకటించారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని చెప్పారు. మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను 70 వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గం అంతా దళితబంధు అమలు చేస్తామన్నారు. నిర్మల్ సభలో ఎంపీ దామోదర్‌రావు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్, బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్, ధర్మపురి సభలో కొప్పుల ఈశ్వర్, బాల్కొండ సభలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

అపరాధ రుసుము లేకుండా 17 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసింది. ఈ నెల 17 వరకూ ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు స్పష్టం చేశారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 1 వరకూ, రూ.200తో డిసెంబర్ 11 వరకూ, రూ.500తో డిసెంబర్ 20 వరకూ ఫీజు చెల్లించే అవకాశం ఉందని వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులకు రూ.125 మాత్రమే ఫీజు ఉంటుందని, మూడు సబ్జెక్టులు.. అంతకంటే తక్కువ సబ్జెక్టుల్లో ఫెయిలైన అభ్యర్థులకు రూ.110 ఫీజు ఉంటుందని వివరించారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారికి రూ.125 ఫీజు ఉంటుందని, రెగ్యులర్ ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష ఫీజును ఆయా స్కూల్ హెడ్మాస్టర్లకు చెల్లించాలని, వారు ఎగ్జామినేషన్ డైరెక్టర్‌కు చెల్లిస్తారని వెల్లడించారు.

జేఈఈ మెయిన్స్ నోటిఫికేషన్ విడుదల

- మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- ఈ నెలాఖరు వరకూ దరఖాస్తులకు చాన్స్
- పరీక్షకు మూడు రోజుల ముందు హాల్ టికెట్లు
- మెయిన్స్‌కు భారీగా తగ్గిన సిలబస్
- ఈసారి కాస్త తేలికగానే పేపర్ కూర్పు
- ఫిబ్రవరి 12న ఫలితాలు వెల్లడిస్తామన్న ఎన్‌టీఏ



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం అర్ధరాత్రి విడుదల చేసింది. గురువారం ఉదయం నుంచి మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 30వ తేదీ వరకూ కొనసాగుతుంది. పరీక్ష కేంద్రాలను జనవరి రెండో వారంలో వెల్లడిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థుల హాల్ టికెట్లు పరీక్షకు మూడు రోజుల ముందు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది.

దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ప్రవేశానికి రెండు దశల ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన వారిలో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకును బట్టి ఐఐటీల్లో సీట్లు వస్తాయి. మిగతా జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఈఈ మెయిన్స్ ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. తొలి దశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకూ ఉంటుంది. రెండో దశ ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏ సెషన్‌కైనా, లేదా రెండింటికీ దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫలితాలను ఫిబ్రవరి 12వ తేదీన వెల్లడిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. తెలుగు సహా మొత్తం 13 భాషల్లో జేఈఈ మెయిన్స్ ఉంటుంది.

ప్రతీ సబ్జెక్టులోనూ 10 టాపిక్స్, ఫిజిక్స్‌లో 12 టాపిక్స్ తీసివేత

కోవిడ్ సమయంలో ఎన్‌సీఈఆర్టీ, సీబీఎస్ఈ సిలబస్‌ను కుదించారు. దీంతో కొన్ని టాపిక్స్‌లో బోధన జరగలేదు. ఇది దృష్టిలో ఉంచుకుని జేఈఈ మెయిన్స్ సిలబస్‌లోనూ ఈసారి భారీ మార్పులు చేశారు. మ్యాథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో పది చొప్పున, ఫిజిక్స్‌లో 12 చొప్పున టాపిక్స్‌ను జేఈఈ మెయిన్స్‌లో ఇవ్వకూడదని నిర్ణయించారు. జేఈఈ పరీక్ష కఠినంగా ఉంటోందనే సంకేతాలు రావడంతో ఈసారి పరీక్ష పేపర్ కూర్పులోనూ మార్పులు చేశారు. ముఖ్యంగా గణితంలో సుదీర్ఘ పద్ధతిలో సమాధానాలు రాబట్టే ప్రశ్నల నుంచి కొంత వెసులుబాటు ఇచ్చారు. మాథ్స్‌లో కఠినంగా భావిస్తున్న ట్రిగ్నామెట్రిక్స్ ఈక్వేషన్స్, మేథమెటికల్ రీజనింగ్‌ను తొలగించారు. దీనివల్ల సమాధానాలు రాబట్టేందుకు సమయం కలిసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.

5న బీసీ సంక్షేమ సంఘ సమావేశం: జాజుల

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చించి, బీసీల రాజకీయ విధానాన్ని ప్రకటించేందుకు ఈనెల 5న హైదరాబాద్‌లోని సెంట్రల్‌కోర్టులో బీసీ సంక్షేమ సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 60 అసెంబ్లీ స్థానాలు, బీసీలకు ముఖ్యమంత్రి పదవి కావాలనే ప్రధాన డిమాండ్‌తో రాజకీయ పోరాటం చేస్తున్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రకులాలకే రాజకీయ ప్రాధాన్యతను కల్పిస్తున్నాయని గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. బీసీలను రాజకీయంగా అణచివేయాలని ఆ పార్టీలు చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నగరంలో ఐటీ దాడుల కలకలం

- 14 ప్రాంతాల్లో ఉదయం నుంచే సోదాలు
- కాంగ్రెస్ మహేశ్వరం అభ్యర్థి కేఎల్ఆర్, పీసీసీ నేత, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తోడల్లుడు గిరిధర్ రెడ్డి, వ్యాపారవేత్త వంగేటి లక్ష్మారెడ్డి ఇళ్లపైనా దాడి
- పారిజాతను తిరుపతి నుంచి, ఆమె భర్తను ఢిల్లీ నుంచి రప్పించిన అధికారులు
- సోదాల్లో కొంత నగదు, కీలక పత్రాలు స్వాధీనం!


చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని కాంగ్రెస్ నాయకులు, వారి బంధువుల ఇళ్లలో ఐటీ అధికారులు గురువారం విస్తృత సోదాలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న సమయంలో జరిగిన తనిఖీలు నగరంలో కలకలం రేపుతున్నాయి. ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక బృందాలు దాడులు ప్రారంభించాయి. కోకాపేటలోని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తోడల్లుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి గిరిధర్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేశాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్)కి చెందిన ఇళ్లు, విల్లా, ఫామ్‌హౌసుల్లో తనిఖీలు చేపట్టాయి. బాలాపూర్‌లోని బడంగ్‌పేట్ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, వారి బంధువులు, అనుచరుల ఇళ్లలో, బాలాపూర్ గణపతి లడ్డూను వేలంలో కొనుగోలు చేసిన వంగేటి లక్ష్మారెడ్డి ఇంట్లో కూడా తనిఖీలు చేశారు. సీఆర్పీఎఫ్ బలగాల బందోబస్తు మధ్య దాదాపు 14 ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగాయి. ఇవి శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఏకకాలంలో ఇద్దరి ఇళ్లపై దాడి

తుక్కుగూడ సమీపంలో కేఎల్ఆర్ అక్బర్ ఫాం హౌస్‌లోని ఇంట్లో, ఆయన సొంత గ్రామమైన రంగారెడ్డి జిల్లా మాసానిగూడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో, చర్లపల్లి, మొయినాబాద్ ఫామ్ హౌసుల్లో, గచ్చిబౌలి ఎస్సీసీలోని విల్లాలో ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఉదయం ఐదు గంటలకు మూడు ప్రైవేటు వాహనాల్లో ఐటీ అధికారులు కేఎల్ఆర్ నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన ఇంట్లోనే ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగాయి. కొద్దిపాటి నగదు సహా కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కేఎల్ఆర్ పలు రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం అందడంతో పాటు, ఆదాయం, పన్ను చెల్లింపుల్లో భారీ వ్యత్యాసం కనిపించడం, ఆయన వ్యాపార లావాదేవీలకు సంబంధించి పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ సోదాలు జరిగినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో పారిజాత నర్సింహారెడ్డి ఇంట్లోనూ ఐటీ అధికారుల సోదాలు కొనసాగాయి. ఆ సమయంలో పారిజాత, ఆమె భర్త నర్సింహారెడ్డి ఇంట్లో లేరు. పారిజాత తిరుపతికి వెళ్లగా, నర్సింహారెడ్డి ఢిల్లీలో ఉన్నట్టు తెలిసింది. ఇంట్లో ఉన్న కుమార్తె నుంచి మొబైల్ ఫోన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పారిజాత, నర్సింహారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఇంట్లో లభించిన బ్యాంక్ పాస్‌బుక్కులు, డాక్యుమెంట్లను పరిశీలించారు. మరోవైపు కొందరు అధికారులు మేయర్‌ను తిరుపతిలో అదుపులోకి తీసుకుని చెన్నై మీదుగా సాయంత్రానికి నగరానికి తీసుకొచ్చారు. సాయంత్రం 4.56కు శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన నర్సింహారెడ్డిని కూడా అదుపులోకి తీసుకుని ఇంటికి తీసుకువచ్చి విచారణ మొదలుపెట్టారు. గత కొంతకాలంగా వారు చేసిన ఆర్థిక లావాదేవీలపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత నగదుతో పాటు కీలక డాక్యుమెంట్లు లభ్యమైనట్లు సమాచారం. కాగా మహేశ్వరం కాంగ్రెస్ టికెట్ ఆశించిన వారిలో పారిజాత కూడా ఉన్నారు. మహేశ్వరం టికెట్ కోసం భారీ ఎత్తున లాబీయింగ్ జరగడంతో కేఎల్ఆర్, పారిజాతల ఆర్థిక లావాదేవీలపై ఐటీ నిఘా పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

కోకాపేట హిడెన్ గార్డెన్‌లో..

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తోడల్లుడు, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎంపీపీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ గిరిధర్‌రెడ్డి ఇంట్లోనూ ఐటీ సోదాలు కొనసాగాయి. ఈయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారు. హైదరాబాద్ కోకాపేటలోని హిడెన్ గార్డెన్‌లో ఆయన నివాసం ఉంటున్నారు. గిరిధర్ రెడ్డి గత కొంతకాలంగా చేసిన ఆర్థిక లావాదేవీలపై ఐటీ అధికారులు దృష్టి పెట్టినట్టు తెలిసింది. మరోవైపు బాలాపూర్‌కు చెందిన వ్యాపారవేత్త వంగేటి లక్ష్మారెడ్డి ఇంట్లో కూడా తనిఖీలు కొనసాగాయి. ఈ సమయంలో లక్ష్మారెడ్డితో పాటు కుటుంబసభ్యులు.. లక్ష్మారెడ్డి అన్న కొడుకు 3 రోజుల క్రితం మరణించడంతో అస్తికలు గంగలో కలిపేందుకు బయలుదేరుతున్నారు. దీంతో లక్ష్మారెడ్డితో కొద్దిసేపు మాట్లాడిన అధికారులు ఓ కాగితంపై సంతకం తీసుకుని ఆయన బయటకు వెళ్లేందుకు అనుమతించినట్లు తెలిసింది.

రాజకీయ కక్షలో భాగంగానే..: కేఎల్ఆర్

- రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తన ఇల్లు, కార్యాలయాలు, తన బంధువుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారని కేఎల్ఆర్ అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి కుట్రపన్ని ఐటీ దాడులు చేయిస్తున్నాయని ఆరోపించారు. మహేశ్వరం కాంగ్రెస్ టికెట్ తనకు కేటాయించిన తరువాత, ఉద్దేశపూర్వకంగా ఈ సోదాలు చేస్తున్నారని చెప్పారు.

మంత్రి సబిత ప్రోద్బలంతోనే..: మేయర్ పారిజాత

- కాంగ్రెస్ పార్టీ బీ ఫాం కోసం ఎదురు చూస్తున్నా. ఈ సమయంలో మమ్మల్ని ఇబ్బంది పెట్టేందుకు ఐటీ రైడ్స్ చేస్తున్నారు. రాజకీయ కుట్రలో భాగంగా, మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రోద్బలంతోనే ఇదంతా జరుగుతోంది. మంత్రిగా ఆమె వేల కోట్లు సంపాదించారు. ఎన్నో ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేశారు. ఆమె ఇంటిపై దాడులు చేయకుండా కేవలం కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న నాపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం?.

సీఐపై కానిస్టేబుల్ దాడి

మహిళా కానిస్టేబులైన తన భార్యతో వివాహేతర సంబంధమే కారణం?


అంబులెన్స్‌లో సీఐ ఇఫ్తికర్ అహ్మద్‌ను తరలిస్తున్న వైద్యసిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: ఒక సీఐపై కానిస్టేబుల్ కత్తితో దాడి చేయడం పోలీస్ శాఖలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసు వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్‌లోని మర్లు ఏరియాలో నివాసం ఉండే భార్యాభర్తలు ఇద్దరూ పోలీస్ కానిస్టేబుల్స్‌గా పని చేస్తున్నారు. అయితే భార్య ప్రవర్తన విషయమై కొన్ని రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మహిళా కానిస్టేబుల్‌కు జిల్లా కేంద్రంలోని సీసీఎస్‌లో సీఐగా పనిచేస్తున్న ఇఫ్తికర్ అహ్మద్‌తో వివాహేతర సంబంధం ఉందని భర్త అనుమానిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపైనే బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరిగినట్లు తెలిసింది. భార్య ప్రవర్తనతో శాఖలో పరువు పోతోందని.. ఆత్మహత్య చేసుకుంటానని భర్త బెదిరించాడు. ఆ తర్వాత భార్య.. సీఐకి ఫోన్ చేసి ఇంటికి రావాలని చెప్పింది. దీంతో అర్ధరాత్రి తర్వాత సదరు సీఐ కారులో మహిళా కానిస్టేబుల్ ఇంటికి వచ్చాడు. అప్పటికే భర్తతో పాటు భార్య తరపు బంధువు ఒకరు ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో సీఐకి, కానిస్టేబుల్‌కి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత సీఐ కిచెన్ డోర్ నుంచి బయటకు వెళ్లగా.. కానిస్టేబుల్ వెనక నుంచి వెళ్లి రాయితో కొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. ఆ తర్వాత కత్తితో సీఐ మర్మాంగాన్ని కోసి, అతను వచ్చిన కారులోనే తీసుకువెళ్లి మర్లు నుంచి పాలకొండ వెళ్లే మార్గంలో వదిలేసి వచ్చాడు. ఉదయం 6.30 ప్రాంతంలో గ్రామస్తులు చూసి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించగా కారులో రక్తం మడుగులో ఉన్నది సీఐగా గుర్తించి వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమికంగా చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. స్థానిక ఆస్పత్రిలో సీఐ చికిత్స పొందుతున్న సమయంలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ హర్షవర్ధన్ పరామర్శించారు. ప్రస్తుతం సీఐ అపస్మారక స్థితిలో ఉన్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో సదరు కానిస్టేబుల్‌పై కేసు నమోదు అయినట్లు సమాచారం. కాగా, పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సివిల్ కానిస్టేబుల్ బుధవారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డ్యూటీ చేశాడు. డ్యూటీ చేసినట్లు ఫొటోలు దిగి స్టేషన్ గ్రూప్‌లో కూడా పెట్టాడు. మరి ఇంటికి ఎప్పుడు వెళ్లాడు.. ఘటన ఎప్పుడు జరిగింది అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

పోలీసు శాఖలో కలకలం

సీఐపై హత్యాయత్నం చేసిన కానిస్టేబుల్‌తో పాటు మహిళా కానిస్టేబుల్‌ను సైతం విధుల నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ కేసు వివరాల కోసం డీఎస్పీతో పాటు రూరల్ సీఐని ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు.

"ఎవరు విశ్వాసి అయి, పరలోక సుఖాన్ని కోరి దానికై చేయవలసిన విధంగా కృషి చేస్తాడో, అలాంటివారి కృషి స్వీకరించబడుతుంది.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 3 నవంబర్ 2023

మరో నిఘా నేత్రం?

నిత్యం ఏవో కళ్ళు మనల్ని గమనిస్తున్నాయంటే ఎలా ఉంటుంది? చేతిలోని మన చరవాణి సైతం చటుక్కున ప్రత్యర్థిగా మారిపోయే ప్రమాదం ఉందని తెలిస్తే ఏమనిపిస్తుంది? ఫోన్లలోని కీలక సమాచారాన్ని చేజిక్కించుకొనేందుకు 'పాలకవర్గ ప్రాయోజిత ఎటాకర్లు' ప్రయత్నిస్తున్నారంటూ ఆపిల్ సంస్థ అక్టోబర్ 31న పంపిన అప్రమత్తపు ఈ-మెయిల్స్‌తో అదే జరిగింది. ఐ-ఫోన్లు వాడుతున్న పలువురు ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులే కాదు... ప్రపంచమంతా ఉలిక్కిపడింది. వ్యక్తిగత డేటా, గోప్యతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందంటూ దేశవ్యాప్తంగా ఆపిల్ ఐ-ఫోన్ వినియోగదారులు పలువురికి ఇలా పారాహుషార్ సందేశాలు అందడం తేలికైన విషయమేమీ కాదు. సహజంగానే కేంద్ర ఐటీ శాఖ మంత్రి ప్రభుత్వం హ్యాకింగ్‌కు పాల్పడుతోందనే ఆరోపణల్ని కొట్టిపారేశారు. దీనిపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తామన్నారు. ఈ అప్రమత్తత నోటిఫికేషన్లు పంపిన టెక్ దిగ్గజం ఆపిల్‌కు నోటీసులిచ్చి, సహకరించాల్సిందిగా కోరారు.

ఫోన్లు – కంప్యూటర్ల హ్యాకింగ్, పాలకపక్షాల గూఢచర్యం ఆధునిక సాంకేతిక యుగం తెచ్చిన అతి పెద్ద తలనొప్పి. ఇది అనేక దేశాల్లో గుట్టుగా సాగుతూనే ఉంది. పులు కడిగిన ముత్యాలమని చెప్పుకొనే పాలకవర్గాలు ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయన్నది కీలకం. డేటా లీకేజీలు, గూఢచర్య సాఫ్ట్‌వేర్ వినియోగాలు మనకూ కొత్త కావు. దేశంలో ఇజ్రాయెలీ గూఢచర్య సాఫ్ట్‌వేర్ 'పెగసస్' వినియోగం సహా పలు ఆరోపణలపై గతంలో విచారణలు జరిగాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగబోవని హామీలూ వచ్చాయి. అన్నీ నీటిమూటలే. పెగసస్ సాఫ్ట్‌వేర్ కొనలేదని ప్రభుత్వం తోసిపుచ్చినా, కొత్త గూఢచర్య సాఫ్ట్‌వేర్ల కొనుగోలుకు భారత్ ఉత్సుకత చూపుతుందని విదేశీ పత్రికల్లో విశ్వసనీయ కథనాలు వచ్చాయి. సుప్రీం కోర్ట్ నియమించిన కమిటీ కొన్ని ఫోన్లను పరిశీలించి, పెగసస్ వినియోగంపై కచ్చితమైన సాక్ష్యాధారాలు లభించలేదని చెబుతూనే, ఈ దర్యాప్తులో కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని కుండబద్దలు కొట్టింది. అందుకే, తాజా విచారణపైనా అపనమ్మకం వ్యక్తమైతే తప్పుపట్టలేం.

తాజా అప్రమత్త సందేశాలు పంపడానికి కారణాలను ఆపిల్ వివరించిన తీరూ అస్పష్టంగా ఉంది. అది సమగ్రంగా కారణాలను వివరించాల్సింది. అసలు 'పాలకవర్గ ప్రాయోజిత' ఎటాకర్లు అనే పదానికి ఆ సంస్థ చెబుతున్న వ్యాఖ్యానం, జనానికి అర్థమవుతున్న టీకా తాత్పర్యం వేర్వేరు. పుష్కలంగా నిధులు, వ్యవస్థీకృత సామర్థ్యం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలున్నవన్నీ ఆ వర్గం కిందకు వస్తాయన్నది ఆపిల్ మాట. ప్రభుత్వ జోక్యం లేనిదే అది అసాధ్యమనేది అందరికీ తెలుసు. అందుకే, తాజా రగడపై అటు భారత అటు ప్రభుత్వం, ఇటు ఆపిల్ క్రియాశీలంగా వ్యవహరించాలి. వినియోగదారుల్ని అప్రమత్తం చేయడమే నేరమన్నట్టు ప్రభుత్వం, ఆపిల్ చెవులు మెలేస్తే దేశంలో పెట్టుబడులకు ప్రతికూల వాతావరణమే మిగులుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20 శాతం మంది ఆపిల్ ఐ-ఫోన్లు వాడుతుంటే, వారిలో 7 శాతం మన దేశంలోనే ఉన్నారు. తమ ఉత్పత్తులు పూర్తి సురక్షితమనీ, హ్యాకింగ్ అవకాశం అత్యల్పమనీ, ఆ యా దేశాల ప్రభుత్వాల పక్షాన తాము గూఢచర్యానికి ఎన్నడూ పాల్పడబోమనీ ఆపిల్ కూడా నమ్మకం కలిగించాలి.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై ఏర్పాటైన పార్లమెంటరీ సంఘం తక్షణం సమావేశమై, ఆపిల్ సందేశాలపై విచారణ జరపాలంటూ ప్రతిపక్ష సభ్యులు ఇప్పటికే ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టారు. అయితే, ప్రతిపక్షాలు చేస్తున్న ఈ ఫోన్ల హ్యాకింగ్ వాదనను 'యాక్సెస్ నౌ' సంస్థ సమర్థిస్తోందనీ, కోటీశ్వరుడైన అమెరికన్ ఫైనాన్షియర్ జార్జ్ సోరోస్‌కు ఆ సంస్థలో పెట్టుబడులున్నాయి గనక ఆయనకు ఈ హ్యాకింగ్ వివాదంతో సంబంధం ఉందనీ అధికార బీజేపీ ఐటీ విభాగాధిపతి ఆరోపించారు. పాలకవర్గాలపై ఆరోపణలు వచ్చినప్పుడు అవి నిరాధారమని నిరూపించి, నిజాయతీని నిరూపించుకోవాలి. అది వదిలేసి బోడిగుండుకూ, మోకాలుకూ ముడిపెడితే ప్రయోజనం శూన్యం. అదే సమయంలో ఇచ్చిన సమాచారంపై దృష్టిపెట్టకుండా, తెచ్చిన వార్తాహరుడిపై కత్తులు నూరితే కష్టం.

ఆపిల్ అప్రమత్తతకు సరిగ్గా ఒక రోజు ముందరే మన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్' నుంచి దాదాపు 80 కోట్ల మంది పౌరుల ఆధార్ వివరాలు లీకయ్యాయి. దీనిపైనా లోతైన విచారణ జరపాల్సి ఉంది. ఆధార్ వివరాలు నమోదు చేసే 'యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా' సర్వర్ కట్టుదిట్టమైనదే. కానీ, ఇతర మార్గాల్లో వివరాలు బయటకు పొక్కుతున్నాక ఇక గోప్యతకు అర్థమేముంది! వ్యక్తిగత డిజిటల్ డేటా రక్షణపై ఇటీవలే చట్టం చేసిన ప్రభుత్వం సమాచార సేకరణ, నిల్వ, వినియోగంపై కట్టుదిట్టమైన నియమావళి సత్వరం తీసుకురావాలి.

ప్రజాస్వామ్యానికి కీలకమైన ప్రతిపక్షాలు, పాత్రికేయులపై నిఘా పెట్టి, పౌరుల ప్రాథమిక హక్కయిన గోప్యతను తుంగలో తొక్కాలనుకుంటే అది ఘోరం. ఈ వ్యవహారంపై ప్రజల్లో చైతన్యం పెంచి, ఇలాంటి ఉల్లంఘనల్ని ప్రతిఘటించేలా సంసిద్ధం చేయాలి. పాలకపక్షాలు ఈ ఆరోపణల్లోని నిజానిజాల నిగ్గు తేల్చాలి. పదేపదే ఆరోపణలు వస్తున్నందున వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం వాటిల్లకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిష్కార మార్గాల అన్వేషణే కాదు... ఆచరణలోనూ ప్రజలందరికీ నమ్మకం కలిగించాలి. గోప్యత ఉల్లంఘన జరిగినట్టు తేలితే, కఠిన చర్యలు చేపట్టాలి. అలాకాక, రెండేళ్ళ క్రితం నాటి 'పెగసస్' లానే దీన్ని కూడా చాప కిందకు నెట్టేయాలని పాలకులు ప్రయత్నిస్తేనే చిక్కు. రాజకీయ రచ్చగా మారుతున్న తాజా వ్యవహారంలో అసలు సంగతి వదిలేసి, కొసరు విషయాలు మాట్లాడుకుంటే ఎన్నటికీ ఉపయోగం లేదు.

మార్క్స్ అవగాహన రుజువవుతోందా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

పార్లమెంటులో, శాసన సభల్లో వందలాది మంది ఎలా కోట్ల ఆస్తులకు పడగలెత్తారని 'ఏడీఆర్' నివేదికలు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియను 'ఐదేళ్ల కాంట్రాక్టు'గానే పార్టీలు చూస్తున్నాయి. 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోంది. ధనికవర్గ సమాజాలు నేరస్థుల్ని, వారి వెంటనే నేర చట్టాల్ని, వాటిని సమర్థించే శక్తుల్ని ఎలా సృష్టించుకుంటూ పోతాయో కార్ల్ మార్క్స్ ఎప్పుడో చెప్పారు. అలాంటి సమాజంలో ఒక తత్వవేత్త అందుకు తగిన భావాల్ని అందజేస్తాడు. ఒక కవి తన కవితల్ని అల్లుకుంటూ పోతాడు. ఒక మతాధికారి తన వంతుగా ప్రవచనాల్ని అందిస్తాడు. వర్గ రహిత సోషలిస్టు వ్యవస్థ ఏర్పడేవరకూ ఈ పరిస్థితిలో మార్పు ఉండదు!

"మన దేశంలో ప్రజల కోసం కాకుండా పవర్ (అధికారం) కోసమే పథకాలు పుట్టుకొస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియను 'ఐదేళ్ల కాంట్రాక్టు'గానే పార్టీలు చూస్తున్నాయి. కార్పొరేట్ విధాన రాజకీయాలనే అన్ని పార్టీలు అనుసరిస్తున్నాయి. ఇంతకూ మన దేశంలో భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను చదివిన నాయకులెందరు?"
– తెలంగాణ ఎన్నికల సంఘం కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి వి. నాగిరెడ్డి (28.10.2023)


"దేశంలో చట్టాలకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' వల్ల ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు వాటిల్లుతోంది. దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రజల అధీనంలో ఉండవలసిన ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రయివేట్ రంగ సన్నిహితులకు కట్టబెట్టడానికి మారుపేరు 'ఆశ్రిత పెట్టుబడి'!"
– సీనియర్ పాత్రికేయులు పరంజయ గుహ ఠాకుర్తా (29.10.2023)

'పాలన సాగించే సివిల్ సర్వెంట్లను ప్రచార సాధనాలుగా ఉపయోగించుకునేలా– దేశంలోని 765 జిల్లాలకు జాయింట్ సెక్రటరీ, లేదా అంతకన్నా తక్కువ స్థాయి అధికారులను 'రథ్ ప్రభారీ'లుగా నామినేట్ చేయాలని అన్ని మంత్రిత్వ శాఖలకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడంపై కేంద్ర మంత్రి మండలి మాజీ కార్యదర్శి కె.ఎం. చంద్రశేఖర్ తీవ్ర నిరసన తెలిపారు.' (30.10. 2023)

పాలనా యంత్రాంగంలో అవినీతి భాగోతం అంతటితోనే ఆగలేదు. రాజకీయ పార్టీలకు ఎన్నికలలో డబ్బు ఎక్కడినుంచి వస్తోందీ, ఎటు పంపిణీ అవుతోందన్న వివరాలను తెలుసుకునే హక్కు దేశ పౌరులకు 'లేదు పొమ్మని' మోదీ ప్రభుత్వ అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సుప్రీంకోర్టు ముఖం మీదనే చెప్పారు. తెలుసుకునే హక్కు దేశ పౌరులకు లేదు పొమ్మంటున్న కేంద్ర పాలకుల ఎత్తుగడను సుప్రీం కోర్టు ప్రత్యేక ధర్మాసనం ప్రశ్నిస్తోంది.

భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్కరణలు స్థిరపడి నిలదొక్కుకునేటట్లు చేసేందుకు ఏర్పడిన సంస్థ 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్'... కొంతకాలంగా పార్లమెంటు, రాష్ట్రాల శాసన సభల్లో ప్రవేశిస్తున్న వివిధ పార్టీల, రాజకీయ నాయకుల, ప్రతినిధుల ఆదాయ వ్యయాల వివరాలను వెల్లడిస్తూ దేశ ప్రజల్ని హెచ్చరిస్తోంది. 'అందరూ శాకాహారులే అయిన చోట రొయ్యల బుట్ట ఎలా ఖాళీ అవుతోంద'ని ప్రశ్నిస్తోంది. పార్లమెంటులో 250 మంది సభ్యులకు పైగా, రాష్ట్రాల శాసన సభల సభ్యులలో వందలాది మంది ఎలా వందల కోట్ల ఆస్తులకు పడగలెత్తుతూ వచ్చారని 'ఏడీఆర్' సాధికార నివేదికలు గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్నా సమాధానం లేదు. సగానికి పైగా పార్లమెంట్ సభ్యులలో, రాష్ట్రాల శాసన సభ్యులలో, పాలకులలో పేరుకు పోతున్న అవినీతికి, క్రిమినల్ కేసులకు అంతులేని పరిస్థితిని ఏడీఆర్ సాధికార నివేదికలు బయట పెడుతున్నాయి. క్రమంగా ఇలాంటి పరిస్థితులు ధనికవర్గ సమాజాలు నేరస్థుల్ని, వారి వెంటనే నేర చట్టాల్ని, వాటిని సమర్థించే శక్తుల్ని ఎలా సృష్టించుకుంటూ పోతాయో చరిత్రలో మొదటిసారిగా విశ్లేషించినవాడు శాస్త్రీయ సోషలిజం సిద్ధాంత ప్రవక్త కార్ల్ మార్క్స్. అలాంటి దోపిడీ వ్యవస్థ ఉనికిని కాపాడటానికి వివిధ శక్తులు ఏ స్థాయిల్లో ఎలా చేదోడు వాదోడు అవుతాయో మార్క్స్ ఇలా విశ్లేషించి చూపాడు:

రెండో మాట



అలాంటి సమాజంలో ఒక తత్వవేత్త అందుకు తగిన భావాల్ని అందజేస్తాడు. ఒక కవి తన కవితల్ని అల్లుకుంటూ పోతాడు. ఒక మతాధికారి లేదా పూజారి తన వంతుగా ప్రవచనాల్ని అందిస్తాడు. ఓ ప్రొఫెసర్ గారు ఇందుకు తగిన గ్రంథ రాజాల సారాంశాన్ని అందజేస్తుంటాడు. ఓ నేరగాడు యథేచ్ఛగా అలా నేరాలు చేస్తూనే పోతాడు. నేరానికి పాల్పడటం కూడా ధనిక, దోపిడీ వర్గ సమాజ వస్తూత్పత్తి క్రమంలో భాగంగానే సాగిపోతుంది. అటు సరుకుల ఉత్పత్తి క్రమానికి, ఇటు సమాజానికి మధ్య నెలకొనే అవినాభావ సంబంధాన్ని పరిశీలించినట్లయితే– అనేక భ్రమలు, దురభిమానాలు పటాపంచలై పోతాయి. ఎందుకంటే, మన 'లా ప్రొఫెసర్' గారు ఆ భ్రమలపై ఆధారపడి ఓ గ్రంథ రాజాన్ని తయారు చేసుకొని మార్కెట్‌లోకి ఓ అమ్మకపు సరుకుగా వదులుతాడు. ఆ పుస్తకాన్ని తమ వంతు 'జాతీయ సంపద'గా భావించి ధనిక వర్గం పంచుకోవడానికి దోహదపడుతుంది. మరో వైపున దాన్ని తయారు చేసిన 'లా ప్రొఫెసర్' గారిలో ఇది వ్యక్తిగత మైన ఆనందాన్నీ, తృప్తినీ పెంచేస్తుంది. ఇలా మన ప్రొఫెసర్ ధనికవర్గ ప్రయోజనాలకు ఉపయోగపడే ఓ క్రిమినల్ చట్టం రూపొందడానికి చేయూత నివ్వడమేగాక, ఆ చట్టానికి గొడుగు పట్టే 'పీనల్ కోడ్స్' (శిక్షా స్మృతి)ను, దానితోపాటే ధనికవర్గ ప్రయోజనాలు ఈడేర్చిపెట్టే శాసన కర్తలు, కళాకారులు రూపొందేలా, ఆ చట్టానికి వత్తాసు పలికే సాహిత్యానికి, నవలలకు, చివరికి సమాజంలో అనంతమైన విషాదకర సన్నివేశాలకు కారణమవుతాడు. కనుకనే, అలాంటి సమాజాల్లో పరస్పర వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఒక వైపు నుంచి ధనికవర్గమూ, మరో వైపు నుంచి శ్రామికులు ఆచరణలో ప్రయివేట్ ఆస్తి ఉనికిని కాపాడు తున్నట్టు అవుతోందని కూడా మార్క్స్ ప్రభృతులు అరమరికలు లేకుండా చెప్పారు. వర్గ రహిత సోషలిస్టు వ్యవస్థ ఏర్పడేవరకూ ఈ పరిస్థితిలో మార్పు ఉండదు!

అందుకే అన్నాడా, శ్రమ విలువ తెలిసిన వేమన?

**"భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబు తానౌను"!**

కాగా, అసలు జీవితమంటే ఏదో 'సినారె'ను అడిగితే చెబుతాడు:

**"ఉప్పెనలో తలవొగ్గక నిలువున ఉబికొచ్చే జీవితం
ఓటమిలో నిట్టూర్పక రివ్వున ఉరికొచ్చేదే జీవితం
చచ్చేదాకా బతికి వుండటం జాతకాల్లో ఉన్నదే –
ఒరిగిపోయినా తన కంఠం నలుగురు మెచ్చేదే జీవితం
ప్రలోభాలు పైబడినా నీతికి పడి చచ్చేదే జీవితం"!**

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

బతకలేని నగరం



ఢిల్లీ చుట్టుపక్కల వ్యాపించిన పొగమంచు దారుణంగా ఉంది. మందంగా, ఆమ్లంగా. బిల్డింగులు స్పష్టంగా కనబడటం లేదు. కళ్లు మండుతున్నాయి. అతిశయోక్తి కాదు. యుగాంతపు అనంతర దృశ్యంలా ఉంది. దీపావళికి ఇంకా రెండు వారాలు ఉంది.
– ప్రియ, సీనియర్ ఫెలో

అభిమానులకు వందనం



చాలామంది అర్ధరాత్రి నాకు (జన్మదిన) శుభాకాంక్షలు చెప్పడానికి రావడం నమ్మశక్యంగా లేదు. నేను ఒక నటుడిని మాత్రమే. మీకు కొంత వినోదం కలిగించడం కంటే నాకు ఇంకేమీ సంతోషం కలిగించదు. మీకు వినోదం కలిగించేలా చేస్తున్నందుకు ధన్యవాదాలు.
– షారుఖ్‌ఖాన్, నటుడు

సాహిత్య నగరం



అందమైన కోళిక్కోడ్‌ను యునెస్కో సాహిత్య నగరంగా ప్రకటించడం కేరళకు గౌరవం. ఇండియాలో ఇంత ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కిన మొదటి నగరం కోళిక్కోడ్ కావడం మనందరికీ గొప్ప గర్వకారణం. నగరపు ఘన సాహిత్య వారసత్వం, సజీవ సాంస్కృతిక దృశ్యానికి ఇదొక సాక్ష్యం. సాహిత్యం, సృజనల పట్ల మన ప్రేమను కొనసాగిద్దాం.
– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

వేరే లోకపు మనుషులు



ఐజాక్ న్యూటన్ ఒక రసవాది. అలన్ ట్యూరింగ్ టెలీపతి నిజమని నమ్మారు. అత్యంత ప్రజ్ఞ కలిగినవాళ్లు అర్ధ – మార్మికవాదులన్న విషయం కాదనలేనిది. జడ అణువులతో తయారైన విశ్వం, కేవలం నగటు ప్రజ్ఞ కలిగినవాళ్ల కోసమే!
– ఇశ్ ధోలానీ, చదువరి

మా వైఖరి



హమాస్ అసహ్యపు తీవ్రవాదాన్ని కెనడా నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది; తనను తాను రక్షించుకునే ఇజ్రాయెల్ హక్కుకు మద్దతిస్తోంది. అదే సమయంలో, పాలస్తీనా పౌరుల ఎడతెగని బాధ ఈ న్యాయానికి మూల్యం కాకూడదు.
– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

పడిపోయిన ప్రపంచం



నేనొక మాజీ స్టాండప్ కమెడియన్ను... అందరికీ తెలిసిన సత్యాలు చెప్పడం ద్వారా కెరియర్‌ను సృష్టించుకున్నాను. వాటిని చెప్పినందుకే జనాలు నన్ను 'సాహసి', 'మేధావి' అనుకుంటారు. అది నిజం కాదు. ప్రపంచం మూర్ఖపుదయ్యింది. జనాలు పిరికివాళ్లయ్యారు.
– కాన్‌స్టంటిన్ కిసిన్, వ్యంగ్య వ్యాఖ్యాత

కావాల్సిన వివేకం



కొందరి పాపాలకు తెల్లవాళ్లందరూ బాధ్యులు కారు. కొందరి పాపాలకు నల్లవాళ్లందరూ బాధ్యులు కారు. కొందరి పాపాలకు అరబ్బులందరూ బాధ్యులు కారు. కొందరి పాపాలకు యూదులందరూ బాధ్యులు కారు... ఇంకా దీన్ని పొడిగించగలను. ఇలాంటివి చెప్పాల్సిన అవసరం రానేకూడదు. కానీ ప్రపంచానికి ఇలాంటివి జ్ఞాపకం చేయాలి. మూకుమ్మడి పశ్చాత్తాపాలు, మూకుమ్మడి శిక్షలు చాలు.
– జూబీ, ర్యాపర్

చరిత్రను మారుస్తారా?

ఎన్‌సీఈఆర్‌టీ నియమించిన కమిటీ పాఠ్యపుస్తకాలలో ఇండియాకు బదులు భారత్ అనే పదాన్ని చేర్చాలనీ, ప్రాచీన చరిత్ర స్థానంలో సంప్రదాయ (క్లాసికల్) చరిత్ర చేర్చాలనీ, హిందూ రాజుల విజయాలను చరిత్రలో ఎక్కువగా చెప్పాలనీ సిఫారసు చేయటం నయవంచనతో కూడినది. ఈ సిఫారసులను పరిశీలిస్తే, ఆ కమిటీలో ఒక్కరికి కూడా భారతదేశంపై గానీ, భారత ప్రజల ఆలోచనా విధానంపై గానీ, భారత స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు, భారత రాజ్యాంగముపై గానీ ఏ మాత్రం అవగాహన లేదని అర్థమవుతోంది. ఇటువంటి వ్యక్తులతో కమిటీ వేసిన ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్‌నూ, సభ్యులనూ కూడా తప్పు పట్టవలసి వస్తుంది. విద్యారంగంలో భారతదేశానికి దిక్సూచిగా పని చేయవలసిన సంస్థ నేడు అజ్ఞానులతో నిండిపోయిందా అనిపిస్తుంది.

పాఠశాలల్లో ప్రతిజ్ఞాపాఠంలో 'భారతదేశం నా మాతృభూమి' అని తెలుగులో, 'భారత్ మేరా దేశ్ హై' అని హిందీలో, 'ఇండియా ఈజ్ మై కంట్రీ' అని ఇంగ్లీష్‌లో ఉన్నది. భారత రాజ్యాంగంలో కూడా 'ఇండియా దటీజ్ భారత్' అని ఉంది. ఇప్పటికిప్పుడు 'ఇండియా' పదం పాఠ్యపుస్తకాలలో కన్పించకూడదంటే, సిఫారసు చేసిన కమిటీ ఏ స్థాయిలో దిగజారిందని భావించాలి?

గతంలో జరిగిన దానిని చెప్పేది చరిత్ర. కల్పించి చెప్పేది పుక్కిటి పురాణం. చరిత్ర వాస్తవాలను చెప్పాలి గానీ, ప్రస్తుత కేంద్ర పాలకులకు ఇష్టమైన రీతిలో చెప్పేది చరిత్ర కాదు. అలెగ్జాండర్ జీలం నది దాటి పోరస్ రాజును ఓడించటానికి సహకరించింది ఓ హిందూ రాజు అనేది వాస్తవం. ఘోరీ మహ్మద్‌ను 17 సార్లు ఓడించిందీ రాజపుత్రులనే నిజాన్నీ చరిత్ర చెప్తుంది. మౌర్యుల చరిత్ర, గుప్తుల చరిత్ర, శాతవాహనుల చరిత్ర, విజయనగర సామ్రాజ్య చరిత్ర చెబుతున్న క్రమంలోనే మొఘలుల చరిత్ర, శివాజీ చరిత్ర చెబుతున్నాం.

నేడున్న పాఠ్యపుస్తకాలలో 'జరిగిన చరిత్ర'నే చేర్చారు. ఏ రాజు విజయం సాధిస్తే వారి పేరే చరిత్రలో ఉన్నది. కాకతీయుల చరిత్ర, పాండ్యుల చరిత్ర, చోళుల చరిత్ర, కుతుబ్ షాహీల చరిత్ర, అసఫ్ జాహీల చరిత్ర అని చదువుకుంటున్నాం. ఇది వాస్తవం. ఎక్కడా హిందూ రాజుల చరిత్ర, ముస్లిం రాజుల చరిత్ర అని ఆనాడు లేదు. లేనిది చేర్చాలని కమిటీ సిఫారసు చేయటమంటే, వారిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? దేశ సమైక్యతకు భంగం కలిగించే ఇలాంటి సిఫారసులను వెనక్కు తీసుకోవాలి.

– అలుగుబెల్లి నర్సిరెడ్డి
తెలంగాణ శాసనమండలి సభ్యులు

విదేశాంగ నీతిలో కొరవడిన మూలాల సూత్రాలు

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

యుద్ధంలో పరాజితులే తప్ప విజేతలెవరూ ఉండరని టాల్‌స్టాయ్ తన 'వార్ అండ్ పీస్' నవలలో ఎప్పుడో చెప్పాడు. చరిత్ర దానిని అనేక మార్లు రుజువు పర్చింది కూడా! ఏడాది దాటిన ఉక్రెయిన్ రష్యా యుద్ధం, నెల రోజులుగా పాలస్తీనా (హమాస్) – ఇజ్రాయెల్ మధ్య సాగుతున్న యుద్ధంలో 'పరాజిత'... యావత్ ప్రపంచం అంటే అతిశయోక్తి కాబోదు. అయితే, పాలస్తీనా, ఇజ్రాయెల్‌ల మధ్య రాజుకొన్న యుద్ధ మూలాలు 40వ దశకం చివర్లోనే ఏర్పడ్డాయి.

1948లో ఇజ్రాయెల్ సార్వభౌమాధికారం కలిగిన దేశంగా ఏర్పడి, ఆక్రమిత ప్రాంతాల నుంచి అరబ్బులను తరమికొట్టడంతోనే పశ్చిమాసియాలో శాంతికి విఘాతం ఏర్పడింది. 'పాలస్తీనా విమోచన సంస్థ' (పీఎల్ఓ) ఏర్పడి ఆక్రమిత ప్రాంతాలను తమకు అప్పగించాల్సిందిగా ఇజ్రాయెల్‌ను కోరింది. అందుకు భారత్‌తో సహా వివిధ దేశాల మద్దతు కోరింది. అయితే, స్వప్రయోజనాలు, రాజకీయ కారణాలతో అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు ఇజ్రాయెల్‌ను బలపర్చడమే కాకుండా, భద్రతా మండలిలో ఇజ్రాయెల్‌ను మందలించే తీర్మానాలన్నింటినీ వీటో చేశాయి. ఈ నేపథ్యంలోనే అరబ్బులు ఇస్లామ్ ఏకత్వ నినాదాన్ని ఎత్తుకొని ఇస్లామిక్ దేశాలను తమకు అనుకూలంగా చేసుకోవాలని ప్రయత్నించారు. కానీ, మత దృష్టితో ఏకం కావడం అన్నది తాత్కాలిక ప్రయోజనాలనే తీరుస్తుందన్నది పాలస్తీనా విషయంలో అనేకసార్లు రుజువయ్యింది.

యుద్ధం అన్నది ఓ ఆకస్మిక పరిణామం కాదు. దానికి అనేక కారణాలు ఉంటాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం అయినా, పాలస్తీనా-ఇజ్రాయెల్ యుద్ధమైనా వాటికి చారిత్రక కారణాలు ఉన్నాయి. ఈ పరిణామాలకు గల మూల కారణాలను అర్థం చేసుకొని తగిన చొరవతో పరిష్కారానికి ప్రయత్నిస్తేనే యుద్ధాలు నివారించబడతాయి. కానీ, ఆ చొరవ ఎవరు తీసుకోవాలి? ఐక్యరాజ్య సమితా? పేరుకు తటస్థం అయినప్పటికీ ఐక్యరాజ్య సమితి కొన్ని దేశాలకు కొమ్ముకాసే జేబు సంస్థగా మారిపోయిందన్న అపప్రథను ఎప్పుడో మూటగట్టుకొంది. ఐరాస తన అంతర్జాతీయ కర్తవ్యాలను నెరవేర్చడంలో వెనుకబడింది. గాజాలోని ఆసుపత్రిపై బాంబులు పడి వందలాది మంది మరణిస్తే.. ఆ క్షణాన్నే ఇజ్రాయెల్ భూభాగంపై కాలుమోపిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆ బాంబులు వేసింది ఇజ్రాయెల్ సైన్యం కాదనీ, ఉగ్రవాదుల పనేననీ ఇజ్రాయెల్ తరఫున వకాల్తా పుచ్చుకొని ఆ దేశాన్ని వెనకేసుకొచ్చారు. జనావాసాలపై, ఆసుపత్రులపై, విద్యా సంస్థలపై దాడులు చేయకూడదని 'జెనీవా ఒప్పందం' ఉన్నా... వాటిని ఇజ్రాయెల్ బేఖాతరు చేస్తుంటే, నోరు విప్పలేని ఐరాస అశక్తత అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఇజ్రాయెల్‌పై 'హమాస్' చేసిన దాడిని ఎవ్వరూ సమర్థించరు. కానీ, ఉగ్రవాదుల ఏరివేత ముసుగులో గాజాలోని సామాన్య పౌరులను, ముఖ్యంగా పసి పిల్లలను హతమార్చడాన్ని ఎవరు హర్షించగలరు?!



ప్రపంచీకరణ వల్ల ప్రపంచంలోని అన్ని దేశాలూ పరస్పర ఆధారితమైపోయిన నేపథ్యంలో... ఆ యా దేశాల ప్రాధాన్యతలలో గణనీయమైన మార్పు చోటుచేసుకొంది. ఐరాస భద్రతా మండలి వంటి అంతర్జాతీయ వ్యవస్థలతో పాటు ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి వ్యవస్థ పుట్టుకొచ్చి ఆ యా దేశాల ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలను శాసించే స్థాయికి చేరుకొన్న తర్వాత, అంతర్జాతీయ పరిణామాలు కొన్ని దేశాలకు కొత్త సవాళ్లను తెచ్చి పెట్టాయి. ప్రపంచీకరణతో లాభం పొందిన చైనా... దక్షిణాసియా దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం పరిపాటిగా మారింది. బలహీనదేశాలకు ఆర్థిక సాయం అందించే నెపంతో కొన్ని దేశాల విదేశాంగ ప్రతిపత్తిని దెబ్బతీసే యత్నాలు గతంలోనూ జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నాయి.

కాగా, భారత్‌కు సంబంధించినంతవరకు పాలస్తీనా – ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధాన్నీ, ఏడాదికి పైగా సాగుతున్న ఉక్రెయిన్-రష్యా నడుమ జరుగుతున్న యుద్ధాన్నీ ఏ దృక్కోణంలోంచి చూడాలన్న అంశంలో దేశంలోని పాలక పార్టీ బీజేపీకీ, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకీ మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం అంతర్జాతీయ సమాజంలో చర్చనీయాంశంగా మారింది. జవహర్‌లాల్ నెహ్రూ దేశ తొలి ప్రధానిగా ఉన్నప్పుడు విదేశాంగ వ్యవహారాలను కూడా ఆయనే నిర్వహించేవారు. సహజీవన సూత్రం ఆధారంగా అంతర్జాతీయ వ్యవహారాలను చూస్తామనీ; దానికి అనుగుణమైనదే దేశ తటస్థ వైఖరి అంటూ ఆ ప్రాతిపదికననే అలీన విధానాన్ని (నాన్ అలైన్డ్) రూపొందించారు. అంతేకాదు... వివిధ దేశాల మధ్య సహృద్భావం, అవగాహనతోనే సమస్యలు పరిష్కారం అవుతాయితప్ప సైనిక ఒప్పందాలు (పాక్ట్స్), సైనిక కూటములలో తీసుకునే సభ్యత్వాలు పరిష్కారం అందించ వని నిర్ద్వంద్వంగా చెప్పేవారు. నెహ్రూ అవలంబించిన విదేశాంగ విధానం నుంచి ఆ తర్వాత ఏ ఒక్క ప్రధానమంత్రీ... చివరకు వాజ్‌పేయి కూడా భిన్నంగా వ్యవహరించలేదు. 1999– 2004 మధ్య దాదాపు ఐదేళ్లపాటు భారతదేశానికి ప్రధాన మంత్రిగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి పలుమార్లు పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించారు. అయితే, తాజాగా ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి తెగబడి వందలాది మంది అమాయక ప్రజల్ని విచక్షణా రహితంగా చంపివేసిన దారుణాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఖండించి ఇజ్రాయెల్‌కు సంఘీభావం ప్రకటించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాలస్తీనాకు మద్దతు ఇస్తూ తీర్మానం చేసింది. సాధారణంగా, విదేశీ వ్యవహారాలకు సంబంధించి దేశంలోని అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం వ్యక్తం కావాలి. కేంద్రానికి బాసటగా నిలవాలి. అయితే, దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీల మద్దతు పొందడమే లక్ష్యంగా పాలస్తీనాకు మద్దతు ఇచ్చినట్లు అర్థమవుతోంది.

ఉక్రెయిన్-రష్యా యుద్ధం పట్ల అనుసరిస్తున్న తటస్థ వైఖరినే పాలస్తీనా-ఇజ్రాయెల్ అంశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరించడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ఓ ఉగ్రవాద చర్య. దీనిని ఖండిస్తూ ఇజ్రాయెల్‌కు బాసటగా నిలుస్తామని దేశ ప్రధానీ, విదేశాంగ మంత్రీ ఇరువురూ స్పష్టంగా వెల్లడించారు. మరోపక్క గాజా ప్రాంతంలోని బాధితులకు అవసరమైన ఆహారం, ఔషధాలను భారత్ తరలించడాన్నీ బాధ్యతాయుతమైన చర్యగా చూడాలి. ఇటీవల ఐరాస సర్వప్రతినిధి సభలో 'ప్రజల భద్రత, న్యాయమైన మానవీయ బాధ్యత కోసం' అంటూ జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. దీనిపై వచ్చిన విమర్శలూ గమనార్హమే. నిజానికి, కీలకమైన ఇటువంటి అంశాలపై ఏకాభిప్రాయ సాధన కోసం పాలక బీజేపీ, అన్ని ప్రధాన రాజకీయ పక్షాలను పిలిచి సమావేశం నిర్వహించాలి.

గత 8 ఏళ్లుగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని పలు రాజకీయ పార్టీలు తప్పుబడుతున్నాయి. అమెరికా అంతర్గత రాజకీయాలలో జోక్యం చేసుకోవడం, అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దుల్ని ఆక్రమించిన చైనాను నిలువరించలేకపోవడం, నేపాల్‌తో గత దౌత్యపరమైన సంబంధాలను చెడగొట్టుకోవడం, ఇటీవల కెనడాతో సంబంధాలు క్షీణించడం వంటి అంశాలను చూపించి విదేశాంగ విధానంలో ఎన్డీఏ విఫలమైనట్లు కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తోంది. అయితే, ఓట్ల రాజకీయంతో కాంగ్రెస్ పార్టీ కొన్ని వర్గాలకు కొమ్ము కాస్తోందని అది దేశ అంతర్గత భద్రతకు ముప్పు అని బీజేపీ తిప్పికొడుతోంది. కారణాలేవైనా, విదేశీ వ్యవహారాలకు సంబంధించి మునుపటిలా దేశంలో రాజకీయ పక్షాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం ఓ చేదు వాస్తవం!

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.12.10 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.8.02 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.8.50 నుండి 10.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.20 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.07 నుండి 12.53 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.03, **సూర్యాస్తమయం:** 5.26.

నోటుకు ఆశపడితే బతుకులు ఆగమే..

● ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్

జగిత్యాల జోన్: మద్యం, నోటు, కులం, మతం వంటివాటికి తలొగ్గి ఓటు వేస్తే బతుకులను ఆగం చేసుకున్నట్లేనని తెలంగాణ ప్రజాస్వామిక ఫోరం చైర్మన్, ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో గురువారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కో ఎమ్మెల్యే రూ.100 కోట్లు కూడగట్టుకున్నారని, దోచుకున్న డబ్బుతో అవినీతి వ్యాపారాలు చేస్తూ, ప్రజల సమస్యలను గాలికొదిలారని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగమని చెప్పిన సీఎం కేసీఆర్ తన ఇంట్లో వారందరికీ ఉద్యోగాలు కల్పించారని, విద్య, వైద్య వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. ఫోరం కన్వీనర్, రిటైర్డ్ కలెక్టర్ ఆకునూరి మురళి మాట్లాడుతూ అబద్ధపు, అహంకార, అవినీతి ముఖ్యమంత్రిని ఓటు ద్వారా ఇంటికి సాగనంపాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం సభ్యుడు, కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, ఉస్మానియా జర్నలిజం విభాగం మాజీ ప్రొఫెసర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నాయకులను నిలదీయండి

రిటైర్డ్ ఐఏఎస్, రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ ఆకునూరి మురళి



కరీంనగర్/గంగాధర: ఎన్నికల సమయంలో ఓట్లు అడిగే అవినీతి రాజకీయ నాయకులను నిలదీయాలని రిటైర్డు ఐఏఎస్, రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. జాగో తెలంగాణ బస్సు యాత్ర గురువారం కరీంనగర్‌కు అక్కడున్నంచి గంగాధర మధుర చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ..ఓటును డబ్బు, బీరు, బిర్యానీకి అమ్ముకోకుండా నిజాయితీపరులకు ఓటు వేయాలన్నారు. కులం, మతం పేరుతో రెచ్చగొడుతున్న రాజకీయ పార్టీలను ఓడించాలని చెప్పారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌ను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. తొమ్మిదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఉద్యోగ నియామకాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేయడంతో పాటు, వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు.

తండ్రి మందలించాడని బాలుడి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): తండ్రి మందలించడంతో ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గుంటిపల్లిలో చోటుచేసుకున్నది. గుంటిపల్లికి చెందిన బొమ్మ నాగరాజు, వరమ్మ దంపతులకు ప్రవీణ్, భాను(14), చరణ్ అనే ముగ్గురు కొడుకులున్నారు. రెండో కుమారుడు భాను జిల్లాలోని దుబ్బాక మండలం హబ్సీపూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల సందర్భంగా గత నెల 12న ఇంటికొచ్చాడు. సెలవులు ముగిసినా, తిరిగి స్కూలుకు వెళ్లాలని బుధవారం బాలుడిని తండ్రి మందలించాడు. దీంతో బాలుడు తమ పొలం వద్దకు పరుగెత్తుకెళ్లి అక్కడ ఉన్న పురుగుమందు తాగాడు. తండ్రి వెంటనే బాలుడిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడి పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

టికెట్ల తూకం తప్పిందా?

- బీజేపీలో కొత్త నేతలు, వారి అనుచరులకే పెద్దపీట అనే అభిప్రాయాలు
- పలువురు ముఖ్య నేతలకు మొండిచెయ్యి
- బీసీలకు ప్రాధాన్యత ఇచ్చినా.. లెక్క తగ్గిందనే అంచనాలు
- ఇప్పటివరకు ఒక్క మైనారిటీకి దక్కని టికెట్
- మొత్తం 88 సీట్లలో.. ఓసీలకు 34, బీసీలకు 32, ఎస్సీలకు 13, ఎస్టీలకు 9..
- పలు స్థానాల్లో టికెట్లు ఆశించిన కార్పొరేటర్లకు నిరాశ..
- వారు సహకరిస్తారా, రెబెల్స్‌గా పోటీచేస్తారా అనే చర్చ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో కొత్త-పాత నేతలకు సమతూకంగా సీట్లు కేటాయించి ముందుకెళ్లాలని బీజేపీ నాయకత్వం భావించినా.. ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థుల జాబితాలు దాన్ని ప్రతిబింబించడం లేదనే చర్చ మొదలైంది. పార్టీలో పాతకాపుల కంటే కొత్తగా వచ్చిన వారికి, గత మూడు నాలుగేళ్లలో పార్టీలో చేరిన ముఖ్య నేతల అనుచరులకే పెద్దపీట వేశారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తమ అనుయాయులకు టికెట్లు ఇప్పించుకోవడంలో పార్టీ ముఖ్య నేతలు సఫలమయ్యారని.. టికెట్లు ఆశించిన పలువురు ముఖ్య నేతలకు మొండి చెయ్యే ఎదురైందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇక బీసీ ఎజెండాతో ఆ వర్గానికి ఎక్కువ సీట్లు ఇస్తామని పార్టీ నేతలు ప్రకటించిన అంశంపైనా చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు ప్రకటించిన మొత్తం 88 సీట్లలో 32 సీట్లను (36.36 శాతం) బీసీ వర్గాలకు కేటాయించడం ఫర్వాలేదనే స్థాయిలోనే ఉందని, కానీ అంచనా వేసినదానికంటే లెక్క తక్కువగానే ఉందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంకా 31 సీట్లను (జనసేనకు ఇచ్చేవి సహా) ఖరారు చేయాల్సి ఉన్న నేపథ్యంలో.. లెక్కలు మారే అవకాశం ఉందని అంటున్నాయి.

ముఖ్య నేతలకూ అందని టికెట్లు

అంబర్‌పేట నుంచి మాజీ మంత్రి కృష్ణయాదవ్‌కు, చేవెళ్ల నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులకు చాన్స్ దక్కినా.. మరికొందరు ఆశావహులకు మాత్రం మొండిచెయ్యి ఎదురైంది. ముషీరాబాద్, సనత్‌నగర్, అంబర్‌పేటలలో ఏదో ఒకచోటు నుంచి టికెట్ ఆశించిన బండారు విజయలక్ష్మికి, సికింద్రాబాద్ సీటు కోరుకున్న మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయసుధ తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. ముషీరాబాద్‌ను పూసా రాజుకు, సికింద్రాబాద్‌ను మేకల సారంగపాణికి కేటాయించడంతో.. ఆ సీట్లను ఆశించిన వారికి అవకాశం పోయినట్టే. ఇక కార్పొరేటర్లలో రాజేంద్రనగర్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డికి మాత్రమే చాన్స్ దక్కింది. ఎల్‌బీనగర్, ముషీరాబాద్, అంబర్‌పేట, సికింద్రాబాద్, సనత్‌నగర్ తదితర చోట్ల టికెట్లు ఆశించిన కార్పొరేటర్లకు నిరాశే మిగిలింది. దీంతో వారు టికెట్ దక్కిన అభ్యర్థులకు సహకరిస్తారా? లేక రెబెల్స్‌గా పోటీచేస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ రెండు సీట్లపై పంతం

హుస్నాబాద్, వేములవాడ సీట్ల విషయంలో బండి సంజయ్, ఈటల రాజేందర్ తమ పంతం నెగ్గించుకునే ప్రయత్నం చేయడంతో అభ్యర్థుల ఖరారు వాయిదా పడినట్టు తెలిసింది. హుస్నాబాద్‌ను ఈటల తన అనుచరుడు జన్నపరెడ్డి సురేందర్‌రెడ్డికి ఇప్పించుకోవాలని ప్రయత్నించగా.. బండి తన అనుచరుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తికి ఇవ్వాలని పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో పట్టుబట్టినట్టు తెలిసింది. ఇక వేములవాడలో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు కుమారుడు వికాస్‌రావుకు ఇస్తే తనకు అభ్యంతరం లేదని బండి సంజయ్ చెప్పినట్టు తెలిసింది. ఒకవేళ వికాస్‌రావుకు ఇవ్వకుంటే, ఈటలకు రెండు చోట్ల పోటీ అవకాశం ఇచ్చినట్టే.. తనకూ కరీంనగర్‌తోపాటు వేములవాడ నుంచి పోటీ చాన్స్ ఇవ్వాలని సంజయ్ కోరినట్టు సమాచారం. మరోవైపు వేములవాడ స్థానాన్ని తుల ఉమకు కేటాయించేలా ఈటల గట్టి ప్రయత్నం చేస్తున్నారు.

మూడో జాబితాపై నిరసనలు

బీజేపీ మూడో జాబితాలో సీట్లు దక్కని కొందరు ఆశావహులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ బీజేపీ టికెట్ ఆశిస్తున్న దిలీప్‌చారి గురువారం బీజేపీ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. పొత్తులో భాగంగా జనసేనకు నాగర్‌కర్నూల్ సీటు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. మరోవైపు ముప్పై ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలకు టికెట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి విమర్శించారు. కొత్త వారికే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. ఖైరతాబాద్ టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నేత పల్లపు గోవర్ధన్ బీజేపీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. ఎన్నికల్లో నాలుగైదు సీట్లు గెలిచేందుకు బీసీ సీఎం నినాదంతో బలహీన వర్గాలను బీజేపీ నాయకత్వం మోసం చేస్తోందని ఆరోపించారు.

అసంతృప్తిలో బండారు విజయలక్ష్మి

హరియాణా గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి అసంతృప్తితో ఉన్నారు. తాను ఆశించిన ముషీరాబాద్ సీటును వేరేవారికి కేటాయించడంపై ఆమె సన్నిహితుల వద్ద తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆమెను తమ పార్టీలో చేరాలంటూ టచ్‌లోకి వచ్చినట్టు తెలిసింది. ఇక బండా కార్తీకరెడ్డి కూడా తనకు సీటు గ్యారంటీ అని భావించినా.. టికెట్ లభించకపోవడాన్ని తట్టుకోలేకపోతున్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

కేటాయింపుల లెక్కలు ఇవీ..

బీజేపీ మొత్తంగా ఇప్పటివరకు 88 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. మరో 31 స్థానాలను (జనసేన పొత్తు కేటాయింపులు కలిపి) ఖరారు చేయాల్సింది.

- తొలిజాబితాలో 52 మంది, రెండో జాబితాలో ఒకరు, మూడో జాబితాలో 35మంది కలిపి 88 మందికి టికెట్లు ఇవ్వగా.. ఇందులో ఓసీలకు 34, బీసీలకు 32, ఎస్సీలకు 13, ఎస్టీలకు 9 కేటాయించారు.
- తొలిజాబితాలో 12 మంది, మూడో జాబితాలో ఒకరు (హుజూర్‌నగర్ నుంచి చల్లా శ్రీలతారెడ్డి) కలిపి మొత్తంగా 13 మంది మహిళలకు సీట్లు ఇచ్చారు.
- మైనారిటీ వర్గాలకు చెందిన ఒక్కరికి కూడా ఇప్పటివరకు టికెట్ కేటాయించలేదు.
- బీసీలకు ఇచ్చిన 32 సీట్లలో.. ముదిరాజ్-గంగపుత్ర 7, గౌడ 6, మున్నూరు కాపు 5, యాదవ 4, పెరిక 2, లోధీ 2, బోయ 1, లింగాయత్ 1, విశ్వకర్మ 1, పద్మశాలి 1, ఆరె కటిక 1, ఆరె మరాఠాలకు 1 సీటును కేటాయించారు.

బీజేపీ మూడో జాబితాలో 35 మంది..

▶ మొదటి పేజీ తరువాయి

బాబూమోహన్, అంబర్ పేట నుంచి కృష్ణ యాదవ్, ఎల్బీనగర్ నుంచి సామ రంగారెడ్డి, చేవెళ్ల నుంచి కేఎస్ రత్నం, ఉప్పల్ నుంచి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, సనత్‌నగర్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి, పరకాల నుంచి పి.కాళీప్రసాద్‌రావు చోటు దక్కించుకున్నారు. బుధవారం రాత్రి ఢిల్లీలో జరిగిన ప్రధాని మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్, రాజ్‌నాథ్‌సింగ్, కె.లక్ష్మణ్, ఫడ్నవీస్‌తో కూడిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ జాబితాకు ఆమోద ముద్ర వేసింది.

పొత్తు చర్చల తర్వాత తుది జాబితా

మిగతా స్థానాలకు అభ్యర్థులను బీజేపీ పెద్దలు దాదాపు ఖరారు చేసినా.. జనసేనతో పొత్తు నేపథ్యంలో ప్రకటించలేదని తెలిసింది. విదేశీ పర్యటనలో ఉన్న జనసేన అధినేత తిరిగి వచ్చాక ఆ పార్టీకి కేటాయించే స్థానాలపై చర్చలు పూర్తిచేసి.. తుది జాబితాను విడుదల చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. జనసేనకు 10 నుంచి 12 స్థానాలను కేటాయించేలా అధిష్టానంతో ఇప్పటికే చర్చలు జరిగాయని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

మూడో జాబితాలో అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	అభ్యర్థి	నియోజకవర్గం	అభ్యర్థి
1.మంచిర్యాల	వీరబెల్లి రఘునాథ్	18.అంబర్‌పేట	కృష్ణాయాదవ్
2.ఆసిఫాబాద్ (ఎస్టీ)	అజ్మీరా ఆత్మారాం నాయక్	19.జూబ్లీహిల్స్	లంకల దీపక్‌రెడ్డి
3.బోధన్	వడ్డి మోహన్ రెడ్డి	20.సనత్‌నగర్	మర్రి శశిధర్‌రెడ్డి
4.బాన్సువాడ	యెండల లక్ష్మీనారాయణ	21.సికింద్రాబాద్	మేకల సారంగపాణి
5.నిజామాబాద్ రూరల్	దినేశ్ కులాచారి	22.నారాయణపేట్	కె.రతంగ్ పాండురెడ్డి
6.మంథని	చందుపట్ల సునీల్‌రెడ్డి	23.జడ్చర్ల	చిత్తరంజన్ దాస్
7.మెదక్	పంజా విజయ్‌కుమార్	24.మక్తల్	జలంధర్‌రెడ్డి
8.నారాయణఖేడ్	జెనవాడే సంగప్ప	25.వనపర్తి	అశ్వత్థామరెడ్డి
9.ఆందోల్(ఎస్సీ)	పల్లి బాబూమోహన్	26.అచ్చంపేట(ఎస్సీ)	దేవని సతీశ్‌మాదిగ
10.జహీరాబాద్ (ఎస్సీ)	రామచంద్ర రాజ నరసింహ	27.షాద్‌నగర్	అందె బాబయ్య
		28.దేవరకొండ(ఎస్టీ)	కేతావత్ లాలూనాయక్
11.ఉప్పల్	ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్	29.హుజూర్‌నగర్	చల్ల శ్రీలతారెడ్డి
12.ఎల్బీనగర్	సామ రంగారెడ్డి	30.నల్గొండ	మాదగాని శ్రీనివాస్‌గౌడ్
13.రాజేంద్రనగర్	తోకల శ్రీనివాస్‌రెడ్డి	31.ఆలేరు	పడాల శ్రీనివాస్
14.చేవెళ్ల (ఎస్సీ)	కేఎస్ రత్నం	32.పరకాల	పి.కాళీప్రసాద్‌రావు
15.పరిగి	బోనేటి మారుతికిరణ్	33.పినపాక(ఎస్టీ)	పొడియం బాలరాజు
16.ముషీరాబాద్	పూస రాజు	34.పాలేరు	నున్న రవికుమార్
17.మలక్‌పేట	శ్యామ్‌రెడ్డి సురేందర్‌రెడ్డి	35.సత్తుపల్లి(ఎస్సీ)	రామలింగేశ్వరరావు

తక్కువ సమయంలో విస్తృత ప్రచారం

- హెలికాప్టర్లను ఉపయోగించుకోనున్న బీజేపీ ముఖ్య నేతలు
- మహబూబాబాద్ జిల్లాలో ప్రచారాన్ని ప్రారంభించిన ఈటల
- మరో 3 రోజుల్లో ప్రచార షెడ్యూల్‌ను ఖరారు చేసుకోనున్న బండి సంజయ్
- కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ ఇతర నేతల పర్యటనలకూ రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు, సాధ్యమైనన్ని ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేయడానికి వీలుగా బీజేపీ ముఖ్యనేతలు హెలికాప్టర్ సేవలను వినియోగించుకోనున్నారు. కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఇతర ముఖ్యనేతలు నిర్వహించే ప్రచారానికి హెలికాప్టర్లను వినియోగించనున్నారు. ఇందులో భాగంగా...గురువారం ఉదయమే ఢిల్లీ నుంచి నగరానికి తిరిగొచ్చిన ఈటల రాజేందర్...బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్లో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు వెళ్లారు. గూడూరు నుంచి రోడ్డు మార్గాన డోర్నకల్ నియోజకవర్గంలోని నరసింహులపేటకు వచ్చిన ఆయన బీజేపీ అభ్యర్థి భూక్య సంగీత తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన మహబూబాబాద్ నియోజకవర్గంలోని గూడూరుకు చేరుకుని అక్కడ బీజేపీ అభ్యర్థి హుస్సేన్ నాయక్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల సభ ముగిశాక హెలికాప్టర్లో హైదరాబాద్ చేరుకున్నారు. మళ్లీ ఈ నెల 5వ తేదీ నుంచి హెలికాప్టర్ ద్వారా ఆయా నియోజకవర్గాల్లో ఈటల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. తాజాగా పార్టీ అభ్యర్థుల రెండో జాబితా విడుదల కావడంతో...నామినేషన్ల దాఖలు...ఎన్నికల ప్రచార కార్యక్రమాల షెడ్యూల్‌ను ఖరారు చేసుకోవాల్సి ఉంది. మరో మూడు రోజుల్లో ప్రచార షెడ్యూల్‌ను ఖరారు చేసుకుని హెలికాప్టర్ ద్వారా విస్తృత ప్రచారాన్ని చేపడతామని బండి సంజయ్ 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. ప్రతీరోజు ఉదయం 7 నుంచి 11 దాకా, మళ్లీ సాయంత్రం 4 నుంచి 9 దాకా తాను పోటీచేస్తున్న కరీంనగర్‌లో సంజయ్ ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా వరుసగా ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారానికి సంజయ్ సిద్ధమవుతున్నారు. పార్టీ అప్పగించిన ప్రచార బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూనే.. పోటీ చేసే అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు సంజయ్ తెలిపారు. బీజేపీ అభ్యర్థుల మలివిడత జాబితాను ప్రకటించాక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఇతర నేతల ఎన్నికల ప్రచారానికి పార్టీ షెడ్యూల్ ఖరారు చేస్తోంది. కిషన్‌రెడ్డి, ఇతర ముఖ్యనేతలు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సభలో పాల్గొనేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తీసుకుని వస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు హెలికాప్టర్‌లో నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తుండగా..కాంగ్రెస్ కూడా పార్టీ అధినేతలు వచ్చిన సమయంలో హెలికాప్టర్ సేవలను వినియోగించుకుంటోంది.

కేసీఆర్‌ను ఓడించాలంటే మరో కేసీఆర్ పుట్టాలి

● ఎమ్మెల్సీ కవిత



బోధన్: తెలంగాణ గడ్డపై ఉద్యమ నేత కేసీఆర్‌ను రాజకీయంగా ఓడించాలంటే ఎవరి తరం కాదని, మళ్లీ కేసీఆరే పుట్టాలని.. అయితే అది సాధ్యమయ్యే పని కాదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ మైదానంలో గురువారం రాత్రి జరిగిన బీఆర్ఎస్ మహా యువగర్జన సభలో ఆమె ప్రసంగించారు. కేసీఆర్ ఏం చేశారని చాలామంది మాట్లాడుతున్నారని, ఆయన ఎవరూ అడగకుండానే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు కొట్లాటలకు, ముచ్చట్లకే సమయం సరిపోవడం లేదని, అలాంటివారు ప్రజల గురించి ఏం ఆలోచిస్తారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ నినాదమైన నీళ్లు, నిధులు, నియామకాలను సంపూర్ణంగా అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌దే నన్నారు. ఓడిపోతామనే నిరాశలో కాంగ్రెస్ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. మొన్న టీపీసీసీ చీఫ్ రేటింతరెడ్డి (రేవంత్‌రెడ్డి) ఉస్మానియా విద్యార్థులను అడ్డమీది కూలీలన్నారని, రైతుబంధును బిచ్చమేస్తున్నారని అన్నారని కవిత పేర్కొన్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం 24 వేల ఉద్యోగాలిస్తే, అందులో తెలంగాణ వాటాకు 10 వేలు ఉద్యోగాలొచ్చాయన్నారు. కానీ పదేళ్ల కేసీఆర్ పాలనలో 2 లక్షలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి, లక్షా 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ఎమ్మెల్యే షకీల్, జెడ్పీవైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు, ప్రజాప్రతినిధులు సభలో పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

- బీసీ ఆత్మగౌరవ బహిరంగ సభలో పాల్గొననున్న ప్రధాని
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు రాజ్యాధికారం దిశగా ఈనెల 7న నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకోసం ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ రానున్నట్లు బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా చేసే నినాదంతో బీజేపీ ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి తమ పార్టీ బీసీలకు పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. 7వ తేదీన జరిగే బహిరంగ సభకు బీసీలు పెద్ద ఎత్తున హాజరై సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

ఓర్వలేక రాహుల్ విమర్శలు

రాష్ట్రంలో బీజేపీ బీసీ అభ్యర్థి ఎక్కడ ముఖ్యమంత్రి అవుతారో అనే ఓర్వలేనితనంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. తన ఎన్నికల ప్రచారంలో బీసీ సీఎం అభ్యర్థి విషయంలో చులకనగా వ్యాఖ్యలు చేశారని లక్ష్మణ్ విమర్శించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు బీసీలను అవమానించేలా ఉన్నాయని అన్నారు. జనసేనతో పొత్తు విషయంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు నిరాశ పడాల్సిన అవసరం లేదని లక్ష్మణ్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన పోటీ నుంచి వైదొలగడం కారణంగానే బీజేపీకి అధిక సీట్లు వచ్చాయని, జనసేనతో పొత్తు బీజేపీకి లాభాన్నిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. టీడీపీతో బీజేపీకి పొత్తు లేదని, జనసేన ఎన్డీఏలో ఉంది కాబట్టే తాము పొత్తుకు వెళతామని తెలిపారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ ఎవరికి మద్దతు ఇస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

బెల్ట్‌షాపులు పెట్టడంలో నంబర్‌వన్

● సీఎం కేసీఆర్‌పై ఈటల రాజేందర్ ధ్వజం



సాక్షి, మహబూబాబాద్: తెలంగాణను అభివృద్ధిలో నంబర్‌వన్‌గా చేసినట్లు చెబుతున్న సీఎం కేసీఆర్ బెల్ట్‌షాపులను పెట్టి ప్రజలను తాగుబోతులుగా మార్చి, వారి కష్టాన్ని రక్తంలా పీల్చుకోవడంలోనూ నంబర్‌వన్‌గా ఉన్నారని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. గురువారం డోర్నకల్ నియోజకవర్గం నర్సింహులపేట, మహబూబాబాద్ నియోజకవర్గం గూడూరులో నిర్వహించిన బీజేపీ బహిరంగసభల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు డిగ్రీ పట్టాలు పట్టుకొని ఉద్యోగాల్లేక రోడ్లపై తిరుగుతున్నారని పేర్కొన్నారు. గ్రూప్-1 పేపర్లను కొందరు అమ్ముకోవడం వల్ల కష్టపడి చదువుకున్న వారికి కాకుండా, డబ్బులు పెట్టిన వారికి ప్రభుత్వ ఉద్యోగులు వచ్చే దుస్థితి ఉందన్నారు. గిట్టుబాటు ధర అడిగిన రైతుల చేతులకు బేడీలు వేసిన కేసీఆర్ రైతుల పక్షపాతినని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నిరుద్యోగులు, రైతులు, మహిళలు కేసీఆర్‌ను ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మానుకోటలోని ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కేసీఆర్ శిష్యుడేనని అన్నారు. సమావేశంలో బీజేపీ మహబూబాబాద్ అభ్యర్థి హుస్సేన్ నాయక్, డోర్నకల్ అభ్యర్థి సంగీత తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ క్షమాపణలు చెప్పాల్సిందే: బండి



సాక్షి, హైదరాబాద్/కరీంనగర్‌టౌన్: తెలంగాణలో రెండు శాతం ఓట్లు కూడా రాని బీజేపీ బీసీని సీఎం ఎట్లా చేస్తుందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తప్పుబట్టారు. బీసీలను అవమానిస్తారా? బీసీలంటే కాంగ్రెస్‌కు అంత చులకనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకు ముందు కేటీఆర్.. ఇప్పుడు రాహుల్‌గాంధీ బీసీలను అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారని, వారిద్దరూ బహిరంగంగా బీసీలకు క్షమాపణ చెప్పాకే ఓట్లు అడగాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే ఓబీసీ కులగణన చేపడతామని చెబుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేసే దమ్ము ఉందా అని సంజయ్ ప్రశ్నించారు. సీట్ల కేటాయింపులోనే అన్యాయం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీసీలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బీసీ ద్రోహుల పార్టీలని బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ మండిపడ్డారు.

అవి జన వశీకరణ క్షుద్రపూజలు

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేస్తున్న యాగం రాజశ్యామల యాగం కాదని. అది జన వశీకరణ క్షుద్రపూజలు చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఎద్దేవా చేశారు. గురువారం కరీంనగర్‌లో జరిగిన బీజేపీ స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ ఈస్ట్ జోన్ పోలింగ్ బూత్ అధ్యక్షుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో సబ్బండవర్గాలు అల్లాడుతున్నాయన్నారు.

అన్నారంను పరిశీలించిన ఇంజనీర్లు



బ్యారేజీని పరిశీలిస్తున్న ఇంజనీర్లు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం (సరస్వతి)బ్యారేజీని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సభ్యుడు దేవేందర్‌రావు నేతృత్వంలో, స్టేట్ డ్యాం సేఫ్టీ అథారిటీ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు చెందిన 12 మంది సభ్యుల ఇంజనీర్ల బృందం గురువారం సాయంత్రం సందర్శించింది. బ్యారేజీలోని 4వ బ్లాక్‌లో 38, 42 పిల్లర్ల వద్ద ఎండ్ సిల్‌లో ఏర్పడిన బుంగలను వాక్ వేపై నుంచి పరిశీలించారు. సీపేజ్ లీకేజీ వద్ద కొంతనీటిని పరీక్షల కోసం ల్యాబ్ తీసుకువెళ్లారు. ప్రమాదమేమీ లేదని గుర్తించినట్లు తెలిసింది. వారి వెంట రామగుండం ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు, ఈఈ యాదగిరి ఉన్నారు.

క్లుప్తంగా...

ఫిబ్రవరి 8న పాకిస్తాన్ ఎన్నికలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన సాధారణ ఎన్నికలు జరుపుతామని అధ్యక్షుడు అరిఫ్ అల్వీ గురువారం ప్రకటించారు. దేశంలో ఆర్థిక అస్థిరత తీవ్రరూపం దాల్చిన ఈ సమయంలో అధ్యక్షుడితో చర్చించి, ఎన్నికల తేదీని ఖరారు చేయాలంటూ అంతకుముందు ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్(ఈసీపీ) చీఫ్ కమిషనర్ సికందర్ సుల్తాన్ రజా, కమిషన్‌లోని నలుగురు సభ్యులు, అటార్నీ జనరల్ ఉస్మాన్ అవాన్ కలిసి అధ్యక్షుడు అరిఫ్ అల్వీని కలిశారు. ఎన్నికల నిర్వహణపై చర్చలు జరిపారు. అనంతరం ఎన్నికల తేదీని 2024 ఫిబ్రవరి 8గా నిర్ణయించినట్లు అధ్యక్షుడు ప్రకటించారు.

కాంగ్రెస్ అంటే కోత, అవినీతి, కమీషన్: మంత్రి అమిత్ షా

కర్నాల్(హరియాణా): కేంద్ర హోం మంత్రి అమిత్ షా కాంగ్రెస్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఆ పార్టీని ఆయన కోత, కమీషన్, అవినీతి(కట్, కమీషన్, కరప్షన్) పార్టీగా పేర్కొన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలోని 27 పార్టీల నేతలు స్వలాభం కోసమే చేతులు కలిపారని ఆరోపించారు. తమ బీజేపీ మాత్రం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తోందని చెప్పారు. గురువారం హరియాణా ప్రభుత్వం నిర్వహించిన అంత్యోదయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దేశంలో శాంతి భద్రతలను మెరుగుపర్చిందని, అవినీతిని, బంధుప్రీతిని నిర్మూలించిందని చెప్పారు.

గవర్నర్‌పై సుప్రీంకోర్టులో కేరళ పిటిషన్

న్యూఢిల్లీ: రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలపడంలో రాష్ట్ర గవర్నర్ అరిఫ్ మొహమ్మద్ ఖాన్ విపరీతమైన జాప్యం చేస్తున్నారని కేరళ ప్రభుత్వం ఆక్షేపించింది. బిల్లులకు త్వరగా అంగీకారం తెలిపేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రజల హక్కులను గవర్నర్ అగౌరవపరుస్తున్నారని పేర్కొంది. ప్రస్తుతం 8 బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. వాటిపై ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని తెలియజేసింది. ఇవన్నీ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులేనని ఉద్ఘాటించింది.

కాంగ్రెస్ వల్లే 'ఇండియా'లో వేడి తగ్గింది: నితీశ్ కుమార్

పట్నా: విపక్ష 'ఇండియా' కూటమి స్తబ్దుగా మారిపోయిందని, ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీయే అందుకు కారణమని జేడీ(యూ) సీనియర్ నేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మునిగిపోయిందని, దాంతో ఇండియా కూటమిలో వేడి తగ్గిందని అన్నారు. గురువారం బిహార్ రాజధాని పట్నాలో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన సభలో నితీశ్ ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ పాలనను వ్యతిరేకించే పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయని, ఆ కూటమిలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు.

ఇండోనేసియాలో భూకంపం

జకార్తా: ఇండోనేసియా ఆగ్నేయప్రాంతంలో గురువారం ఉదయం భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైంది. ఈస్ట్ నుసా తెంగ్గారా ప్రావిన్స్ రాజధాని కుపంగ్‌కు 21 కిలోమీటర్ల దూరంలో భూమికి 36 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని అధికారులు తెలిపారు. దీని తీవ్రతతో కుపంగ్ నగరంలోని ఇళ్లు, ఇతర భవనాలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పేర్కొంది.

దీక్ష విరమించిన జరంగే

జాల్నా: మరాఠా కోటా కోసం 9 రోజులుగా నిరశన దీక్ష కొనసాగిస్తున్న మనోజ్ జరంగే గురువారం దీక్ష విరమించారు. మరాఠాలకు రిజర్వేషన్ల అంశాన్ని రెండు నెలల్లోగా తేల్చకుంటే మరింత తీవ్రంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. భారీగా జనంతో ముంబైకి తరలివస్తామని, అక్కడి జనానికి నిత్యావసరాలు కూడా అందకుండా చేస్తామని హెచ్చరించారు. జాల్నా జిల్లాలోని అంతర్వాలి సరటిలో దీక్షలో ఉన్న జరంగే వద్దకు గురువారం నలుగురు రాష్ట్ర మంత్రులు వచ్చారు. నిరాహార దీక్ష విరమించాలని జరంగేను వారు కోరడంతో దీక్ష విరమించారు.

బెనారస్ ఐఐటీలో విద్యార్థినిపై దురాగతం

వారణాసి: ఐఐటీ–బీహెచ్‌యూ(బెనారస్ హిందూ యూనివర్సిటీ) విద్యార్థినిపై కొందరు అఘాయిత్యానికి పాల్పడ్డారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు విద్యార్థినిని వేధించడంతోపాటు బట్టలు విప్పించి, వీడియో చిత్రీకరించారు. బాధిత విద్యార్థిని బుధవారం రాత్రి స్నేహితుడితో కలిసి హాస్టల్‌కు సమీపంలోని కర్మన్‌బాబా ఆలయం వద్దకు వెళ్లింది. అప్పుడే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై అక్కడికి వచ్చారు. బాధితురాలిని బలవంతంగా ఓ మూలకు తీసుకెళ్లి వేధింపులకు పాల్పడ్డారు. ఆమెను బట్టలూడదీయించి, వీడియో చిత్రీకరించారు. ఫొటోలు తీశారు. 15 నిమిషాల అనంతరం ఆమె సెల్ నంబర్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ అమానుషంపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

ప్రచారంలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు, దురుద్దేశంతో సమన్లు పంపారు

సమన్లు ఉపసంహరించుకోండి ● ఈడీకి లేఖ రాసిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో నూతన మద్యం విధానంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై వివరాలు రాబట్టేందుకు ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తమ కార్యాలయానికి పిలవగా గురువారం ఆయన గైర్హాజరయ్యారు. దీంతో ఆయనకు మరో తేదీతో సమన్లు జారీచేసే అవకాశముంది. విచారణకు పిలిచి కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేస్తుందన్న ఆప్ ఆరోపణల నడుమ గురువారం ఢిల్లీలోని ఈడీ ఆఫీస్ ఎదుట పెద్దసంఖ్యలో ఆప్ కార్యకర్తలు గుమిగూడారు. ఉద్రిక్త పరిస్థితుల నివారణ కోసం ముందస్తుగా కేంద్రం పెద్దసంఖ్యలో పోలీసు బలగాలను ఈడీ ఆఫీస్, బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద మోహరించింది. ఈ కేసును వచ్చే 6–8 నెలల్లోగా తేల్చేయాలని సుప్రీంకోర్టు ప్రాసిక్యూషన్ వారికి సూచించిన నేపథ్యంలో ఈడీ ఈ కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసే అవకాశముంది.

చట్టవ్యతిరేకం, కక్షపూరితం

ఈడీ ఆఫీస్‌కు గైర్హాజరైన సందర్భంగా దర్యాప్తు సంస్థకు కేజ్రీవాల్ ఒక లేఖ రాశారు. ' నాకు పంపిన ఈ సమన్లు పూర్తిగా చట్టవిరుద్ధం. కక్షపూరితం. రాజకీయ ప్రేరేపితం. బీజేపీ చేస్తున్న తీవ్ర ఒత్తిళ్లతో ఈడీ నోటీసులు పంపించింది. వీటిని ఉపసంహరించుకోండి. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నన్ను అడ్డుకునేందుకు ఇప్పుడీ సమన్లు పంపారు. ఈ కేసుతో నాకు ఎలాంటి సంబంధం ఉందని సమన్లు పంపారు? సాక్షిగానా లేక నిందితుడిగానా అనేది అందులో లేదు. ఢిల్లీకి ముఖ్యమంత్రిగా ఉన్నందుకు పంపారా? లేదంటే ఆప్ కన్వీనర్ అయినందుకు పంపారా?' అని లేఖలో కేజ్రీవాల్ ప్రశ్నించారు. 'కేజ్రీవాల్‌కు సమన్లు పంపి అరెస్ట్ చేస్తారని బీజేపీ నేతలు అక్టోబర్ 30న అన్నారు. అదేరోజు సాయంత్రం యాదృచ్ఛికంగా ఈడీ సమన్లు ఇచ్చింది' అని లేఖలో పేర్కొన్నారు. మరోవైపు, ఈడీ ఆఫీస్‌కు రాకుండా కేజ్రీవాల్ మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కలిసి సింగ్రౌలీ నియోజకవర్గంలో ఎన్నికల రోడ్‌షోలో పాల్గొని ప్రసంగించారు. 'నన్ను అరెస్ట్‌చేస్తారని ఢిల్లీ కోడైకూస్తోంది. ఈడీ అధికారులు నన్ను అరెస్ట్ చేయగలరుగానీ నా ఆలోచనలను అరెస్ట్ చేయలేరుకదా. నా సిద్ధాంతాలతో ఏకీభవించే దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది, కోట్లాది అభిమాన కేజ్రీవాల్‌లను అరెస్ట్ చేయలేరు' అని ర్యాలీలో కేజ్రీవాల్ అన్నారు.



సింగ్రౌలీ నియోజకవర్గంలో ఎన్నికల రోడ్‌షోలో పాల్గొన్న కేజ్రీవాల్, భగవంత్ మాన్

'ఇండియా' కూటమిని దెబ్బతీసేందుకు యత్నం: ఆప్

'ఇండియా' కూటమిని దెబ్బ కొట్టాలంటే ఢిల్లీలో కొరకరాని కొయ్యలా ఉన్న కేజ్రీవాల్‌ను ముందు అరెస్ట్‌చేయాలనేది బీజేపీ ప్రణాళిక. అలా అయితేనే ఢిల్లీ, పంజాబ్‌లో ఆప్ బలహీనమై సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతుందని బీజేపీ కుట్ర పన్నుతోంది' అని ఆప్ ఆరోపించింది.

నిజాన్ని ఎదుర్కోలేక పారిపోయారు: బీజేపీ

కేజ్రీవాల్ గైర్హాజరుపై బీజేపీ ఎద్దేవాచేసింది. ' ఎక్సైజ్ పాలసీ విధానంలో నిజాలను వెల్లడించే ధైర్యం లేకనే కేజ్రీవాల్ ఈడీ ఆఫీస్‌కు రాకుండా పారిపోయారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కింగ్ ఆయనే' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఆరోపించారు. ' సాక్ష్యాలు, ఆధారాలుంటేనే ఈడీ సమన్లు జారీచేసి విచారణకు పిలుస్తుంది. మద్యం విధానం గురించి బాగా కేజ్రీవాల్‌కు బాగా తెలుసు. నిజాలు కప్పిపుచ్చే సమర్థత లేకనే, భయంతోనే ఆయన ఈడీ ఆఫీస్‌కు వెళ్లలేదు' అని ఆయన ఆరోపించారు.



విలేకరి ప్రశ్నకు బదులిస్తూ.. 'నా కళ్లల్లో నీళ్లున్నాయా? అంటూ ఎదురు ప్రశ్నిస్తున్న మొయిత్రా

మొయిత్రా వాకౌట్

- ఆమెకు మద్దతుగా బయటికొచ్చిన విపక్ష సభ్యులు
- తొలుత కమిటీ ఎదుట తన వాదనలు వినిపించిన మొయిత్రా
- కమిటీలో దారుణ ప్రశ్నలు వేశారని ఆరోపణ

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు నగదు తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్ నైతిక విలువల కమిటీ ముందు హాజరై తర్వాత వాకౌట్ చేశారు. కమిటీ భేటీలో తీవ్ర అభ్యంతర, వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారంటూ ఆమె మధ్యలోనే బయటికొచ్చారు. ఆమెకు మద్దతు పలుకుతూ విపక్ష ఎంపీలు సైతం అర్ధంతరంగా బయటికొచ్చారు. కాగా, 'ఎథిక్స్ కమిటీని మొయిత్రా తప్పుదోవ పట్టించే ప్రయత్నంచేశారు. కమిటీ తప్పుడు విధానాలను అవలంబిస్తోందంటూ, కమిటీ నిర్వహణ పద్ధతిని మొయిత్రా తప్పుగా చిత్రించే దుస్సాహసం చేశారు' అని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఆరోపించారు. 'నగదుకు ప్రశ్నలు' ఆరోపణలుసహా తన పార్లమెంట్ లాగిన్ వివరాలను పారిశ్రామికవేత్త దర్శన్ హీరానందానీకి మొయిత్రా ఇచ్చారని, దుబాయ్ నుంచి చాలా సార్లు లాగిన్ అయ్యా, విదేశాల్లో లాగిన్ అవడంతో దేశభద్రత ప్రమాదంలో పడిందని దూబే తీవ్ర ఆరోపణలు చేయడం తెల్సిందే. లోక్‌సభ స్పీకర్ బిర్లాకు దూబే ఫిర్యాదుచేయడంతో వివరణ కోరుతూ పార్లమెంట్ ఎథిక్స్ కమిటీ మొయిత్రాను గురువారం పిలిచింది. ఈ భేటీ దాదాపు నాలుగు గంటలపాటు సాగింది.

అసభ్యమైన ప్రశ్నలు వేస్తున్నారు: మొయిత్రా

'అసలు అవేం ప్రశ్నలు?. తీవ్ర అభ్యంతరకరమైన, అసభ్యమైన ప్రశ్నలు అడుగుతున్నారు. అందుకే బయటికొచ్చేశా' అని అక్కడ ఉన్న మీడియాతో అన్నారు. 'మీ కళ్లలో నీళ్లు తిరుగుతున్నట్లు ఉన్నాయిగా' అని అక్కడున్న ఒక విలేకరి ప్రశ్నించగా.. 'ఏమిటా చెత్త ప్రశ్న. చూడు నా కళ్లలో నీళ్లు కనిపిస్తున్నాయా?' అంటూ మొయిత్రా తన రెండు కళ్లను చూపించారు. 'అసలు ఇది ఎథిక్స్ కమిటీయేనా?. ముందే సిద్ధంచేసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారు' అంటూ కమిటీపై మొయిత్రా ఆరోపణలు చేశారు. ''కమిటీలో చైర్మన్ నన్ను మాటలతో 'వస్త్రాపహరణం' చేశారు'' అని ఫిర్యాదు చేస్తూ స్పీకర్ బిర్లాకు మొయిత్రా ఒక లేఖ రాశారు.

మొయిత్రా, కమిటీ చైర్మన్, సభ్యులు ఏమన్నారు?

మొయిత్రా వాకౌట్ తర్వాత ఎథిక్స్ కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోంకార్ మీడియాతో మాట్లాడారు. ' నిజానికి కమిటీ విధివిధానాలు, నిర్వహణ పద్ధతిపై మొయిత్రా తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. తర్వాత ఆమె, విపక్ష సభ్యులు చర్చ జరుగుతుండగానే మధ్యలో బయటికొచ్చేశారు' అని చెప్పారు. ' మొయిత్రాను అడిగిన ప్రశ్నలు అగౌరవనీయం, అనైతికంగా ఉన్నాయి. ఎక్కడెక్కడ తిరిగారు. ఎవరితో మాట్లాడారు. మీ ఫోన్ రికార్డింగ్‌లు ఇవ్వాలని కమిటీ అడిగింది' అని కాంగ్రెస్ ఎంపీ, ప్యానెల్ సభ్యుడు అయిన ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. 'రాత్రిళ్లు ఎవరితో మాట్లాడతారు? ఎలాంటి విషయాలు మాట్లాడతారు? అని ఆమెను ప్రశ్నించారు. మహిళా ఎంపీని చైర్మన్ ప్రశ్నలు అడిగే పద్ధతి ఇదేనా? ద్రౌపది వస్త్రాపహరణం తరహాలో విచారణ కొనసాగింది' అని కమిటీ సభ్యుడు డ్యానిష్ అలీ ఆరోపించారు.

ఆ లాయర్ వల్లే ఇదంతా !

బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేకు బలమైన సాక్ష్యాలు ఇచ్చారంటూ వార్తల్లో నిలిచిన న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్ గతంలో మొయిత్రాకు బాగా తెలుసు. వీరిద్దరూ కొన్నాళ్లు సహజీవనం చేసి విడిపోయారు. విడిపోయేటపుడు జరిగిన గొడవకు ప్రతీకారంగానే జై అనంత్ ఇవన్నీ చేస్తున్నారని మీడియాలో వార్తలొచ్చాయి. కమిటీ ముందు ఇవే అంశాలను మొయిత్రా ప్రస్తావించారని తెలుస్తోంది. అయితే, దేహద్రాయ్‌తో బంధం విడిపోయిన విషయం పక్కనబెట్టి 'నగదుకు ప్రశ్నలు' అంశంపై వివరణ ఇవ్వాలని కోరినా ఆమె పట్టించుకోలేదని బీజేపీ ఎంపీ, కమిటీ సభ్యుడు విష్ణుదత్ శర్మ ఆరోపించారు.

కొనసాగుతున్న దాడులు

- హమాస్ మిలిటెంట్ల కోసం గాలింపు ముమ్మరం
- గాజా సిటీ దిశగా ఇజ్రాయెల్ సైనిక దళాలు

జెరూసలేం: గాజాలో హమాస్ మిలిటెంట్ గ్రూప్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఇజ్రాయెల్ పదాతి దళాలు మరింత ముందుకు చొచ్చుకెళ్తున్నాయి. మిలిటెంట్ల కోసం వీధుల్లో ముమ్మరంగా గాలిస్తున్నాయి. హమాస్ మిలిటెంట్లకు గట్టి పట్టున్న గాజా సిటీ దిశగా సైన్యం కదులుతోంది. గాజా భూభాగంలో వైమానిక దాడులు సైతం యథావిధిగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి సెంట్రల్ గాజాలో బురీజ్ శరణార్థి శిబిరంలోని ఓ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేయడంతో 15 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో జనం శిథిలాల కింద చిక్కుకున్నారు. గాజాలో తమ సైన్యంపై హమాస్ మిలిటెంట్లు యాంటీ ట్యాంక్ మిస్సైళ్లు, గ్రనేడ్లు ప్రయోగించారని ఇజ్రాయెల్ వెల్లడించింది. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆపడానికి దౌత్యపరమైన ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ విషయంలో అమెరికాతోపాటు అరబ్ దేశాలు చొరవ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌తోపాటు హమాస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. యుద్ధానికి కనీసం విరామం అయినా ఇవ్వాలని ఇరుపక్షాలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, సాధారణ ప్రజల ప్రాణాలను హరించడం తగదని ఆయన పరోక్షంగా తేల్చిచెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ శుక్రవారం ఇజ్రాయెల్‌లో పర్యటించబోతున్నారు. జోర్డాన్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌లోని తమ రాయబారిని వెనక్కి రప్పించింది. యుద్ధం ముగిసేదాకా తమ దేశానికి రావొద్దని ఇజ్రాయెల్ రాయబారికి సూచించింది.

గాజాలో 9 వేలు దాటిన మృతులు

ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో మృతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 9,061 మంది పాలస్తీనియన్లు మరణించారని, 32,000 మందికిపైగా గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి డాక్టర్ అష్రాఫ్ అల్–ఖుద్రా గురువారం వెల్లడించారు. మృతుల్లో 3,760 మంది 18 ఏళ్లలోపు వారేనని చెప్పారు. ఇవన్నీ అధికారిక గణాంకాలే. వాస్తవానికి ఇంకా ఎంతమంది చనిపోయారో అధికారులు చెప్పలేకపోతున్నారు. గాజాలో వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారంతా మరణించి ఉండొచ్చని తెలుస్తోంది. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దాడులతోపాటు అంతర్గత ఘర్షణల్లో 130 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా బలయ్యారు.

ఈజిప్టుకు మరో 100 మంది..

విదేశీ పాస్‌పోర్టులు కలిగి ఉన్నవారు గాజా నుంచి ఈజిప్టుకు వెళ్లిపోతున్నారు. బుధవారం 335 మంది వెళ్లగా, గురువారం మరో 100 మంది రఫా సరిహద్దును గుండా ఈజిప్టులో అడుగుపెట్టారు. అంతేకాకుండా గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన 76 మంది పాలస్తీనియన్లు వారి సహాయకులతో కలిసి ఈజిప్టు చేరుకున్నారు. వారికి ఈజిప్టులో చికిత్స అందించనున్నారు. గాజాలో ప్రస్తుతం దాదాపు 400 మంది అమెరికన్లు ఉన్నారు. వారందరినీ క్షేమంగా స్వదేశానికి చేర్చడానికి అమెరికా ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది.



రఫా సరిహద్దు మీదుగా దక్షిణ గాజాలోకి వచ్చిన సరకుల పెట్టెలను లూటీ చేస్తున్న స్థానికులు



వాహనాలకు ఇంధనం కొరత కారణంగా ఖాన్ యూనిస్ పట్టణంలో గాడిదలు లాగే బండ్లపై ప్రయాణిస్తున్న పాలస్తీనియన్లు



ద్వంద్వ పౌరసత్వం ఉండి గాజాను వీడుతున్న పాలస్తీనియన్లు, విదేశీయుల డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న పాలస్తీనియన్ సరిహద్దు బలగాలు.

'మై లార్డ్' అనకండి..

సగం వేతనం ఇచ్చేస్తా! ● సీనియర్ న్యాయవాదితో సుప్రీంకోర్టు జడ్జి



న్యూఢిల్లీ: కోర్టులో వాదోపవాదాల సమయంలో పదేపదే మై లార్డ్, యువర్ లార్డ్‌షిప్స్'అంటూ లాయర్లు తమను సంబోధిస్తుండటంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మై లార్డ్స్ అని ఎన్నిసార్లు అంటారు? ఇలా అనడం ఆపేస్తే, నా వేతనంలో సగం మీకిచ్చేస్తా'అని జస్టిస్ పీఎస్ నరసింహ పేర్కొన్నారు. బుధవారం జస్టిస్ ఏఎస్ బొపన్నతో కలిసి ఆయన ఓ కేసు విచారణలో పాల్గొన్నారు. వాదోపవాదాల సమయంలో ఓ సీనియర్ లాయర్ పదేపదే 'మై లార్డ్, యువర్ లార్డ్‌షిప్స్' అంటుండటంపై పైవిధంగా ఆయన స్పందించారు. వాటికి బదులుగా సర్ అని అనొచ్చు కదా అని తెలిపారు. లేకుంటే ఆ మాటలను ఎన్నిసార్లు వాడేదీ లెక్కపెడ తానని చెప్పారు. 'మై లార్డ్, యువర్ లార్డ్‌షిప్'అనే మాటలు వలస పాలన ఆనవాళ్లని, కోర్టు ప్రొసీడింగ్స్ సమయంలో వాడరాదంటూ 2006లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీర్మానం చేసింది.

ఉద్యోగ మేళాల పేరిట మోదీ డ్రామాలు: ఖర్గే

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ పాలనలో దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం విమర్శించారు. ఉద్యోగ మేళాల పేరిట మోదీ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఉద్యోగాలు, ప్రమోషన్లు వచ్చినవారికి మళ్లీ నియామక పత్రాలు ఇస్తూ ప్రచారం కోసం పాకులాడుతున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగాల కోసం చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్న కోట్లాది మంది యువత ఆశలపై ప్రధానమంత్రి నీళ్లు చల్లుతున్నారని ఆక్షేపించారు. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగిత శాతం రెండేళ్ల గరిష్టాన్ని అధిగమించిందంటూ 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ లిమిటెడ్' తాజాగా విడుదల చేసిన నివేదికను ఖర్గే ప్రస్తావించారు. మోదీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో 90 లక్షలకుపైగా ఉద్యోగాలు మాయమయ్యాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల కోసం డిమాండ్ 20 శాతం పెరిగిందని తెలిపారు. మొత్తానికి దేశంలో నిరుద్యోగం 10.8 శాతానికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువతలో నిరుద్యోగం 13.4 శాతంగా ఉందని, ప్రభుత్వ సర్వేలోనే ఈ విషయం బయటపడిందని పేర్కొన్నారు. ఉద్యోగాల విషయంలో తప్పుడు ప్రకటనలు, ట్రిక్కులు ఎక్కువ కాలం చేయవని తేల్చిచెప్పారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేసిన వారిపై యువత ప్రతీకారం తీర్చుకుంటారని, ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతున్నారన్నారు.

విరాళాల వివరాలివ్వండి

- రాజకీయ పార్టీలు అందుకున్న విరాళాలపై ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఎలక్టోరల్ బాండ్ల చట్టబద్ధత కేసులో వాదనలు పూర్తి
- తీర్పును రిజర్వ్‌చేసిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు విరాళాలు అందుకునేందుకు తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం చట్టబద్ధతను సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై వాదనలు గురువారం ముగిశాయి. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ' ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు అందుకున్న విరాళాల సమగ్ర డేటాను సీల్డ్ కవర్‌లో మాకు రెండు వారాల్లోగా అందజేయండి' అని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)ను ధర్మాసనం ఆదేశించింది. ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు. బాండ్ల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్, సీపీఐ(ఎం) నేత, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)లు విడివిడిగా పిటిషన్లు వేయడం తెల్సిందే. బాండ్లను విక్రయించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను విరాళాల దాతల వివరాలు అడగబోము. కానీ ఎన్ని బాండ్లు విక్రయించారు, ఎంత మొత్తం పార్టీల ఖాతాల్లో జమ అయిందనే వివరాలు ఇవ్వండి' అని ఈసీకి కోర్టు సూచించింది.

'పరస్పర సహకార' ధోరణికి

ఈ బాండ్ పనిముట్టుగా మారొద్దు: అధికార పార్టీ నుంచి ప్రయోజనం పొందే వారు.. అధికార పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో భారీగా విరాళాల ద్వారా లబ్ధి చేకూర్చడం, ఆతర్వాత అధికార పార్టీ నుంచి వారు అదే స్థాయిలో లబ్ధిపొందటం వంటి ధోరణి ఉండొద్దు. లబ్ధిదారులు, అధికారి పార్టీ మధ్య నీకిది నాకది(క్విడ్ ప్రో కో) తరహా విధానానికి ఎలక్టోరల్ బాండ్ అనేది పనిముట్టుగా మారకూడదు' అని వాదోపవాదనల సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ' దాత వివరాలు గ్రహీత పార్టీకి తెలుసు. తాను ఎవరికి విరాళమిచ్చేది ఇంకో పార్టీకి తెలియకూడదని దాత కోరుకుంటున్నాడు. విరాళాల బదిలీ వ్యవహారం దాతకు, ఆ రాజకీయ పార్టీకి ముందే తెలిసినప్పుడు ఈ వివరాలు సాధారణ పౌరుడికి మాత్రం తెలియాల్సిన పని లేదని కేంద్రం వాదించడంలో ఆంతర్యమేంటి?' అని కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది.

యాపిల్‌కు నోటీసులు

ఐఫోన్ల హ్యాకింగ్ అలర్ట్‌లపై దర్యాప్తు మొదలుపెట్టిన సీఈఆర్‌టీ–ఇన్

న్యూఢిల్లీ: విపక్ష ఎంపీల ఐఫోన్లకు వచ్చిన హ్యాకింగ్ అలర్ట్‌ల ఉదంతంలో కేంద్ర సైబర్‌సెక్యూరిటీ దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగింది. భారత కంప్యూటర్ అత్యవసర స్పందనా బృందం(సీఈఆర్‌టీ–ఇన్) సంస్థ తన దర్యాప్తు ఇప్పటికే ప్రారంభించిందని కేంద్ర సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ గురువారం చెప్పారు. ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకర్లు ఐఫోన్ల దాడికి యత్నించినట్లు ఏమైనా ఆధారాలుంటే సమర్పించాలని ఐఫోన్ తయారీసంస్థ యాపిల్‌ను కోరుతూ కేంద్రం నోటీసులు పంపింది. సీఈఆర్‌టీ–ఇన్ ఆధ్వర్యంలో జరిగే దర్యాప్తుకు యాపిల్ సంస్థ సహకరించనుందని కృష్ణన్ చెప్పారు. సీఈఆర్‌టీ అనేది జాతీయ నోడల్ ఏజెన్సీ. కంప్యూటర్ భద్రతను సవాల్ చేసే ఘటనలు సంభవించినపుడు వెంటనే సీఈఆర్‌టీ స్పందించి తగు సూచనలు, సలహాలు ఇస్తుంది.

కల్వల మల్లికార్జున్ రెడ్డి

తెలంగాణ సాధన లక్ష్యంగా 2001లో ఉద్యమపార్టీగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ 14 ఏళ్ల పోరాటం తర్వాత 2014లో రాష్ట్రం ఏర్పాటైంది. ఉద్యమ సమయంలో ఎన్నికలను రాష్ట్ర సాధన అస్త్రాలుగా సంధించిన టీఆర్ఎస్ తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి ధ్యేయంగా బరిలోకి దిగింది. 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త రాష్ట్రాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చింది. తాము స్వీయ రాజకీయశక్తిగా ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో బలం పుంజుకోవాల్సిన అవసరముందని తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండు పర్యాయాలు పోటీ చేసి అధికారం దక్కించుకున్న టీఆర్ఎస్ ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రూపంలో మరోమారు 2023 అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగింది. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి తమ లక్ష్యంగా ప్రకటించిన గులాబీపార్టీ 2023 మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలను మరింత విస్తరిస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కేసీఆర్ భరోసా' పేరిట మేనిఫెస్టోలోని 17 అంశాలతో ఓటర్లకు చేరువయ్యేందుకు బీఆర్ఎస్ ప్రాధాన్యం ఇస్తోంది.

సారు భరోసాపైనే..

నాడు సమగ్రాభివృద్ధి | నేడు సంక్షేమ విస్తరణ

తెలంగాణ పునర్నిర్మాణమే ప్రథమ ఎజెండాగా..

2014 నుంచి 2023 ఎన్నికల వరకు బీఆర్ఎస్ మేనిఫెస్టోల తీరిదే

వినూత్న పాలన సంస్కరణలతో సామాజిక మార్పు కోసం నిజాయతీ, నిబద్ధతతో నిరంతరం పనిచేస్తామని టీఆర్ఎస్ ప్రకటించింది. సామాజిక ఉద్యమ కార్యకర్తలతో రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రజా కమిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాల రూపకల్పనలో సూచనలు స్వీకరిస్తామని, అమలు తీరును కూడా ఈ కమిటీలు పర్యవేక్షిస్తాయని పేర్కొంది. దీని కోసం రాష్ట్ర సచివాలయంలో ఒక విభాగం ఏర్పాటు చేస్తామని, పౌర సమాజం కనుసన్నల్లో పారదర్శక, జవాబుదారీ విధానంతో ప్రజాస్వామిక పాలన కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. నీటి పారుదల, విద్యుత్, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్యం, సంక్షేమం సహా 36 ప్రధాన అంశాలతో కూడిన ఎన్నికల మేనిఫెస్టోను టీఆర్ఎస్ విడుదల చేసింది.

2014
సమగ్రాభివృద్ధి

రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన 2014 ఎన్నికల్లో తమకు తొలిసారిగా దక్కిన అధికారంతో తెలంగాణ పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించినట్టు ప్రకటించింది. నాలుగున్నరేళ్ల ప్రస్థానంలో గణనీయమైన అభివృద్ధి సాధనతో దేశం దృష్టిని ఆకర్షించినట్టు పేర్కొంది. ఓవైపు బాలారిష్టాలను దాటడంతోపాటు, ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలను కూడా అధిగమించినట్టు పేర్కొంది. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల కరెంటు, కల్యాణలక్ష్మి వంటి 76 పథకాలను ప్రజల అవసరాల మేరకు కొత్తగా ప్రవేశ పెట్టినట్టు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగిందని, పెరిగిన సంపదను పేదలకు పంచుతామని 2018 మేనిఫెస్టోలో పేర్కొంది.

2018
పెరిగిన సంపద పేదలకు

తెలంగాణ ఏర్పడే నాటికి ఉన్న పరిస్థితులను అర్థం చేసుకుని అధ్యయనం తర్వాత అనేక పాలసీలు రూపొందించినట్టు ప్రకటించింది. తెలంగాణ బాగుకు సంపద పెంచి ప్రజలకు పంచాలనే నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్టు పేర్కొన్నది. సంక్షేమానికి, అభివృద్ధికి తొమ్మిదిన్నరేళ్లలో సమ ప్రాధాన్యం ఇచ్చినట్టు ప్రకటించింది. ఆర్థిక, విద్యుత్, తాగునీరు, సాగునీరు వ్యవసాయ, దళిత, సంక్షేమ, విద్య, ఆరోగ్య, పారిశ్రామిక, గృహ నిర్మాణ రంగాల్లో ఇప్పటికే రూపొందించుకున్న విధానాలను కొనసాగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అమల్లో ఉన్న పాలసీలను అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇస్తూనే, కొత్తగా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని 2023 మేనిఫెస్టోను బీఆర్ఎస్ విడుదల చేసింది.

2023
పెట్టింది మేమే.. పెంచేది మేమే

2014 ఎన్నికల మేనిఫెస్టో

- ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు, చెరువుల పునరుద్ధరణ
- మిగులు విద్యుత్, కొత్తగా పది థర్మల్ విద్యుత్ కేంద్రాలు
- రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ, 8గంటల విద్యుత్
- కేజీ నుంచి పీజీ ఉచిత నిర్బంధ విద్య, కొత్తగా గురుకుల పాఠశాలలు
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున వంద పడకల ఆస్పత్రులు
- బలహీనవర్గాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- వృద్ధులు, వితంతువులకు రూ.వేయి, దివ్యాంగులకు రూ.1500 పెన్షన్
- ఐదేళ్లలో రూ.50వేలకోట్లతో ఎస్సీ సంక్షేమం, దళితులకు 3 ఎకరాల భూమి
- ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్లు, గ్రామ పంచాయతీలుగా తండాలు
- బీసీ కార్పొరేషన్‌కు ఏటా రూ.వేయి కోట్లు, రూ.25వేల కోట్లతో బీసీల అభివృద్ధి
- కొత్తగా 24 జిల్లాలు, విశ్వనగరంగా హైదరాబాద్

2018 ఎన్నికల మేనిఫెస్టో

- ఆసరా పెన్షన్లు రూ.వేయి నుంచి రూ.2016కు పెంపు, దివ్యాంగులకు రూ.3016
- వృద్ధాప్య పెన్షన్ వయో పరిమితి 65 ఏళ్ల నుంచి 57కు తగ్గింపు
- నిరుద్యోగ యువతకు రూ.3016 భృతి, రైతులకు రూ.లక్ష రుణ మాఫీ
- రైతుబంధు సాయం ఎకరాకు రూ.8వేల నుంచి రూ.10వేలకు పెంపు
- డబుల్ బెడ్ రూం ఇళ్లతో పాటు సొంత స్థలాలు ఉన్న వారికి రూ.5లక్షల నుంచి రూ.6లక్షలు
- ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక పథకాలు, బీసీ, మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం
- అగ్రవర్ణ పేదల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు. కంటి వెలుగు ద్వారా పరీక్షలు
- ప్రభుత్వ ఉద్యోగాలకు సరైన వేతనం, ఉద్యోగుల పదవీ విరమణ పరిమితి 58 నుంచి 61ఏళ్లకు

2023 ఎన్నికల మేనిఫెస్టో

- అర్హులైన మహిళలకు రూ.3వేల భృతితో 'సౌభాగ్యలక్ష్మి'
- రైతుబీమా తరహాలో పేదలకు రూ.5లక్షల జీవిత బీమా
- ఆసరా పెన్షన్లు రూ.2016 నుంచి దశల వారీగా రూ.5వేలకు పెంపు
- దివ్యాంగుల పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంపు
- ఆరోగ్య శ్రీ గరిష్ఠ పరిమితి రూ .15లక్షలకు పెంపు
- రూ.400కే గ్యాస్ సిలిండర్, అన్నపూర్ణ పేరిట రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం
- పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు. ఉద్యోగులకు పాత పింఛన్ విధానం
- అసైన్డ్ భూములపై హక్కులు. అనాథ పిల్లలకు ప్రత్యేక పాలసీ.

వేగు చుక్కలే.. తోకచుక్కలై

ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన కామ్రేడ్లు... నేడు పూర్తిగా డీలా

సాయుధ పోరాట సమయంలో అధికారానికి దగ్గరగా వచ్చిన పార్టీ

1994లో 34 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీని గడగడలాడించిన వైనం

బొల్లోజు రవి

కమ్యూనిస్టు పార్టీలు ఒకప్పుడు తెలంగాణలో ఒక వెలుగు వెలిగాయి. ఆ పార్టీల నేతృత్వంలోని సాయుధ పోరాటంతో తెలంగాణలో ఊరూరా ఎర్రజెండా రెపరెపలాడింది. కమ్యూనిస్టుల ఉద్యమాలంటే ప్రభుత్వాలు వణికిపోయేవి. వాళ్ల పాటలు ప్రజలను ఉర్రూత లూగించేవి. మార్క్సిస్ట్ సాహిత్యం లక్షలాది మంది యువతను వామపక్ష భావజాలం వైపు తీసుకెళ్లింది. ఇక చట్టసభల్లోనూ కమ్యూనిస్టుల గళం బలంగా వినిపించేది. అలాంటి కమ్యూనిస్టు పార్టీల కోటలు ఇప్పుడు బీటలువారాయి. అసెంబ్లీలో ఆయా పార్టీలకు కనీస ప్రాతినిధ్యం లేకుండా పోయింది. మునుగోడు ఉపఎన్నికలో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోగా, తాజాగా ఒంటరిగా బరిలో దిగేందుకు సీపీఎం సిద్ధం కాగా, సీపీఐ కూడా అదే దారిలో పయనిస్తుందనే చర్చ జరుగుతోంది.

ప్రభుత్వం ఏర్పాటు చేసే సంఖ్య నుంచి జీరో స్థాయికి దిగజారి..

1952 ఎన్నికల నాటికి ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు మద్రాస్ రాష్ట్రంలో భాగంగా ఉండేవి. తెలంగాణ సాయుధ పోరాటం అనంతరం అప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలకు మధ్య హోరాహోరీ పోరు జరిగింది. అప్పట్లో కమ్యూనిస్టు పార్టీకి ఎక్కువ సీట్లే వచ్చినా, కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలతో కలిసి 1953లో ప్రకాశం పంతులు నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాగా, తెలంగాణ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలతో కలిపి హైదరాబాద్ రాష్ట్రంలో ఉండేది. తెలంగాణలో భాగంగా 1952లో కాంగ్రెస్‌కు 38 సీట్లు రాగా, పీడీఎఫ్ పేరుతో పోటీ చేసిన కమ్యూనిస్టులకు 36 సీట్లు వచ్చాయి. ఇక 1957లోనూ గణనీయమైన సంఖ్యలోనే సీట్లు సాధించి ప్రతిపక్ష స్థానం పొందింది. ఆ తర్వాత 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ 177 సీట్లు సాధిస్తే, సీపీఐ (అప్పుడు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ) 51 సీట్లతో ప్రతిపక్ష స్థానం సంపాదించింది. ఇక ఆ తర్వాత సీపీఐలో చీలిక వచ్చి సీపీఐ, సీపీఎంలుగా విడిపోయాయి. 1967లో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టులు మూడు, నాలుగో స్థానానికి చేరుకున్నాయి. అప్పుడు సీపీఐకి 10, సీపీఎంకు 9 స్థానాలు దక్కాయి. 1972 ఎన్నికల్లో సీపీఐకి 7, సీపీఎంకు ఒక స్థానం లభించింది. ఎన్టీఆర్ అసెంబ్లీ రద్దు చేశాక 1985లో జరిగిన ఎన్నికల్లో చెరి 11 స్థానాలు దక్కించుకొని మళ్లీ తమ సత్తా చాటాయి. అందులో తెలంగాణలో సీపీఐకి 8, సీపీఎంకు 7 స్థానాలు రావడం గమనార్హం. 1989లో మళ్లీ సీట్లు తగ్గాయి. అయితే 1994లో కమ్యూనిస్టు పార్టీలు మళ్లీ పూర్వవైభవం దిశగా ముందుకొచ్చాయి. అప్పుడు ఎన్టీఆర్ భారీ మెజారిటీ సీట్లు సాధించారు. కాంగ్రెస్ రెండో స్థానంలో 26 సీట్లు సాధించగా, సీపీఐ, సీపీఎంలు కలిపి కాంగ్రెస్ కంటే ఎక్కువగా 34 సీట్లు సాధించడం విశేషం. విడివిడిగా సీపీఐ 19, సీపీఎం 15 సీట్లు సాధించాయి. అందులో తెలంగాణ ప్రాంతంలో సీపీఐకి 13, సీపీఎంకు 8 సీట్లు రావడం విశేషం. 1999లో జరిగిన ఎన్నికల్లో సీపీఎంకు రెండు స్థానాలే దక్కగా, సీపీఐకి ఒక్కటీ రాలేదు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో సీపీఎం 9, సీపీఐ 6 స్థానాలు సాధించాయి. అందులో తెలంగాణలో సీపీఐకి 6, సీపీఎంకు 4 స్థానాలు వచ్చాయి. ఇక ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు ఇక సీపీఐ, సీపీఎంల పరిస్థితి దిగజారుతూ పోయింది. అంటే 20 ఏళ్లుగా ఆ రెండు పార్టీలు చతికిలపడిపోయాయి. 2018 ఎన్నికల్లో ఒక్క సీటూ రాని దుస్థితిలోకి వెళ్లిపోయాయి.

రాష్ట్రం ఏర్పడ్డాక కూడా పుంజుకోని వైనం..

రాష్ట్రం ఏర్పాటయ్యాక తిరిగి కీలకమైన స్థానంలోకి రావాల్సిన సీపీఐ, సీపీఎంలు ఇప్పుడు దారుణమైన పరిస్థితిలోకి వెళ్లిపోయాయి. ఒక రకంగా తెలంగాణలో కమ్యూనిస్టుల చరిత్ర ప్రకారం చూస్తే ఇక్కడ ప్రత్యామ్నాయంగా ఎదగాల్సి ఉండేదని ఆ పార్టీల సానుభూతిపరులు చెబుతుంటారు.

ఎందుకీ దుస్థితి అంటే..

కమ్యూనిస్టు పార్టీని ఈ స్థితికి తీసుకొచ్చిన కారణాలు అనేకమనే చెప్పాలి. కొత్త తరం కమ్యూనిస్టు భావజాలం వైపు రావడం లేదని, మారుతున్న కాల పరిస్థితులను బట్టి నాయకత్వం నిర్ణయాలు తీసుకోవడంలేదన్న విమర్శలూ ఉన్నాయి. నాడు నాయకుల త్యాగాలు కేడర్‌లో ఉత్సాహం నింపగా, నేటి నాయకుల తీరుపై బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

కమ్యూనిస్టులు చెబుతున్న కారణాలు

- కమ్యూనిస్టు పార్టీలు ఎదగకపోవటానికి ప్రధాన కారణం ఎన్నికల్లో ఇతర పార్టీలు డబ్బు కుమ్మరించడం, కుల, మత ప్రాతిపదికన రాజకీయాలు చేయడం.
- గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతుండటం వల్ల ప్రజాపోరాటాలు లేకుండా పోయాయి. వ్యవసాయ కార్మిక, రైతు పోరాటాలు పెద్దగా నిర్వహించే పరిస్థితి లేకుండా పోయింది. దీని వల్ల ప్రజలు, కమ్యూనిస్టులకు మధ్య కొంత గ్యాప్ పెరిగింది.
- బూర్జువా పార్టీల నాయకులు వ్యాపారాలు చేస్తూ కార్యకర్తలను తమతో తిప్పుకుంటున్నారు. తమ తమ ప్రాంతాల్లో పెళ్లిళ్లయినా, ఏ ఇతర శుభకార్యాలైనా వెళ్లి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల నాయకులు ఎన్ని తప్పు పనులు చేసినా ప్రజలు పట్టించుకోవడం లేదు. ప్రజలను ఇలా పక్కదారి పట్టిస్తున్నారు. కమ్యూనిస్టులు ఇలాంటివి చేయకపోవడం వల్ల ప్రజలు వారిని పట్టించుకోవడం లేదు.
- బూర్జువా పార్టీల నాయకులు డబ్బులు ఖర్చు చేస్తూ ప్రజలను తమ వెంట తిప్పుకుంటున్నారు. కార్యకర్తలకు డబ్బులు ఇస్తూ కాపాడుకుంటున్నారు. ఎన్నికల్లో డబ్బు వెదజల్లుతున్నారు. కానీ కమ్యూనిస్టులు ఇవేవీ చేయకుండా త్యాగాలు చేయాలని కోరడం ఎవరికీ నచ్చడం లేదు.
- సిద్ధాంతపరమైన రాజకీయాలు ఇప్పుడు లేకుండాపోయాయి. ధనమే అన్నింటికీ మూలంగా మారింది.

రాజకీయ విశ్లేషకుల మాట...

- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజాన్ని అన్వయించడంలో కమ్యూనిస్టులు విఫలం అవుతున్నారు.
- తమ బలాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించడం లేదు. ప్రజలకు దగ్గర కావడానికి అవసరమైన చర్యలు చేపట్టడం లేదు.
- కొందరు నాయకుల తీరు, వారి వ్యవహార శైలి ప్రజలను ఆకట్టుకోవడం లేదు. కమ్యూనిస్టు ఆదర్శాలను పక్కన పెట్టారన్న విమర్శలు ఉన్నాయి. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి నేతలు తమ సాధారణ జీవన శైలితో కార్యకర్తలు గుండెల్లో నిలిచిపోయారు. ఇప్పుడు అలాంటి నేతలు లేరన్న విమర్శలు ఉన్నాయి.



బీసీ వర్గాల దన్నుతోపాటు ఇతరవర్గాల ఓట్లనూ కూడగట్టాలని బీజేపీ నిర్ణయం

బీసీన్ మారుస్తుందా?

కె. రాహుల్

తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీ వర్గాలకు చెందిన నేతను ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం ద్వారా బీసీ ఎజెండాతో బీజేపీ ఎన్నికల గోదాలోకి దిగుతున్న విషయం స్పష్టమైంది. గత కొంతకాలంగా ఆ పార్టీలో బీసీలకు ప్రాధాన్యం పెంచుతున్న నేపథ్యంలో బీసీ సీఎంపై కూడా పార్టీ అధినాయకత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. అటు అధికార బీఆర్ఎస్, ఇటు ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తాము గెలిస్తే బీసీ అభ్యర్థిని సీఎం చేస్తామని ప్రకటించే అవకాశాలు లేకపోవడంతో బీజేపీకి ఇప్పుడు ఇదే ప్రధాన ఎజెండాగా మారింది.

కచ్చితమైన వ్యూహంతో ముందుకు..

కచ్చితమైన వ్యూహంతో ప్రజల్లోకి వెళ్లాలనే నిర్ణయంలో భాగంగానే అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం అంత బలంగా ఎత్తుకోని బీసీ నినాదాన్ని బీజేపీ తలకెత్తుకోవాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.. తాజాగా ఈ నిర్ణయాన్ని సూర్యాపేట సభలో అమిత్‌షా ప్రకటించడానికి ముందే సంస్థాగతంగా పార్టీలో వివిధ స్థాయిల్లో చర్చించి, ముఖ్యనేతలు, రాష్ట్రకార్యవర్గం, కౌన్సిల్ సభ్యుల స్థాయిలో అభిప్రాయసేకరణ చేపట్టారు. ఈ భేటీల్లోనూ రెడ్డి, ఇతర సామాజికవర్గనేతల నుంచి కూడా సానుకూల స్పందన రావడంతో బీసీ ఎజెండాతోనే ముందుకెళితేనే మంచి ఫలితాలు సాధించవచ్చుననే నిశ్చితాభిప్రాయానికి జాతీయ నాయకత్వం వచ్చినట్టు తెలిసింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల గెలుపోటముల్లో బీసీల ఓట్లు కీలకం. రాష్ట్ర జనాభాలో 54 శాతం వరకు బీసీ వర్గాల వారు ఉన్నారనే అంచనాల నేపథ్యంలో అధికశాతం బీసీల ఓట్లు బీజేపీ ఖాతాలో పడేందుకు బీసీ సీఎం నినాదం పనిచేస్తుందని పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. అయితే ఇదే సమయంలో బీసీ ఎజెండాతో ఇతర సామాజికవర్గాల నుంచి వ్యతిరేకత రాకుండా తగిన జాగ్రత్తలూ తీసుకోవాలని నిర్ణయించింది.

విస్మృత ప్రచారంతో... వారిని చేరుకోవడమే కీలకం

2014 అసెంబీ ఎన్నికల్లో టీడీపీ బీసీ సీఎం నినాదాన్ని ఎత్తుకున్నా అది అస్సలు వర్కవుట్ కాలేదు. సీనియర్‌నేత టి దేవేందర్‌గౌడ్ కూడా బీసీల కోసం పార్టీ పెట్టినా ఈ వర్గాల నుంచి పెద్దగా మద్దతు కూడగట్టలేకపోయారు. ఈ నేపథ్యంలో బీసీ సీఎం ఎజెండాతో ఎన్నికల బరిలోకి దిగుతున్న బీజేపీ ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే బీసీ, ఎంబీసీ కులాల పెద్దలు, నేతలను కలిసి వారి మద్దతు కూడగట్టాలని బీజేపీ నేతలు యోచిస్తున్నారు. బీసీ సీఎం అభ్యర్థిని ఎవరన్నది కూడా త్వరలో ప్రకటించే యోచనలో బీజేపీ ఉంది.

40కి పైగా సీట్లు ఇచ్చేలా..

119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 40కి పైగానే బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చేలా నాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. మొత్తం సీట్లలో మూడోవంతుకు పైగానే సీట్లు ఇచ్చామనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. తొలిజాబితాను 52 మంది అభ్యర్థులతో విడుదల చేయగా, అందులో బీసీవర్గాలకు చెందిన వారికి 19 మందికి అవకాశం కల్పించారు. రెండో జాబితాలో ఒకరికి, తాజాగా 35 మందితో మూడో జాబితాను ప్రకటించగా అందులో 13 మంది బీసీలకు టికెట్లు కేటాయించారు. మొత్తంగా చూస్తే.. ప్రకటించిన 88 సీట్లలో 32 మంది బీసీ వర్గాలకు వచ్చారు. ఇంకా 31 సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా, జనసేనకు 11 సీట్లు కేటాయిస్తే.. మిగిలిన 20 సీట్లలో పదిదాకా బీసీలకు కేటాయించే అవకాశాలున్నాయంటున్నారు. ఆయా కులాల వారీగా చూస్తే ముదిరాజ్-గంగపుత్రులు కలిపి (45 లక్షలు) యాదవ (35 లక్షలు), గౌడ (28 లక్షలు), మున్నూరుకాపు (22 లక్షలు), పద్మశాలి (18 లక్షలు),రజక (12 లక్షలు),వడ్డెర (10 లక్షలు), ఇతర ఎంబీసీ కులాలకు చెందిన వారు 40 లక్షలదాకా ఉండొచ్చని బీజేపీ అంచనా వేస్తోంది. ఇందుకు తగ్గట్టుగానే ఆయా కులాల వారీగా టికెట్లు కేటాయిపునకు కసరత్తు సాగుతున్నట్టు తెలుస్తోంది.

ప్రధాని మోదీ పథకాలతో..

జాతీయస్థాయిలో బీజేపీ తీసుకున్న 'సబ్‌కా సాథ్, సబ్ కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' నినాదంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో బీసీలు, ఎంబీసీల అభ్యున్నతి కోసం చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తే మంచి ఫలితాలను సాధించొచ్చునని భావిస్తున్నారు. మోదీ హయాంలో ఆయా బీసీవర్గాలకు అందిన ప్రయోజనాలను వివరించనున్నారు. ఎంబీసీ వర్గానికి చెందిన మోదీని బీజేపీ తొలిసారిగా ప్రధానిగా నియమించడం, కేంద్ర కేబినెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా 27 మంది వెనుకబడిన తరగతుల వారి నియామకం, అదే విధంగా ఎస్సీ, ఎస్టీవర్గాల వారికి కూడా అత్యధిక ప్రాతినిధ్యం కల్పించడం... ఈ పరిణామాలను జనంలోకి బలంగా తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. ఇక సీఎం అభ్యర్థులను ప్రకటించే సంప్రదాయం, ఆనవాయితీ బీజేపీలో లేకపోయినా తెలంగాణలో ఈ సారి ముందుగానే బీసీ అభ్యర్థిని ప్రకటించే అవకాశాలున్నాయని పార్టీవర్గాల విశ్వసనీయ సమాచారం.

ఏజెన్సీలో ఎలా?

- ఎన్నికలు బహిష్కరించాలంటూ మావోయిస్టుల బ్యానర్లు
- సమస్యాత్మక ప్రాంతాలుగా 13 నియోజకవర్గాలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్


చర్ల మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్రత్యేక బలగాల కూంబింగ్ (ఫైల్)

సాక్షి, ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులు ఎన్నికలు బహిష్కరించాలని, ప్రచారానికి వచ్చే నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో వరుసగా కరపత్రాలు, లేఖలు విడుదల చేస్తున్నారు. దీంతో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండే ఏజెన్సీ ప్రాంత నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ యంత్రాంగానికి కత్తిమీద సాములా మారే అవకాశం కనిపిస్తోంది.

గోదావరి తీరంలో..

ఒకప్పుడు ఉత్తర తెలంగాణతో పాటు నల్లమల అటవీ ప్రాంతాలు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉండేవి. ప్రభుత్వ ఆదేశాల కంటే మావోయిస్టుల హెచ్చరికలే పల్లెల్లో ప్రభావం చూపించేవి. రానురాను మావోయిస్టుల ప్రభావం తెలంగాణలో తగ్గిపోయింది. పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం మావోయిస్టులు బలంగా తమ ఉనికి చాటుతున్నారు. ఆ ప్రభావం సరిహద్దు పంచుకుంటున్న మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపై కూడా కనిపిస్తోంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దు ఉన్న గోదావరి ఏజెన్సీలో స్థానిక సంస్థలు మొదలు చట్టసభల వరకు ప్రతీ ఎన్నికల వేళ యుద్ధ వాతావరణం తలపిస్తోంది.

గంట ముందుగానే


సాధారణ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. కానీ మావోయిస్టుల ప్రభావం ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటల వరకే ప్రక్రియ పూర్తి చేస్తారు. ఆ తర్వాత భారీ బందోబస్తు మధ్య ఈవీఎంలను అక్కడి నుంచి తరలిస్తారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వచ్చే దారులు, మార్గమధ్యలో ఉన్న కల్వర్టులను పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తారు. అయినా ఉనికి చాటుకునేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈసారి ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో సాయంత్రం నాలుగు గంటల వరకే పోలింగ్ కొనసాగుతుందని రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రకటించారు.

అప్రమత్తమైన పోలీసులు

ఎన్నికల నేపథ్యంలో ఇటు పోలీసులు, అటు కేంద్ర బలగాలు సరిహద్దులో అడవులను విస్తృతంగా జల్లెడ పడుతున్నాయి. భద్రాద్రి జిల్లా ఎస్పీ వినీత్ ఏజెన్సీ ఏరియాల్లో పర్యటిస్తూ పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. అడవుల్లో విస్తృతంగా కూంబింగ్ నిర్వహించడంతో పాటు అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు భరోసా కల్పించేలా పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు.

కరపత్రాల కలకలం

ఈసారి ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత పక్షం రోజులకు మావోయిస్టుల నుంచి లేఖలు వచ్చాయి. ఓట్ల కోసం వస్తున్న రాజకీయ పార్టీలు, నాయకులను నిలదీయండి. మీ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఎన్నికలను బహిష్కరించండి.. అంటూ మావోయిస్టు తెలంగాణ కమిటీ పేరుతో చర్లలో కరపత్రాలు వెలువడ్డాయి. అంతకు ముందు అల్లూరి సీతారామరాజు – భద్రాద్రి కొత్తగూడెం, ఇల్లెందు – నర్సంపేట డివిజన్ కమిటీల పేరుతోనూ లేఖలు వచ్చాయి.



ఎన్నికల వంటకాలూ.. వింతైన ఇన్సిడెంట్లు!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

మా రాంబాబు గాడు ఆహారప్రియుడు. నిజానికి వాడో పెద్ద తిండి బోతుగానీ.. స్టైల్‌గా ఫుడ్‌లవర్ అని పిలవమని మమ్మల్ని పోరుతుంటడు. వాడెక్కడ బాధపడతాడోనని, పోనీ లెమ్మని మేమూ వాడిని అట్లనే పిలుస్తం.

నిజానికి వాడికి ఫుడ్ అంటే ఎంత ఇష్టమో, రాజకీయాలన్నా అంతే ఇష్టం. పొద్దుపొద్దున్నే వాడు కొన్ని ఇన్సిడెంట్లు చెప్పిండు. అవేమిటంటే...

....

''అరేయ్..మొన్నదసరానాడు కూడా కేసీఆర్ గారెలు తినలేదంట రా''

''ఎందుకట?''

''అయ్యాల గారెలు తినడం ఆనవాయితీ కదా. తీరా తినబోతుంటే..పెసర ముద్దను ఫ్లాట్‌గ చెయ్యడానికి ఒత్తిన 'చెయ్యి' గుర్తు కనిపించిందట గారె మీద. దాంతో కోపమొచ్చి తినలేదటంరా''

''మరిప్పుడు ఏంజేద్దమంటవ్?'' (అచ్చం కేసీఆర్ స్టైల్లోనే) అడిగాడా ఫ్రెండు.

''మొన్న రాహుల్ ప్రచారంలో తిరుగుతున్నప్పుడు ఎవరో మక్కబుట్ట కొనిచ్చిర్రట. కానీ ఆయన ముట్టనే ముట్టలేదట. ఎందుకు అని అడిగితే 'గతికితే అతకదు' అన్నడట''

''అదేంది?''

''కమ్యూనిస్టులతోని ఇంకా పొత్తు కుదర్లేదుగా. 'కంకి' కొడవలి సీపీఐనాయె, కంకిని కోసేది సీపీఎమ్ము వాళ్ల కొడవలితోనేనాయె. గతికితే పొత్తు యాడ చెడిపోద్దో, ప్రతిపక్షాల ఓట్లు యాడ చీలతయోనని ముందుజాగ్రత్తగా మక్క కంకిని ముట్టలేదట''

''బాగుందిరా''

''ఏనాడన్న మజ్లీస్‌వోళ్లు బిర్యానీ వద్దనంగ చూసినమా, ఇన్నమా?''

''ఏమాయె ఇప్పుడు?''

''మొన్న ఓనాడు మజ్లీసు నేతల బిర్యానీ తింటుండంగ, అందుల అదేదో 'స్టార్ అనీస్'నో లేదా 'స్టార్ లవంగ అనీసు' అనే ఓ స్పైసీ మొగ్గలు కనిపిచ్చినయట. అయ్యేమో అచ్చం పువ్వు గుర్తు లెక్కనే కనిపిస్తయాయె. ఇగవాళ్లు ఆ గుర్తుకు ఎంత దూరమో వేరే చెప్పాల్నా? అందుకే ఇగ ఈ ఎలక్షన్ అయ్యేదాంక, ఈ నాలుగొద్దులు బిర్యానీల ఆ 'అనీసు స్టారు' మొగ్గల్ని ఎయ్యకుండనే బిరియానీ వండమన్నరట''

''వామ్మో!! అట్లనా?''

ఇక్కడిదాంక ఇనిపిచ్చంగానే ''ఇదేందిరా పుడ్డుతోని ఈ యవ్వారాలూ?'' అడిగిన. ''అసలే ఫుడ్డూ, పొలిటిక్సూ..ఈ రెండూ నా ఫెవరేట్లు రా. ఇప్పటికే ఎవ్వడు పడితే వాడు పుడ్డు మీద రకరకాల ఆంక్షలు పెడుతున్నరు. ఇంక ఇట్లాంటి నిషేధాలూ, నో..నో..లూ పుడ్డు మీద అసలు వద్దురా అని అరుసుకుంట నిద్ర లేశిన. తీరా జూస్తె ఇది కల. మొన్ననే రాహుల్‌గాంధీ షాద్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి సభలల్ల మాట్లాడుతున్నప్పుడు యాడ్నో అన్నడుగా 'మోదీ, కేసీఆర్‌లకు నేను కలలకు వస్తున్న' అని. ఆ న్యూస్ సదివి నిద్రపొయ్యినందుకో, ఏమోగని... రాత్రి నాకు ఇట్ల కలొచ్చింది. అందుట్ల నేతి ఐటమ్సూ, నేతల ఐటమ్సూ అన్నీ కలిసి, అంతా కలగా'పులగం' సారీ 'కల'లో..'కిచిడీ' అయ్యింది'' అన్నడు మా రాంబాబుగాడు.

ముగ్గురు.. మూడు వేర్వేరు పార్టీలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాజకీయ నేపథ్యమున్న ఓ రాజకీయ కుటుంబంలోని ముగ్గురు మూడు వేర్వేరు పార్టీల్లో ఉన్నారు. ఆ కుటుంబ పెద్దాయన స్వాతంత్ర్య సమరయోధుడు చిట్టెం నర్సిరెడ్డి. 2005 ఆగస్టు 15న మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఆ పెద్దాయన మరణించారు. అది గతం. ఇప్పుడు ఆయన వారసులు ముగ్గురు మూడు పార్టీల్లో ఉన్నారు. ఆయన కుమార్తె, మాజీ మంత్రి డీకే అరుణ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. ఆమెకు గద్వాల నుంచి బీజేపీ టికెట్ ఇవ్వాలని నిర్ణయించినా, ఆమె పోటీ నుంచి తప్పుకున్నట్టు ప్రకటించింది. నర్సిరెడ్డి కుమారుడు రామ్మోహన్‌రెడ్డి సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మక్తల్ నియోజకవర్గం నుంచి మరోసారి బరిలో ఉన్నారు. నర్సిరెడ్డి పెద్దకుమారుడి కుమార్తె (మనవరాలు) చిట్టెం పర్ణికారెడ్డి కాంగ్రెస్ టికెట్‌పై నారాయణపేట నుంచి బరిలో నిలుస్తున్నారు. ఒకవేళ అరుణ బీజేపీ నుంచి బరిలో నిలిచిఉంటే... ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేసే పరిస్థితి ఏర్పడి ఉండేది.



గాంధీభవన్‌లో కారు

'నిరుద్యోగ భృతి ఇస్తానంటివి..ఇప్పటికే రూ.6,000 కోట్లు బాకీ పడ్తివి'...'కాళేశ్వరంతో నీళ్లిస్తానంటివి..రూ.లక్షకోట్లు దోపిడీతో చరిత్ర సృష్టిస్తివి'...పదేండ్ల అహంకారంపై తిరగబడదాం..పదేండ్ల ప్రభుత్వాన్ని తరిమికొడదాం' అనే స్లోగన్‌లతో బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్‌లో కార్లు ముస్తాబు చేస్తోంది.

క్షణాల్లో సోషల్ మీడియాలోకి...



ఎన్నికల బరిలో నిలిచిన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలంటే ఒకప్పుడు నాన తంటాలు పడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ప్రచార కార్యక్రమాలను వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు పోస్టులు పెడుతూ ప్రజలకు చేరువవుతున్నారు. – సాక్షి,ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

జంగ్ తెలంగాణ
పంచతంత్రం

ర్యాలీలు, మీటింగులుండవ్!

బ్యానర్లు, నినాదాలు అస్సలుండవు • మిజోరంలో ప్రచారం రూటే వేరు

ఎన్నికలంటేనే బోలెడంత హడావుడి, ప్రచారం, సభలు, సందడి. మరీ ముఖ్యంగా మన దేశంలోనైతే ఆ ఊపే వేరు. కానీ మిజోరంలో మాత్రం ఈ పరిస్థితి ఎక్కడా కనిపించదు. పార్టీల ర్యాలీలు, భారీ బహిరంగ సభలు, రోడ్లను బ్లాక్ చేసేయడం వంటివి కాగడా వేసి వెదికినా ఎక్కడా కనిపించవు. అసలు రోడ్లపై గానీ, మరెక్కడైనా నినాదాలు విన్పించడం, బ్యానర్లు కన్పించడం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు!

ప్రచారమంతా చర్చి ఆధ్వర్యంలోనే...

మిజోరంలో అత్యంత బలమైనది చర్చి వ్యవస్థ. రాష్ట్రంలో పార్టీల ఎన్నికల ప్రచార ప్రక్రియ ఆసాంతం చర్చి ఆధ్వర్యంలో నడిచే మిజో పీపుల్స్ ఫోరం (ఎంపీఎఫ్) చర్చి కనుసన్నల్లోనే జరుగుతుంది. గత మూడు ఎన్నికల నుంచీ ఇది మరింతగా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.



ఏం చేస్తుంది?

- ఎంపీఎఫ్ అసెంబ్లీ స్థానాలవారీగా కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తుంది.
- ఆ నియోజకవర్గంలోని అందరు అభ్యర్థులూ అక్కడికే వస్తారు.
- తమ విధానాలు, పథకాలు తదితరాలను ఒక్కొక్కరుగా ప్రజల ముందు పెడతారు.
- ఇందుకు ఒక్కొక్కరికి 20 నిమిషాలు టైం కేటాయిస్తారు.
- ఏ గొడవలకు, ఉద్రిక్తతలకు తావులేకుండా కార్యక్రమం సాగుతుంది.

దేశమంతటా ఎన్నికల ప్రచారం ఇలాగే సాగాలంటూ చట్టం తెస్తే బాగుంటుందేమో కదా!



అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, మిజోరంలకు రెండు ప్రత్యేక రికార్డులున్నాయి. రెండు మహిళలకు సంబంధించినవే కావడం విశేషం. అసెంబ్లీలో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిస్తే, అత్యల్ప ప్రాతినిధ్యమున్న రాష్ట్రంగా మిజోరం చెత్త రికార్డును మూటగట్టుకుంది. దాని చరిత్రలో ఇప్పటిదాకా ఎమ్మెల్యేలైన మహిళల సంఖ్య కేవలం నాలుగే! ప్రస్తుత మిజోరం అసెంబ్లీలోనైతే ఒక్కరంటే ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేరు! అంతేకాదు, 2014 ఉప ఎన్నికలో నెగ్గిన వన్లాల్‌వాంపుయ్ చోంగ్తూను మినహాయిస్తే గత 27 ఏళ్లలో రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నికవలేదు! ఇక లోక్‌సభకైతే మిజోరం చరిత్రలోనే ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా ఎన్నికవలేదు! ఇక ఇప్పటిదాకా ఇద్దరంటే ఇద్దరు మహిళలు మాత్రమే మంత్రులయ్యారు!

- మిజోరం అసెంబ్లీలో కానరాని స్త్రీలు
- దేశంలోకెల్లా అత్యల్ప ప్రాతినిధ్యం
- ఇప్పటిదాకా నలుగురే మహిళా ఎమ్మెల్యేలు
- లోక్‌సభకైతే మహిళల ప్రాతినిధ్యం సున్నా

మహిళలకు మొండిచెయ్యే

ఆది నుంచీ...

కేంద్రపాలిత ప్రాంతం హోదాలో మిజోరంలో 1972లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేవలం నలుగురు మహిళలు మాత్రమే పోటీ చేశారు. వారిలో ఒక్కరూ నెగ్గకపోగా డిపాజిట్లు కూడా కోల్పోయారు. 1978లో ఎల్.థన్‌మావీ రూపంలో మిజోరంలో తొలిసారి ఒక మహిళ ఎమ్మెల్యేగా నెగ్గింది. ఆమెకు పడ్డ మొత్తం ఓట్లెన్నో తెలుసా? కేవలం 1,824. కేవలం 119 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారామె! అన్నట్టు, ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక మహిళ కూడా ఆమే. అనంతరం ఏడాది లోపే మళ్లీ జరిగిన ఎన్నికల్లోనూ నలుగురు పురుష అభ్యర్థులతో తలపడి కేవలం 42 ఓట్ల మెజారిటీతో మళ్లీ గెలిచారామె. ఆ ఎన్నికల్లో బరిలో దిగిన మరో ఇద్దరు మహిళలు డిపాజిట్ కోల్పోయారు. 1987లో మిజోరం రాష్ట్రంగా మారాక జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు మహిళలు పోటీ పడ్డారు. ఎంఎన్ఎఫ్ తరఫున లాల్‌హ్లాంపుయ్ మర్ ఐజ్వాల్ నార్త్–1 నుంచి కేవలం 306 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అనంతరం లాల్‌డెంగా మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. మంత్రి అయిన తొలి మిజో మహిళగా రికార్డు సృష్టించారు. అనంతరం 1989, 1993 అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురేసి మహిళలు పోటీ చేసినా ఓటమి చవిచూశారు. 1998లో 10 మంది, 2003లో ఏడుగురు, 2008లో 9 మంది, 2013లో ఆరుగురు మహిళలు పోటీ చేసినా ఒక్కరూ నెగ్గలేదు. అలా 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2014లో ఉప ఎన్నికలో నెగ్గిన చోంగ్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. అయితే ఆమెకు దక్కింది... మత్స్య, సహకార శాఖలు! కానీ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికల్లో అత్యధికంగా 18 మంది మహిళలు పోటీ చేసినా ఒక్కరూ గెలుపు ముఖం చూడలేకపోయారు. పైగా ఏకంగా 16 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.

ఈసారి...

- ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్, జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) ఇద్దరేసి మహిళలకు టికెట్లివ్వగా
- బీజేపీ ముగ్గురికిచ్చింది. మొత్తమ్మీద ఈసారి 16 మంది మహిళలు ఎన్నికల బరిలో దిగారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎందుకిలా...?

మిజోరంలో చట్టసభల్లో మహిళలకు అత్యల్ప ప్రాతినిధ్యానికి అక్కడి పితృస్వామ్య వ్యవస్థే ప్రధాన కారణమని చెబుతారు. పరిశీలిస్తే అది నిజమేననిపిస్తుంది కూడా. క్రైస్తవ జనాభా ఎక్కువగా ఉన్నా మిజోరం ప్రధానంగా గిరిజన రాష్ట్రం. సహజంగానే అక్కడ మహిళలకు ఇల్లు దాటికి బయటికి వెళ్లడాన్ని అంతగా ఇష్టపడరు.




ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంప్రదాయక దోలు వాయిస్తున్న జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ. గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురీ నియోజకవర్గంలోని ఖుత్గావ్ పట్టణంలో తీసిందీ ఫొటో

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ

కాంగ్రెస్ ఉన్నచోట అభివృద్ధి ఉండదు

కాంకేర్: వారసత్వ రాజకీయాలు, అవినీతి, బంధుప్రీతికి మారుపేరైన కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే అభివృద్ధి ఏమాత్రం జరగదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. అవినీతికి పాల్పడుతోందంటూ సీఎం భూపేశ్ బఘేల్ ప్రభుత్వాన్ని ఎండగట్టిన ప్రధాని మోదీ..రాష్ట్రాన్ని దోచుకున్న వారిని ఏమాత్రం ఉపేక్షించరాదన్నారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తమ ప్రభుత్వం రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళను ఎంపిక చేయగా దానిని కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని ద్రౌపదీ ముర్ము ఎన్నికనుద్దేశించి ప్రధాని చెప్పారు. ఇలాంటి వైఖరి కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి గిరిజనుడూ ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను మీరు శిక్షిస్తారా అని ప్రధాని ప్రశ్నించగా అవును అంటూ జనం బదులిచ్చారు. ఇతర వెనుకబడిన కులాని(ఓబీసీ)కి చెందినందునే 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తనను దూషించిందని తెలిపారు. కేంద్రంలో అధికారం కోల్పోయాక పార్టీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో అవినీతితో ఖజానా నింపుకుంటోందని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేసిందని, ఎన్నికల హామీలను నెరవేర్చ లేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సీఎం బఘేల్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని కాంగ్రెస్ కమిటీ కార్యాలయంగా మార్చేసి, ప్రభుత్వంలో పెద్దల పిల్లలు, బంధువులకు ఉద్యోగాలిచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే బస్తర్ ప్రాంతంలోని పేదలు, దళితులు, వెనుకబడిన కులాలు, గిరిజన కుటుంబాలకు హత్యలు, నేరాలు, హింస తప్ప ఏం లాభం కలిగింది? అని ప్రశ్నించారు. 'అందుకే, రాష్ట్రాన్ని దోచుకున్నవారు ఎంత శక్తిమంతులైనప్పటికీ వదలరాదు. దోచుకున్నదంతా వారి నుంచి కక్కిస్తాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నచోట అభివృద్ధి ఉండదు' అని మోదీ అన్నారు. మీ పిల్లల భవిష్యత్తును మోదీ, బీజేపీ చేసుకుంటాయని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో తాము అధికారంలోకి వస్తే అభివృద్ధిని వేగవంతం చేసి, సుసంపన్నమైన ఛత్తీస్‌గఢ్‌కు పునాది వేస్తాం. రాష్ట్రాన్ని వచ్చే అయిదేళ్లలో దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తాం' అని ప్రధాని ప్రకటించారు.

మెజారిటీ రాకున్నా సరే, బీజేపీని మాత్రం కలుపుకోం: జెడ్‌పీఎం

ఐజ్వాల్: ఈ నెల 7న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడంలో తమ పార్టీ విఫలమైనప్పటికీ, బీజేపీ మద్దతు మాత్రం తీసుకోబోమని జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) కుండబద్దలు కొట్టింది. జెడ్‌పీఎం వర్కింగ్ చైర్మన్ కె.సప్తంగ మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రజలు కొత్త ప్రభుత్వం, కొత్త పాలనా విధానం రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారు సంకీర్ణప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. ఎన్నికల తర్వాత మా పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకున్నా, బీజేపీ మద్దతు తీసుకోవడం, ఆ పార్టీతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదు' అని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత జట్టుకట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల తర్వాత జెడ్‌పీఎం, అధికార ఎంఎన్ఎఫ్‌లలో ఎక్కువ సీట్లు సాధించిన పార్టీతో చేతులు కలుపుతామంటూ బీజేపీ చేసిన ప్రకటనపై పైవిధంగా సప్తంగ స్పందించారు. ఈ నెల 7న జరగనున్న ఎన్నికల్లో తమదే గెలుపని, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 3 । నవంబర్ । 2023



సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌తో గురువారం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం భేటీ అయ్యారు. కోదండరాం మాట్లాడుతూ.. మధుయాష్కీకి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.






మల్కాజిగిరిలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడికి టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీపై విమర్శలు చేసి, తన స్వార్థం కోసం కాంగ్రెస్ గూటికి చేరినట్టు విమర్శించారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గులాబీ వనంలో ఆత్మీయ సమ్మేళనం

మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ బీఆర్ఎస్ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు. నగరం మునుపెన్నడూ లేనంతగా ప్రగతిపథంలో దూసుకెళుతోందన్నారు. ఉప్పల్‌లో తమ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమైపోయిందని ఆయన పేర్కొన్నారు.

బరిలోకి మూడో బ్యాచ్

9 మందితో బీజేపీ జాబితా



పూస రాజు (ముషీరాబాద్)

సామ రంగారెడ్డి (ఎల్బీనగర్)

తోకల శ్రీనివాస్‌రెడ్డి (రాజేంద్రనగర్)

లంకల దీపక్‌రెడ్డి (జూబ్లీహిల్స్)

సంరెడ్డి సురేందర్‌రెడ్డి (మలక్‌పేట)

కృష్ణయాదవ్, (అంబర్‌పేట)

మర్రి శశిధర్‌రెడ్డి (సనత్‌నగర్)

ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ (ఉప్పల్)

మేకల సారంగపాణి (సికింద్రాబాద్)

- ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం
- ఇద్దరు మాజీ మంత్రులకు అవకాశం
- బండ కార్తీక, విజయలక్ష్మి, విక్రమ్‌గౌడ్, గౌతంరావులకు నిరాశ



దప్పు కొడుతున్న సామ రంగారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు బీజేపీ మూడో విడత అభ్యర్థుల జాబితాను గురువారం ప్రకటించింది. గ్రేటర్ పరిధిలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. జనసేనతో పొత్తు వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, మేడ్చల్ స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. నాంపల్లి, కంటోన్మెంట్ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక తేలకపోవడంతో పక్కనపెట్టింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో బీసీలకు ప్రాధాన్యమిచ్చిన ఆ పార్టీ.. మహిళలకు మాత్రం రిక్తహస్తం చూపింది. గురువారం విడుదల చేసిన జాబితాలో మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, కృష్ణయాదవ్‌కు చోటు కల్పించిన అధిష్టానం.. పార్టీలో కొత్తగా చేరిన నేతలకు పెద్దపీట వేసింది. కేవలం ఉప్పల్ నియోజకవర్గం మినహా మిగతా సెగ్మెంట్లకు ఇతర పార్టీల నుంచి పార్టీలో చేరిన నాయకులకు అవకాశం కల్పించింది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన అంబర్‌పేట స్థానానికి కృష్ణయాదవ్ పేరును ఖరారు చేసింది. సనత్‌నగర్ సెగ్మెంట్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డిని బరిలో దించింది.

జనసేనతో కిరికిరి!

- జనసేనతో పొత్తు తేలకపోవడంతో నగరంలో పలు సీట్ల సర్దుబాటు వ్యవహారం కొలిక్కిరాలేదు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, మల్కాజిగిరి స్థానాలు కావాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తుండటం.. ఆ స్థానాల్లో బీజేపీ కూడా బలంగా ఉన్న నేపథ్యంలో సీట్ల ఖరారుపై ప్రతిష్టంభన నెలకొంది. సంప్రదాయబద్ధంగా బలమైన ఓటు బ్యాంకు కలిగిన కూకట్‌పల్లి స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే సహించేది లేదంటూ ఇప్పటికే అక్కడి నేతలు పార్టీకి రాజీనామాలు చేసి అల్టిమేటం ఇచ్చారు.
- శేరిలింగంపల్లి స్థానాన్ని జనసేనకు కేటాయిస్తే.. పార్టీ నుంచి వైదొలుగుతానని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తేల్చిచెప్పడంతో ఈ సీట్లను పెండింగ్‌లో పెట్టింది. మల్కాజిగిరి, మేడ్చల్ స్థానాలకు అభ్యర్థులపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పక్కనపెట్టిన కమలదళం.. కంటోన్మెంట్‌కు మాజీ పోలీస్ అధికారి కృష్ణప్రసాద్ పేరును పరిశీలిస్తోంది. విక్రమ్ గౌడ్‌ను నాంపల్లి నుంచి పోటీలో నిలపాలని భావిస్తుండగా.. ఆయన మాత్రం ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. సీట్ల ప్రకటన సీనియర్లను నారాజ్ చేసింది. పాత వారిని పరిగణనలోకి తీసుకోకుండా కొత్త నాయకులకు ప్రాధాన్యమివ్వడంపై మండిపడుతున్నారు.

ఆశావహులకు చుక్కెదురు..

- టికెట్ల ఖరారు వ్యవహారం బీజేపీలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. రాజకీయ ప్రవేశం చేయాలని భావించిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మికి నిరాశే మిగిలింది. అంబర్‌పేట స్థానాన్ని ఆశించిన హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, సికింద్రాబాద్ బరిలో దిగాలని భావించిన మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డికి ఆశాభంగం కలిగింది. గోషామహల్ స్థానాన్ని ఆశించిన విక్రమ్‌గౌడ్‌కు అక్కడ చుక్కెదురు కావడంతో అంబర్‌పేట లేదా జూబ్లీహిల్స్ నుంచి సర్దుబాటు చేస్తారని భావించినా అక్కడా కూడా అవకాశం లభించలేదు.
- ఉప్పల్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు మరోసారి టికెట్ లభించగా.. ఎల్బీనగర్ స్థానానికి సామ రంగారెడ్డి పేరును ఖరారు చేశారు. ఈ స్థానంపై కన్నేసిన కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డికి నిరాశే మిగలగా.. రాజేంద్రనగర్ నుంచి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డికి చాన్స్ లభించింది. జూబ్లీహిల్స్ లంకెల దీపక్‌రెడ్డి, సికింద్రాబాద్ మేకల సారంగపాణి, ముషీరాబాద్ పూస రాజు, మలక్‌పేట సంరెడ్డి సురేందర్‌రెడ్డిలను ఎన్నికల గోదాలోకి దించింది.

దోస్త్ X దోస్త్





ఇద్దరు పాత మిత్రులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీపడుతున్నారు. టీడీపీలో ఇరువురు సుదీర్ఘకాలం పని చేశారు. గ్రేటర్‌లో పలు పదవులు చేపట్టారు. టీడీపీలో పనిచేసిన వీరిరువురు ఇప్పుడు ఒకరు బీఆర్ఎస్, మరొకరు బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. వారే ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, లంకల దీపక్ రెడ్డి. టీడీపీలో మూడు దశాబ్దాలకు పైగా గ్రేటర్‌లో పనిచేసిన మాగంటి గోపీనాథ్ 2014లో టీడీపీ తరఫున గెలిచి తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2018లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. రెండు దశాబ్దాలుగా టీడీపీలో గ్రేటర్‌తో పాటు రాష్ట్ర పదవులు చేపట్టిన లంకల దీపక్‌రెడ్డి తర్వాత పరిణామాలతో బీజేపీలో చేరారు. రాజకీయ అనుభవం కలిగిన లంకలకు బీజేపీ పార్టీ టికెట్‌ను ఖరారు చేసింది. ఇద్దరూ టీడీపీలో కలిసి గ్రేటర్‌లో పనిచేశారు. ఇద్దరు పాత మిత్రులు ప్రస్తుతం పోటీలో ఉన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న లంకల తన అనుభవాన్ని జోడించి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తారా.. లేదంటే మాగంటి హ్యాట్రిక్ కొడతారా? అనేది ఓటర్లే నిర్ణయిస్తారు.

– శ్రీనగర్‌కాలనీ

సీఎంను అందించిన సనత్‌నగర్ గడ్డ



సనత్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిని అందించిన కీర్తిని భాగ్యనగరం మూటగట్టుకుంది. రాజకీయ ఉద్దండుడు మర్రి చెన్నారెడ్డి 1989లో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. సనత్‌నగర్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆయన 1989 డిసెంబర్ 3 నుంచి 1990 డిసెంబర్ 17 వరకు సీఎం బాధ్యతలు చేపట్టారు. నగరం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముఖ్యమంత్రిగా ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చి తనదైన మార్క్‌ను సాధించారు. సనత్‌నగర్ నుంచి పోటీ చేయక ముందే 1978 మార్చి 6 నుంచి 1980 అక్టోబర్ 11 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదటిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న సనత్‌నగర్ నియోజకవర్గం 1978లో ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడగా నాలుగో ఎమ్మెల్యేగా మర్రి చెన్నారెడ్డి ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇదే నియోజకవర్గం నుంచి ఆయన తనయుడు మర్రి శశిధర్‌రెడ్డిని నిలబెట్టి 1992లో గెలిపించుకుని తన రాజకీయ వారసత్వాన్ని అందించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై తన తండ్రి ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకుసాగారు. దశాబ్ద కాలం క్రితం వరకు సనత్‌నగర్ అంటే మర్రి కుటుంబం, మర్రి అంటే సనత్‌నగర్‌గా ఉంటూ వచ్చింది.

తిరస్కరణకు గురైతే డిపాజిట్ వాపసు ఇస్తారా?

మీకు తెలుసా?

నామినేషన్లను దాఖలు చేసిన అభ్యర్థి తమ నామ పత్రాలు స్క్రూటినీలో తిరస్కరణకు గురైతే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి చెల్లించిన డిపాజిట్ (ధరావతు)ను తిరిగి అభ్యర్థికి చెల్లిస్తారు. ఈ సెక్యూరిటీ డిపాజిట్‌ను వెంటనే చెల్లించరు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక ఇస్తారు. తిరస్కరణకు గురైన అభ్యర్థి ఎన్నికలు ముగిశాక రిటర్నింగ్ అధికారికి తాను చెల్లించిన ధరావతును తిరిగి చెల్లించాలని కోరుతూ ఒక వినతి పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. వివరాలను సరి చూసుకుని అభ్యర్థి ధరావతును వాపస్ ఇచ్చేస్తారు. నామినేషన్లను బరిలో ఉండకుండా అభ్యర్థి తన నామ పత్రాలను ఉప సంహరించుకుంటే, నగదు రూపంలో రిటర్నింగ్ అధికారికి సెక్యూరిటీ డిపాజిట్‌ను చెల్లించినట్లయితే వెంటనే చెల్లిస్తారు.

– నాంపల్లి

వయోధికులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటేయొచ్చు





ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: వయోధికులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవచ్చని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోనుందని పేర్కొన్నారు. జిల్లాలో వయోధిక ఓటర్లు 32,921 మంది, దివ్యాంగ ఓటర్లు 24,751 మంది ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే 80 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులు, 40 శాతం కన్నా మించి ఉన్న దివ్యాంగులు ఫారం–12 (డీ)లో తమ పూర్తి వివరాలను నమోదు చేసి ఈ నెల 7 వరకు బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వోలకు) అందించాలని గౌతమ్ సూచించారు. ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వారి వద్దకు రెండు రోజుల ముందే పోలింగ్ అధికారులు వస్తారని తెలిపారు. వీరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు కంపార్టుమెంట్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. సదరు ఓటర్లు రహస్యంగా ఓటు హక్కు వినియోగించుకుని బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియను అంతా వీడియో కవరేజీ చేస్తారని తెలిపారు. ఒకవేళ మొదటి రోజు ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో మరో రోజు ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తారని, ఇలా రెండుసార్లు మాత్రమే వీలు కల్పిస్తామని చెప్పారు.

ప్రచారానికి మేము సైతం!



ముషీరాబాద్ పరిధిలోని భోలక్‌పూర్‌లో గురువారం కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్ తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మేము సైతం అన్నట్లు.. ఓ తల్లి చంకన బిడ్డను ఎత్తుకుని, ఓ ముదిమి వయసు మహిళ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో సహాయ నిరాకరణ

- ప్రచారానికి కలిసిరాని అసమ్మతి నేతలు
- పార్టీని వీడుతున్న మరికొందరు.
- గాంధీ భవన్‌ను వదలని నిరసన జ్వాలలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా ఆచితూచి ఎన్నికల బరిలో దింపుతున్న అభ్యర్థులకు 'స్థానిక'ంగా సహాయ నిరాకరణ ఎదురు కావడం ఆందోళన కలిగిస్తోంది. పార్టీ టికెట్ ఆశించి భంగపడిన నేతల అసంతృప్తి చల్లారడం లేదు. ఇప్పటికే పలు నియోజకవర్గాలకు చెందిన అసమ్మతి వాదులు ఏకంగా అగ్రనేతలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ ఇతర పార్టీల్లో చేరిపోగా, మరికొందరు పార్టీ వదలకుండా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ అభ్యర్థుల ప్రచారానికి సైతం దూరం పాటిస్తున్నారు. పార్టీ పరంగా అధికారికంగా ఖరారైన అభ్యర్థులు సైతం అసమ్మతి నేతలను పట్టించుకోకపోవడంతో మరింత అగాధం పెరిగిపోతోంది. మరికొందరు అసమ్మతి నేతలు తమ అనుచరులను గాంధీభవన్‌కు పంపించి ఆందోళనకు దిగుతున్నారు. తాజాగా గురువారం నగర శివారులోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి టికెట ఆశించి భంగపడిన దండెం రాంరెడ్డి అనుచరులు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. ఏకంగా కార్యాలయంలో చొచ్చుకెళ్లి కుర్చీలు ఎత్తేసి ధ్వంసం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలు తగులబెట్టారు.

పార్టీ నుంచి జంప్

ఎల్బీనగర్ నుంచి టికెట్ ఆశించిన ముద్దగోని రామ్మోహన్ గౌడ్ పార్టీకి రాజీనామా చేసి తిరిగి భార్య, కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నతో కలిసి గులాబీ గూటికి చేరుకున్నారు. జూబ్లీహిల్స్‌లో దివంగత పీజేఆర్ కుమారుడు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లిలో గొట్టిముక్కల వెంగళరావులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే మల్కాజిగిరి, మేడ్చల్ కుత్బుల్లాపూర్ తదితర సెగ్మెంట్లలో పలువురు నేతలు పార్టీ నుంచి జంప్ అయ్యారు.

సైలెంట్‌గా..

పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టికెట్ దక్కని నేతలు స్తబ్ధంగా మారిపోయారు. మహేశ్వరంలో బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత తిరుగుబాటు బావుటా ఎగరవేసేందుకు సిద్ధమవుతుండగా రంగారెడ్డి డీసీసీ చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డిలు, అంబర్‌పేట లో లక్ష్మణ్ యాదవ్, నూతి శ్రీకాంత్ గౌడ్‌లు, ఎల్బీనగర్‌లో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రాజేంద్రనగర్‌లో జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వేణుగోపాల్, గౌరి సతీష్‌లు, కూకట్‌పల్లిలో గొట్టిముక్కల పద్మారావు, సత్యం శ్రీరంగం, నాగిరెడ్డి, గాలి బాలాజీ, శేరిలింగంపల్లిలో జెరిపేటి జైపాల్ యాదవ్‌తో పాటు రఘునాథ్ యాదవ్ , కంటోన్మెంట్‌లో సర్వే సత్యనారాయణ, శ్రీగణేశ్, ఖైరతాబాద్‌లో ఎంఆర్‌జీ వినోద్ రెడ్డి, సనత్ నగర్‌లో రవీందర్‌రెడ్డి, మర్రి ఆదిత్య రెడ్డి సహాయ నిరాకరణకు దిగారు.

బస్తీ నేతల 'కుస్తీ' పాట్లు


అభ్యర్థులను గెలిపించేందుకు హోరాహోరీగా పోరు

- అన్నీ తామై సాగిస్తున్న ఎన్నికల ప్రచారం
- ఎన్నికలు ఉన్నా లేకున్నా అందుబాటులో ఉండేది వారే
- అభ్యర్థుల గెలుపోటముల్లో బస్తీ నాయకులే కీలకం

సాక్షి, సిటీబ్యూరో: బరి గీసేది వారే. బరిలో నిలిచేది వారే. ఆటగాళ్లు ఉన్నా లేకున్నా పోటీకి సై అంటూ కదన రంగంలోకి దూకేది కూడా వారే. తెల్లవారింది మొదలు రాత్రి తిరిగి ఇళ్లకు చేరుకొనే వరకు ఉరుకులు పరుగులు పెడుతూ ఎన్నికల ప్రచారం చేయడంలో బస్తీ నాయకులే కీలకం. బడా నేతలు ఎందరున్నా సాధారణ ప్రజలకు ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉండేది కూడా బస్తీ నాయకులే. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సరే ప్రజల పక్షాన గొంతు వినిపించేందుకు ముందుకొస్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పైనాయకులకు విన్నవిస్తారు. ప్రజలకు అనివార్యంగా జవాబుదారీగా ఉంటారు. ప్రస్తుతం ఎన్నికల వేళ.. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపు కోసం బస్తీ నాయకులు హోరాహోరీ ప్రచారం సాగిస్తున్నారు. డప్పు దరువులు, బ్యాండ్ మేళాలు, కళాజాతలతో ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. డివిజన్‌లు, కాలనీలు, బస్తీల వారీగా వివిధ పార్టీల శ్రేణులు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. ఇప్పటికే దాదాపు అన్ని పార్టీల్లోనూ అభ్యర్థులు ఖరారయ్యారు. శుక్రవారం నుంచి నామినేషన్‌లు సైతం దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అభ్యర్థుల సంఖ్యాబలాన్ని, మెజారిటీని చాటేందుకు సైతం బస్తీ నాయకులే దోహదం చేయడం విశేషం.

ఎన్నికలు వస్తాయి.. పోతాయి..

- నిజానికి ఎన్నికలు ఒక జాతర లాంటివి. నెల, రెండు నెలల పాటు ఎన్నికల హడావుడి ఉంటుంది. ఎన్నికల రోజుల్లో మాత్రమే బడానేతలు మొదలుకొని బరిలోకి దిగిన అభ్యర్థుల వరకు ప్రచారానికి తరలి వస్తారు. ఓటర్లను ఆకట్టుకొనేందుకు హామీల వర్షం కురిపిస్తారు. అరచేతిలో వైకుంఠం చూపిస్తారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు పండగ వాతావరణాన్ని తలపిస్తాయి. ఎక్కడ నలుగురు గుమిగూడినా ఎన్నికల ముచ్చట్లే వినిపిస్తాయి. ఇదంతా ఒకవైపు అయితే మరోవైపు ఏళ్ల తరబడి నమ్ముకొన్న పార్టీకి సేవ చేసేందుకు ఎంతో భావోద్వేగంతో పని చేసేది మాత్రం సాధారణ కార్యకర్తలు, కిందిస్థాయి కేడర్ మాత్రమే.



- ఎమ్మెల్యేలుగా గెలిచేందుకు పోటీపడే అభ్యర్థులు అవసరం కొద్దీ కండువాలు మార్చుకున్నా, అధికారమే పరమావధిగా పార్టీలు మారినా సరే తాము మాత్రం నమ్ముకున్న పార్టీని వమ్ము చేయకుండా నిలబడతారు. పార్టీతో, పార్టీ జెండాతో మమేకమవుతారు. 'పార్టీ ఎవరికి టికెట్ ఇస్తుందో చివరి నిమిషం వరకు తెలియదు. ఇతర పార్టీల్లోంచి వచ్చిన వాళ్లకు ఆకస్మాత్తుగా టికెట్ ఇస్తారు. ఎవరొచ్చినా సరే ప్రచారం చేయవలసిందే కదా' అని ఓ ప్రధాన పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. 'ఎన్నికలు వస్తాయి. పోతాయి. కానీ మేం తిరిగే బస్తీల్లో, కాలనీల్లో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి కదా' అని మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన మరో పార్టీ నాయకుడు చెప్పారు.
- కొద్ది రోజులుగా అన్ని పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. ఇంటింటికి వెళ్లి ఓటర్లను ఆకట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయా బస్తీలకు, కాలనీలకు చెందిన నాయకులే పార్టీని ప్రజల వద్దకు తీసుకెళ్తున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు మొదలుకొని అనుచరగణాలు, చోటా, బడా నాయకులు ఎందరు ఉన్నా ప్రజలకు తెలిసేది స్థానిక నాయకులే కావడం గమనార్హం.
- కొద్ది రోజులుగా ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు, కార్యకర్తలను మచ్చిక చేసుకొనేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నాయి. ఫంక్షన్ హాళ్లలో విందులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సమ్మేళనాలను విజయవంతం చేసేందుకు బస్తీ నాయకులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. పార్టీలు నిర్వహించే భారీ బహిరంగ సభలకు జనాన్ని తరలించడంలోనూ వాళ్లదే క్రియాశీలకమైన బాధ్యత.

'ఓటు బ్యాంకు' పరిరక్షకులు..

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు మినహాయిస్తే మిగతా అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం వల్లే ఆయా పార్టీలకు బలమైన ఓటు బ్యాంకులు ఉంటాయి. ఇందుకోసం నగరంలో వర్షాకాలంలో పోటెత్తే వరదలు, ముంపు ప్రాంతాల బాధితులకు అండగా నిలవడం మొదలుకొని బోనాలు, వినాయకచవితి ఉత్సవాలు తదితర వేడుకల వరకు అన్ని సందర్భాల్లో వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులుగా నిలబడి తమ ఓటుబ్యాంకులను కాపాడడంలో బస్తీ నేతల కృషి ఎనలేనిది.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

హైదరాబాద్ జిల్లాలో ఏర్పాట్లు పూర్తి



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓ) ఫారం–1 ద్వారా నామినేషన్ల స్వీకరణకు నోటిఫికేషన్ జారీ చేసి ఉదయం 11 నుంచి నామినేషన్లను మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారు. ప్రభుత్వ సెలవురోజుల్లో మినహా నవంబర్ 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ పత్రాలను ఆర్ఓలకు అందజేసేముందు అఫిడవిట్‌లోని అన్ని కాలమ్స్‌ను తప్పనిసరిగా నింపాలని, దేనినీ ఖాళీగా ఉంచరాదని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఓటరు జాబితాలో అభ్యర్థి పేరున్న కాపీని జత చేయాలని తెలిపారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. ఆన్‌లైన్ ద్వారా కూడా నామినేషన్ల స్వీకరించేందుకు ఎన్నికల సంఘం సదుపాయం కల్పించిందని, ఆన్‌లైన్‌లో నమోదు చేసినా, ఆర్ఓ సూచించే నిర్ణీత రోజున భౌతికంగా సంతకం చేసిన పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్లను పురస్కరించుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఆర్ఓ కార్యాలయానికి వంద మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఆర్ఓ కార్యాలయంలో వీడియో బృందాలతో పాటు 360 డిగ్రీల్లో పని చేసే సీసీ కెమెరాలు కూడా ఉంటాయి. నామినేషన్ దాఖలు సందర్భంగా ఆర్ఓ కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుందని, అభ్యర్థి తరఫున ఆర్ఓ కార్యాలయానికి మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

మజ్లిస్‌కు మద్దతు

సాక్షి,సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ యునైటెడ్ ముస్లిం ఫోరమ్ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా మతోన్మాద శక్తులు అధికారంలోకి రాకుండా వ్యూహరచన చేయాలని గురువారం జరిగిన సమావేశంలో తీర్మానించింది. మజ్లిస్ పోటీ చేయని స్థానాల్లో మాత్రం ముస్లింల సమస్యలతో కూడిన డిమాండ్లను పరిష్కరించే పార్టీకి మద్దతు ప్రకటించాలని నిర్ణయించింది.

గుండెల్లో పెట్టి చూసుకుంటా..



ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి తలసాని గురువారం మోండా మార్కెట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ మహిళను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్న దృశ్యం.





జెండాలు వేరైనా ఉపాధి ఒక్కటే

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివిధ వృత్తుల వారికి చేతినిండా పని దొరుకుతోంది. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలో మేదరులు వివిధ పార్టీల జెండాలను తయారు చేసే పనిలో బిజీగా ఉన్న దృశ్యం.

కాకా.. మన గుర్తు 'హస్తం'



కాకా యాదికున్నది కదా మన గుర్తు హస్తం. మా నాయనతో పని చేసినవ్.. ఇప్పుడు నాతో పని చేయాలి. మాతో రావాలి కాకా అంటూ ఓ ఓటరును ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి ఆప్యాయంగా పలకరించారు. మన గుర్తు హస్తం అంటూ చెయ్యి చూపించారు. మీ నాయన వెంబటి నడిచాను బిడ్డా.. నీతో కూడా నడుస్తా అంటూ ఆయన బదులిచ్చారు. ఈ ఆసక్తికర సన్నివేశం గురువారం అమీర్‌పేట్ మార్కెట్ బస్తీలో చోటుచేసుకుంది. - బంజారాహిల్స్

సినీ నిర్మాత కోసం సీసీఎస్ వేట!

- ఎఫ్‌ఎంసీజీ కేసులో వాంటెడ్‌గా అట్లూరి నారాయణరావు
- కేసు మాఫీ పేరుతో నిందితుల నుంచి రూ.కోటి వసూలు
- ఖమ్మంలో ఓ న్యాయవాది ద్వారా ఐపీ పిటిషన్ దాఖలు
- విచారణలో వెల్లడించిన ప్రధాన నిందితుడు రాంబాబు



సాక్షి, సిటీబ్యూరో: విజయవాడలో చాక్లెట్ల వ్యాపారంతో మొదలు పెట్టి, హైదరాబాద్‌లో ఫాస్ట్ మూవింగ్ కంజ్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) దందా స్థాపించి, మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) దందాలోకి దిగి, డిపాజిట్ల పేరుతో వందల మంది నుంచి రూ.540 కోట్లు వసూలు చేసిన కేసులో తెలుగు సినీ నిర్మాత అట్లూరి నారాయణ రావు నిందితుడిగా మారారు. ఈ స్కామ్ సూత్రధారి రాంబాబు విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా నారాయణరావును మూడో నిందితుడిగా చేర్చిన సీసీఎస్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. బుధవారం ఈ కేసులో అరెస్టు అయిన రాంబాబు, పెనుమత్స కృష్ణం రాజులను తదుపరి విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్‌ఎంసీజీ దందా చేసేందుకు రాంబాబు రాధారామ్ ఏజెన్సీస్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశాడు. ఇద్దరు నిందితులు తమ వ్యాపార విస్తరణ కోసమంటూ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించారు. వీరికి 6 నుంచి 13 శాతం వడ్డీతో డబ్బు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. ఓ దశలో వ్యాపారంలో వచ్చే లాభాలు పంచడానికి, వడ్డీలు చెల్లించడానికి సరిపోలేదు. దీంతో తమ వద్ద కొత్తగా పెట్టుబడి పెట్టే వారి సొమ్మును పాత ఇన్వెస్టర్లకు చెల్లించడం మొదలెట్టారు. చివరకు చెల్లింపులు చేయలేక డిపాజిటర్లను మోసం చేశారు. తమ కోసం బాధితులు తిరుగుతున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేశారనే విషయం తెలియడంతో రాంబాబు తన కంపెనీ చార్టెట్ అకౌంటెంట్ ద్వారా అట్లూరి నారాయణరావును సంప్రదించాడు. సినీ నిర్మాతగా ఉన్న అతను తనకు రాజకీయాలతో పాటు పోలీసు విభాగంలో చాలా పలుకుబడి ఉందని, అది వినియోగించి కేసు లేకుండా చేస్తానని రాంబాబుకు హామీ ఇచ్చాడు. ఇందుకుగాను రూ.20 కోట్లు డిమాండ్ చేశాడు. బేరసాల తర్వాత రూ.2 కోట్లకు అంగీకరించిన నారాయణ రావు అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఆపై కొన్ని ప్రయత్నాలు చేసినా నిందితులకు కేసు విషయంలో ఎలాంటి సహాయం చేయలేకపోయాడు. దీంతో ఇన్సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) దాఖలు చేసి బయటపడదామని రాంబాబుకు సలహా ఇచ్చాడు. అతడు అంగీకరించడంతో ఎవరికీ ఎలాంటి సమాచారం లేకుండా ఈ కథ నడపాలని నిర్ణయించుకున్నాడు. విజయవాడతో పాటు నగరంలోనే ఈ స్కామ్ మొత్తం జరిగింది. బాధితులు సైతం ఇక్కడి వారే ఉన్నారు. అయితే నారాయణరావు మాత్రం ఖమ్మం కోర్టులో అక్కడి న్యాయవాదితో ఐపీ దాఖలు చేయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాడు. ఓపక్క ఈ పనులు చేస్తూనే మరోపక్క రాంబాబు నుంచి వీలైనంత మొత్తం వసూలు చేసుకోవాలని భావించాడు. అతడి నుంచి రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలు తీసుకున్న నారాయణరావు వాటిని పాతబస్తీలో కరిగించి, రూ.90 లక్షలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నాడు. నిందితులను అరెస్టు చేసిన సీసీఎస్ పోలీసులు లోతుగా విచారించడంతో అట్లూరి నారాయణ రావు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ కేసులో ఇతడిని మూడో నిందితుడిగా చేర్చిన అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇందుకుగాను ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు.

నేను పార్టీ మారడం లేదు

టి.అంజయ్య మనుమడు అభిషేక్‌రెడ్డి



ముషీరాబాద్: తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య మనుమడు అభిషేక్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ముషీరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను అసంతృప్తిగా ఉన్న మాట వాస్తవమేనని అయితే ఏఐసీసీ నాయకులు తనతో మాట్లాడడం జరిగిందని, పార్టీలో తనకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

పద్మారావు గెలుపు కోసం పాదరక్షలు త్యాగం



చెప్పులు లేకుండా పద్మారావుతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చంద్రశేఖర్

చిలకలగూడ : రాజకీయ నాయకుల గెలుపు కోసం కార్యకర్తలు పలు రకాల త్యాగాలు చేసి అమ అభిమానాన్ని చాటుకుంటారు. గుండు చేయించుకోవడం, ఒళ్లంతా టాటూలు, గుడి చుట్టు ప్రదక్షిణలు, గడ్డం పెంచుకోవడం, తాత్కాలికంగా మద్యం, మాంసం ముట్టకపోవడం వంటివి ఈ కోవలోకే వస్తాయి. సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుకు వీరాభిమాని. తమ నాయకుడి విజయం కోసం పాదరక్షలను త్యాగం చేస్తున్నట్లు ఇటీవల శపథం చేశాడు. అప్పటి నుంచి చెప్పులు వేసుకోకుండా ప్రచారంలో పాల్గొంటున్నాడు. మరోమారు పద్మారావు గెలిచి హ్యాట్రిక్ సాధించాలని, ఆయన విజయం సాధించిన తర్వాత విజయోత్సవ ర్యాలీలో పాదరక్షలు ధరిస్తానని పేర్కొన్నాడు.

రూ.40 కోట్లు పట్టివేత

- ఎన్నికల తనిఖీల్లో పట్టుబడిన మొత్తమిదీ
- రాచకొండ పరిధిలో 24 చెక్ పోస్టుల ఏర్పాటు
- కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు రూ.40 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం మాడ్గుల, యాచారం పోలీస్ స్టేషన్లను, ఇబ్రహీం పట్నం, మాల్ చెక్ పోస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల విధులకు సంబంధించి సిబ్బందికి నిర్దిష్టమైన సూచనలను అందించామని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కిందిస్థాయి సిబ్బందికి కూడా ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించేందుకు సిబ్బందితో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. రాచకొండ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామని, మాడ్గుల పరిధిలో 90 మంది పైన గత ఎన్నికల సమయంలో పలు రకాల నేరాలకు పాల్పడిన వారిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మోసపూరిత హామీలను ఎండగడతాం

డాక్టర్ విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇస్తున్న మోసపూరిత హామీలను ప్రజాక్షేత్రంలో ఎండగతామని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం ఆయన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సదస్సులో 92 మందికి తమ పార్టీ నుంచి బి-ఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ... 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల తరఫున పోరాడుతున్న ఏకైక పార్టీ ధర్మ సామాజ్ పార్టీ అన్నారు. తమ పార్టీ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో పోటీపడి విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సులో పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో రెండు పార్టీలు..



మన్నె గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన జలాలుద్దీన్



విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జలాలుద్దీన్

బంజారాహిల్స్: బడా బడా నేతలు రోజుల వ్యవధిలోనే పార్టీలు మారగా లేనిది ద్వితీయ శ్రేణి నాయకులమైన మేము నచ్చిన పార్టీలకు వెళ్తే తప్పేంటి అంటున్నారు కొందరు నేతలు.. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ పార్టీల్లోకి జంపింగ్‌లు ఇతర పార్టీల్లోకి వలసలు ముమ్మరమవుతున్నాయి. తాజాగా బంజారాహిల్స్ డివిజన్ నేత, ఉద్యమకారుడు జలాలుద్దీన్ గత నెల 30న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఏమైందో ఏమో కానీ నాలుగు రోజులు గడవకమందే గురువారం ఖైరతాబాద్ నియోజక వర్గం బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో మళ్లీ గులాబీ కండువా కప్పుకున్నాడు.

నిఘా మరింత పెంపు..

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సాక్షి,సిటీబ్యూరో: శుక్రవారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు నిఘాను మరింత పెంచుతున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గంలో తొమ్మిది స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్స్ 24 గంటల పాటు పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తరలించే నగదు, ఆభరణాలు, మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని పట్టుకునేందుకు ఈ టీమ్‌లు ప్రత్యేకంగా పని చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

నగరవాసికి జపాన్ జాబ్ వల!

- రూ.29.27 లక్షలు కొట్టేసిన కేటుగాళ్లు
- నకిలీ ఇంటర్వ్యూ, ఆఫర్ లెటర్‌లు
- వివిధ చార్జీల పేరిట డబ్బులు వసూలు
- సైబరాబాద్ సైబర్ క్రైమ్స్‌లో బాధితురాలి ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: జపాన్‌లో ఉద్యోగం ఉందంటూ నగరవాసిని నట్టేట ముంచారు సైబర్ నేరస్తులు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.29.27 లక్షలు కొట్టేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూసాపేటకు చెందిన యువతి గత జులైలో ఆన్‌లైన్‌లో ఉద్యోగం కోసం వెతకగా.. ఓ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ నుంచి ఈ-మెయిల్ వచ్చింది. జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమోటివ్ ఉపకరణాల తయారీ సంస్థలో సీనియర్ అకౌంట్స్ మేనేజర్ ఉద్యోగం ఉందని మెయిల్ సారాంశం. ఆగస్టు నెలలో కంపెనీ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న కోజిన్ నాకాకిత బాధితురాలిని ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేశాడు. ఆ మర్నాడు ఉదయం ఆమె మెయిల్‌కు కంపెనీ నుంచి జాబ్‌కు సెలెక్ట్ అయ్యావంటూ జీతభత్యాలు, బెనిఫిట్స్‌తో కూడిన ఆఫర్ లెటర్ వచ్చింది. అయితే డాక్యుమెంటేషన్, జీఎస్టీ ఇతరత్రా చార్జీల కోసం రూ.33,780 డిపాజిట్ చేయాలని ప్రతినిధులు సూచించడంతో.. నిజమేనని నమ్మిన ఆమె సొమ్మును బదిలీ చేసింది. ఆ తర్వాత కొద్ది సేపటికి పెట్టుబడుల మీద 40 శాతం బోనస్‌తో కలిపి వస్తాయని ఆశ చూపించడంతో రూ.29,27,780 పెట్టుబడులు పెట్టింది.

జీ–20 సదస్సుతో క్యాన్సిల్ అంటూ..

ఢిల్లీలో జపాన్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఉంటుందని బాధితురాలిని నమ్మించారు. రోజులు గడుస్తున్నా మీటింగ్ ఖరారు కాకపోవడంతో ఆరా తీయగా.. ఢిల్లీలో జీ-20 సమావేశాల నేపథ్యంలో మీటింగ్ వాయిదా పడిందని మాయమాటలు చెప్పారు. ఈసారి సమావేశం బెంగళూరులో అక్టోబర్ నెలలో ఉంటుందని చెప్పారు. ఈ సమావేశం కూడా జరగకపోవడంతో అనుమానం వచ్చిన బాధితురాలు బెంగళూరులోని జపాన్ ఎంబసీలో ఆరా తీయగా.. అసలు విషయం తెలిసి ఖంగుతింది. అసలు సదరు జపాన్ కంపెనీ ఎలాంటి రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేపట్టలేదని తెలిసింది. దీంతో సైబరాబాద్ సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు చేసింది.

తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్



ఆరు గ్యారంటీలను ప్రదర్శిస్తున్న మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, అభ్యర్థి రోహిన్‌రెడ్డి

అంబర్‌పేట్: పోల్ మేనేజ్‌మెంట్‌పై కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తామని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ అన్నారు. గురువారం బాగ్ అంబర్‌పేటలో పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, పార్టీ అభ్యర్థి రోహిన్‌రెడ్డి తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల్లో అవినీతిని తమ అధినేత రాహుల్ గాంధీ ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అక్కకు బై చెప్పేందుకు వెళ్లి...

- స్కూల్ బస్సు కింద పడి బాలుడి మృతి
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సును ముందుకు తీసిన డ్రైవర్



హర్షకుమార్ (ఫైల్)

హయత్‌నగర్: స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ఓ పసివాడి ప్రాణాన్ని బలితీసుకుంది. అక్కను బస్సు ఎక్కించేందుకు బస్సు దగ్గరికి వెళ్లిన బాలుడు బస్సు ముందు టైరు కింద పడి మృతి చెందిన సంఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, జనంపల్లికి చెందిన తన్నీరు శ్రీకాంత్ పోస్ట్‌మెన్‌గా పనిచేస్తూ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూరు గణేష్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతనికి కుమార్తె నిషిక, కుమారుడు పవన్ హర్షకుమార్(3) సంతానం. గురువారం ఉదయం పెద్దఅంబర్‌పేట్‌లోని కాండర్‌షైన్ పాఠశాలలో చదువుతున్న తన కుమార్తెను స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా అతడి కుమారుడు హర్ష కూడా బస్సు వద్దకు వచ్చాడు. అక్కడే ఉన్న బస్సు అటెండర్ మల్లారెడ్డి బాలుడిని గమనించకపోవడంతో బస్సు డ్రైవర్ ఈశ్వర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సును ముందుకు తీశాడు. దీంతో బస్సు ముందు చక్రాలు చిన్నారి తలపై వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ముందే కొడుకు ప్రాణాలు పోవడంతో ఆ తల్లిదండ్రులు గుండెలు అవిసేలా విలపించారు. దీనిని గుర్తించిన కాలనీ వాసులు ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బజాజ్ బంపర్ డ్రా



సాక్షి, సిటీ బ్యూరో: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని నెక్సస్‌లో మాల్‌లో గురువారం బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ బంపర్ డ్రా నిర్వహించింది. కార్యక్రమానికి సినీనటి సురభి పురానిక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బంపర్ డ్రాలో రూ.20 లక్షల నగదు బహుమతిని గెలుచుకున్న విజేతను (కూపన్ నంబర్ 20231086442) ప్రకటించారు. కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ మార్కెటింగ్ హెడ్ విశాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రానికి... వంద మీటర్లలోపే అనుమతి!

- ఆయా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు
- నిఘా నీడలో పోలింగ్ కేంద్రాలు
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల కేంద్రాల వద్ద పూర్తయిన ఏర్పాట్లు



బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని షేక్‌పేట మండల కార్యాలయంలోని జూబ్లీహిల్స్ నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నోడల్ అధికారి హరిప్రసాద్ తదితరులు

బంజారాహిల్స్: రెండున్నర ప్లటూన్ల సాయుధ బలగాలు... ఇద్దరు ఏసీపీలు... నలుగురు ఇన్‌స్పెక్టర్‌లు... పది మంది ఎస్ఐలు... 14 మంది మహిళా కానిస్టేబుళ్లు... 25 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు... ఇదీ బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు వేయనుండగా ఇందుకోసం జూబ్లీహిల్స్ ఆర్వో కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నోడల్ అధికారి కె. హరిప్రసాద్ నేతృత్వంలో ఇక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. వంద మీటర్ల వరకు సున్నంతో మార్కింగ్ వేశారు. నామినేషన్ల దాఖలకు అభ్యర్థితో కలిసి అయిదుగురిని మాత్రమే ఆర్వో కేంద్రంలోకి అనుమతించనున్నారు. నామినేషన్ల కేంద్రం వరకు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. కార్యకర్తలు అంతా కేంద్రానికి వంద మీటర్ల దూరంలోనే ఉండాల్సి ఉంటుంది.

నిర్దేశించిన ప్రాంతం వరకే ర్యాలీలు...

నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, ఊరేగింపులు ఖైరతాబాద్ నియోజకవర్గం అసెంబ్లీ రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఉన్న షాదన్ కాలేజీ వరకు మాత్రమే అనుమతించాలని ఖైరతాబాద్ ఆర్వో వెంకటేష్ దోత్రే పోలీసులకు సూచించారు. రెండు, మూడు పార్టీలు ఒకేసారి కాకుండా ఒకదాని వెంట మరొకటి వచ్చే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకేసారి వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాలీలు పూర్తయిన వెంటనే కార్యకర్తలను బందోబస్తులో ఉన్న పోలీసులు వెంటవెంటనే అక్కడి నుంచి పంపించివేయాలన్నారు. ర్యాలీలకు అనుమతులు ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్వో కేంద్రంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే నామినేషన్ వేసే క్రమంలో ఈ మొత్తం దృశ్యాలను వీడియోలో బంధించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదుచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.





ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఖైరతాబాద్ నామినేషన్ల కేంద్రంలో పోలీసు అధికారులతో చర్చిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటేష్ దోత్రే

జంగ్ 2023 తెలంగాణ

బీజేపీ జూబ్లీహిల్స్ అభ్యర్థిగా లంకల దీపక్‌రెడ్డి



శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఉత్కంఠకు తెరపడింది. సీనియర్ నాయకులు, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన లంకల దీపక్‌రెడ్డికి టికెట్‌ను ఖరారు చేసింది. డాక్టర్ పద్మ వీరపనేని, కీర్తిరెడ్డి, ఆలపాటి లక్ష్మీనారాయణలు పోటీపడ్డా అధిష్టానం లంకల దీపక్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది. టీడీపీలో దాదాపు రెండు దశాబ్దాలపాటు లంకల పనిచేశారు. గ్రేటర్‌లో పలు పదవులతో పాటు ఉమ్మడి ఏపీలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా కీలక పదవులు చేపట్టారు. అనంతరం బీజేపీలో చేరి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో యువతను ఆకట్టుకుంటూ బీజేపీ పట్టుకు కృషి చేశారు.

నియోజకవర్గం	: జూబ్లీహిల్స్
పేరు	: లంకల దీపక్‌రెడ్డి
వయసు	: 49
విద్యార్హత	: డిగ్రీ
ఊరు	: నల్లగొండ జిల్లా చిట్యాల
రాజకీయ నేపథ్యం	: టీడీపీలో గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ, ఉమ్మడి ఏపీలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.
ప్రస్తుతం	: బీజేపీ కార్యవర్గ సభ్యుడు
సంతానం	: కుమారుడు, కుమార్తె

వేడుకగా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న ఆలయ ఈవో లావణ్య

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకం వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండు రోజు గురువారం ఉదయం గోపూజ, గవ్యాంత పూజలు, వాస్తుపూజ, వాస్తు హోమం, నిత్యోపాసన నిర్వహించారు. సాయంత్రం శంకరరామం గురుస్వామి బృందంచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన మహాసుదర్శన హోమంలో ఆలయ ఈవో ఎస్.లావణ్య పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

పోగొట్టుకున్న వారికి సెల్‌ఫోన్లు అప్పగింత



ఫోన్లు అప్పగిస్తున్న ఫిలింనగర్ పోలీసులు

బంజారాహిల్స్: ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఛేదించిన ఫిలింనగర్ క్రైం పోలీసులు బాధితులకు వాటిని అప్పగించారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, డీఐ రమేష్ గౌడ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోగొట్టుకున్న వారి ఈ పది సెల్ ఫోన్లను అప్పగించారు. తాము పూర్తిగా ఫోన్లు పోయాయని అనుకున్నామని పోలీసులు మాత్రం వాటిని పట్టుకొని తమకు అప్పగించడం ఆనందంగా ఉందని బాధితులు వెల్లడించారు.

ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న పింకీ రెడ్డి

లక్డీకాపూల్: భాగ్యనగరం సంప్రదాయ, ఆధునిక వస్త్రాల మేలు కలియక అని ఫ్యాషన్, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు పింకీ రెడ్డి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్రాంటియర్ రాస్ స్టోర్‌ను సుధారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పింకీ రెడ్డి మాట్లాడుతూ... నగర ఫ్యాషన్ ప్రియుల మనసు్సు దోచే వస్త్ర నిలయంగా ఈ స్టోర్ నిలుస్తుందన్నారు. ఫ్రాంటియర్ రాస్ కేవలం స్టోర్ మాత్రమే కాదని, ఇది కళాత్మకత సంస్కృతి, ఫ్యాషన్‌ల వేదిక అని ఆ స్టోర్ డైరెక్టర్లు అవీర్, హమీదాలు పేర్కొన్నారు.

నిమ్స్‌లో మహా రక్తదాన యజ్ఞం



కేక్ కట్ చేసి వేడుక జరుపుకొంటున్న బ్లడ్ బ్యాంక్ సిబ్బంది

- 20 వేలు దాటిన బ్లడ్ డోనర్స్ సంఖ్య
- ఈ ఏడాది 20200 యూనిట్ల రక్తం సేకరణ
- బ్లడ్ బ్యాంక్ హెచ్ఓడీని అభినందించిన డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్ బ్లడ్ బ్యాంక్ స్ఫూర్తిదాయకమైన రీతిలో మహా రక్తదాన యజ్ఞాన్ని కొనసాగిస్తుంది. ఈ ఏడాదిలో గురువారం నాటికి బ్లడ్ డోనర్స్ సంఖ్య 20250లకు చేరింది. రక్తదానం చేసి ప్రాణాన్ని కాపాడండి... ఒక్క యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడుతుంది అనే పిలుపుతో పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రక్త దాతలు ఇప్పటి వరకు 20200 యూనిట్ల రక్తాన్ని నిమ్స్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. అంతే కాకుండా దాతల నుంచి 18500 యూనిట్ల ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా, ప్లేట్‌లెట్-రిచ్ ప్లాస్మాలను సేకరించింది. గురువారం ఈ సందర్భాన్ని నిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. దాతల నుంచి ఇంత పెద్ద ఎత్తున సేకరించిన రక్తాన్ని పేద రోగులకు ముఖ్యంగా డెంగు, జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులతోపాటు డయాలసిస్ బాధితులకు సైతం అందిస్తున్నారు. ఆయా రోగులకు రక్తం దానం చేయాలన్న నిబంధన లేకుండానే నిమ్స్ తమ బ్లడ్ బ్యాంక్ నుంచి సరఫరా చేయడం గమనార్హం. ఆపరేషన్‌ల సమయంలో కూడా డోనర్స్ లేని వారికి సైతం రక్తాన్ని సమకూర్చడం విశేషం. అదే విధంగా బయట ఆస్పత్రుల్లోని రోగులకు కూడా నిమ్స్ బ్లడ్ బ్యాంక్ అందిస్తుంది. ఇంత పెద్ద ఎత్తున డొనేషన్స్ స్వీకరించి.. పేదలకు అందించడంలో బ్లడ్ బ్యాంక్ హెచ్ ఓ డి డాక్టర్ శాంతి, సిబ్బందిని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రత్యేకంగా అభినందించారు. రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతలకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో దాతల సహకారం రక్త సేకరణ ఈ ఏడాది నాటికి 25 వేల యూనిట్లకు చేరుకోనున్నని చెప్పారు. ఒక దాత నుంచి సేకరించే యూనిట్ రక్తంతో ప్రాణపాయస్థితిలో ఉన్న ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం 1లోని విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల వినియోగదారుల పరిష్కార వేదికను ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు బంజారాహిల్స్ ఏడీఈ రామిశెట్టి హైమానంద వెల్లడించారు. బంజారాహిల్స్ సబ్ డివిజన్ పరిధి కిందకు వచ్చే ఫిలింనగర్, బంజారాహిల్స్ సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు తమకేవైనా విద్యుత్ సమస్యలుంటే ఇక్కడ పరిష్కరించుకోవచ్చన్నారు. బంజారాహిల్స్, ఫిలింనగర్ ఏఈలు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు కూడా హాజరవుతారని అన్నారు.

జూబ్లీహిల్స్‌లో...

జూబ్లీహిల్స్, మాదాపూర్ విద్యుత్ వినియోగదారులకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినియోగదారుల సమస్యలకై పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు జూబ్లీహిల్స్ ఏడీఈ మల్లేశం తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

4 నుంచి గోకూప్ ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: చేనేతలు, హస్తకళాకారులకు చేయూతని అందించే గో కూప్ సంస్థ ది గూండ్లూమ్ కలెక్టివ్ పేరిట నగరంలో వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేయనుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బంజారాహిల్స్‌లోని కళింగ ఫంక్షన్ హాల్‌లో ఈ ప్రదర్శన 4 నుంచి 8వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ ప్రదర్శనలో చేనేత కళాకారులు, హస్తకళాకారులు, డిజైనర్లు, ఎన్‌జీఓలు, సామాజిక సంస్థలు... పాల్గొంటున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా పేరొందిన హస్త కళలు, కళాకారుల ప్రతిభకు ప్రదర్శన అద్దం పడుతుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ బస్తీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత సత్యనారాయణ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

రేపటి నుంచి దివాళీ మేళా

హైదరాబాద్: సోమాజిగూడలోని రాజ్‌భవన్‌రోడ్డులో ఉన్న శ్రీశ్రీ రవిశంకర్‌విద్యామందిర్‌లో శని, ఆదివారాల్లో దివాళీ మేళా నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్‌వెంకట్‌నారాయణ, హెడ్ మిస్ట్రెస్‌శీలారెడ్డి తెలిపారు. శారీస్‌స్టాల్, దియా అండ్ డెకరేటివ్‌ఐటమ్స్ స్టాల్, కాస్మోటిక్‌స్టాల్, వన్‌గ్రామ్‌గోల్డ్‌జ్యువెల్లరీ, టాయ్స్‌స్టాల్, గేమ్స్ స్టాల్స్‌ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నవంబర్ 4, 5వ తేదీల్లో ఉదయం 1 నుంచి రాత్రి 7 గంటల వరకు మేళా కొనసాగుతుందన్నారు. ఔత్సాహికులు ఫోన్: 79950 08312లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌కే ప్రజాదరణ.. అధికారం ఖాయం



అజహరుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వేముల యాదయ్య తదితరులు

- స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారు
- జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజహరుద్దీన్

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని, రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌కు చెందిన తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య, జీహెచ్ఎంసీ వార్డు కమిటీ మాజీ సభ్యురాలు మేఘన పద్మ, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎక్బాల్‌లు గురువారం అజహరుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అజహరుద్దీన్ మాట్లాడుతూ... అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన అనేక మంది నాయకులు తమ పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగుర వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్టీ మారుతున్న నాయకులపై దాడులు చేయిస్తున్నారని అజహరుద్దీన్ ఆరోపించారు. ఎన్ని దాడులు చేయించినా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాను సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. అంతకు ముందు ఆయన ఎస్పీఆర్‌హిల్స్‌లోని పీజేఆర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. నగర కాంగ్రెస్ నాయకుడు భవానీశంకర్, మోసిన్, రవీందర్ రెడ్డి, గ్యార నాగరాజు, జి.పి.జ్ఞానేశ్వర్, కేశవులు, సుందర్, మాలాకీ, నయీం, ఆండాళు, బెన్నార్, సతీష్, సాయి, శివ, అరుణ్‌గౌడ్, వెంకటేశ్, రాంబాబు, మాలా, వివిధ బస్తీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి: మాగంటి



యాదగిరినగర్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి తదితరులు

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిపించారు, మరోసారి కూడా గెలిపించాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కోరారు. యాదగిరినగర్‌లో బస్తీ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఆయన బైక్ ర్యాలీ, పాదయాత్ర కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... తనను గెలిపిస్తే ఇక సమస్యలే లేని నియోజకవర్గంగా దీనిని తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అనంతరం బస్తీకి చెందిన దాదాపు 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే తమ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, జీటీఎస్ టెంపుల్ చైర్మన్ చిన్న రమేష్, యాదగిరినగర్ బస్తీ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు వేణు, పవన్ ముదిరాజ్, కట్టా లక్ష్మి, వెంకటమ్మ, విజయ, సుజాత, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, మహదేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే 'పాట' పార్టీ

హిమాయత్‌నగర్: సంక్షేమ పథకాలతో ప్రజలను అసమర్థతలుగా చేస్తున్న ప్రస్తుత రాజకీయ పార్టీలకు దీటుగా, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలనే ఉద్దేశంతో పాట పార్టీని స్థాపించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ పార్టీని గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తూ నెలకు రూ. 30 వేల జీతం ఇస్తామన్నారు. మహిళలకు రెండు తులాల బంగారం, మహిళల కోసం ఆటోలకు కార్లుగా మారుస్తామన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో 50 నుంచి 60 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను పాట పార్టీ నుంచి బరిలో నిలబెడతామన్నారు. తమ పార్టీ నుంచి సికింద్రాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా కె. శ్రీనివాస్, ఆలేరు అభ్యర్థిగా కందేటి రమాదేవి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. పార్టీ చైర్మన్ మనోజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పవన్ రెడ్డిలు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీపై ఆలోచిస్తా...



మాట్లాడుతున్న డాక్టర్ పద్మ

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ అధిష్టాన నిర్ణయం తీవ్ర నిరాశకు గురిచేసిందని బీజేపీ సీనియర్ నేత డాక్టర్ పద్మ వీరపనేని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ టికెట్ ఇస్తుందని ఆశించామని, టికెట్ ఖరారైందని సంకేతాలు అందిన తర్వాత టికెట్ ఇవ్వకపోడం బాధాకరమన్నారు. కార్యకర్తలు నిరుత్సాహంలో ఉన్నారని, ఇండిపెండెంట్‌గా పోటీచేయాలని చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలతో చర్చించి మా నిర్ణయాన్ని రెండు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. టికెట్ ఆశించిన తమకు పార్టీ పెద్దలెవరూ సంప్రదించకపోడం, మాట్లాడకపోవడం మరింత బాధించిందన్నారు.

బూత్ కమిటీ సభ్యులు మరింత కష్టపడాలి: దానం

హిమాయత్‌నగర్: బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న నెల రోజులు కష్టపడి పనిచేస్తేనే విజయం సాధిస్తామన్నారు. గురువారం హిమాయత్‌నగర్ డివిజన్ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం హైదర్‌గూడలోని ఎంఎ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా దానం నాగేందర్ డివిజన్‌లోని బూత్‌కమిటీ ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివద్ధి పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి సుతారి, నాయకులు యతిరాజు, అశోక్ కుమార్, పి. ప్రభాకర్ గౌడ్, డి.రాజేందర్ కుమార్, నందు, రాజేంద్రప్రసాద్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి



అమీర్‌పేట్ మార్కెట్ బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో 10 సంవత్సరాల్లో ఎన్ని కొత్త రేషన్ కార్డులు ఇచ్చారో బీఆర్ఎస్ నాయకులు వివరించాలని ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సరైన సమయానికి వేతనాలు కూడా ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని అమీర్‌పేట మార్కెట్, అమీర్‌పేట ప్రాంతాల్లో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల స్కీంను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... తాను ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, గత ప్రభుత్వ పాలనతో విసిగిపోయారన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చేందుకు ఇప్పటికే ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఓట్ల కోసం ఎవరైనా బీఆర్ఎస్ నాయకులు ఇంటికి వస్తే గతంలో అధికారం ఇస్తే చేసిన అభివృద్ధి చూపించి ఓటు అడగాలని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

విష్ణుతో దానం భేటీ



బీఆర్ఎస్ నేత విష్ణును కలిసిన దానం

బంజారాహిల్స్: మూడు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం మధ్యాహ్నం నాగేందర్ తన అనుచరులతో కలిసి దోమలగూడలోని విష్ణునివాసానికి వెళ్లి ఆయనతో కొద్దిసేపు రాజకీయాలపై చర్చించారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే నాగేందర్‌ను గెలిపించుకోవాలి

పంజగుట్ట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలంటే ఖైరతాబాద్‌లో తిరిగి దానం నాగేందర్ ఎమ్మెల్యేగా గెలిస్తేనే సాధ్యం అవుతుందని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ఎంఎస్ మక్తాలో డబుల్‌బెడ్ రూమ్ లబ్ధిదారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంగీత యాదవ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాలన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డివిజన్ బాలాపుర బస్తీ అధ్యక్షుడు కళ్యాణ్‌దాస్, ఉపాధ్యక్షుడు జగన్‌దాస్ ఆధ్వర్యంలో త్యాగరాజు, రవి, వేణుగోపాల్‌తో కలిసి పలువురు యువకులు గురువారం ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. నాగేందర్ గెలుపు కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఆనంద్‌నగర్ కాలనీ నుంచి, జాఫర్ అలీబాగ్ నుంచి పలువురు యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గౌరీ శంకర్ నగర్‌లో చింతల ప్రచారం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్‌నగర్ బస్తీలో గురువారం ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

పంజగుట్ట: ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై పెద్ద ఎత్తున యువత బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గురువారం సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ ఆధ్వర్యంలో పెద్దెత్తున వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు దానం నాగేందర్ సమక్షంలో సోమాజిగూడ జయా గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



నాగేశ్వరరావుకు డాక్టరేట్

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 83 వ స్నాతకోత్సవంలో వైస్ చాన్స్‌లర్ రవీందర్, ఆదోబ్ సంస్థ చైర్మన్ అండ్ సీఈవో డాక్టర్ శంతన్ నారాయణ్‌ల చేతులు మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న సీనియర్ జర్నలిస్టు వై నాగేశ్వర రావు

– సాక్షి, సిటీబ్యూరో



మమతకు గోల్డ్‌మెడల్

జోగిపేట పీజీ కాలేజీ విద్యార్థిని పన్నీరు మమతకు లైబ్రరీ సైన్స్ మాస్టర్ డిగ్రీలో గోల్డ్‌మెడల్ లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 83వ స్నాతకోత్సవం సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా ఆమె గోల్డ్‌మెడల్ అందుకున్నారు. – సాక్షి, సిటీబ్యూరో


సీఎం వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్న కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

నీటి బొట్టు ఒడిసి పట్టి

- విశాఖ 'ఐసీఐడీ'సదస్సులో ముఖ్యమంత్రి జగన్
- కేంద్ర మంత్రి షెకావత్‌తో కలసి సదస్సును ప్రారంభించిన సీఎం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రతి నీటి బొట్టూ ఒడిసి పట్టి సాగు అవసరాలను తీరుస్తూ వ్యవసాయ దిగుబడులను పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సాగునీటి రంగం, వ్యవసాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. నీటి కొరతను అధిగమించేందుకు ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాదిలో తక్కువ కాలం మాత్రమే కురిసే వాన నీటిని ఒడిసి పట్టి ఆయకట్టుకు అందించడం ద్వారా కరువును సమర్థంగా నివారించవచ్చన్నారు. గురువారం విశాఖపట్నంలో 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) సదస్సును కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి సీఎం జగన్ ప్రారంభించి మాట్లాడారు. మొత్తం 90 దేశాలకు చెందిన ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. సుస్థిర వ్యవసాయం, నీటి నిర్వహణకు గట్టి కృషి చేస్తున్న ఐసీఐడీ సదస్సును రాష్ట్రంలో నిర్వహించడం గర్వంగా ఉందని, ప్రశాంతమైన విశాఖ నగరం అతిథులను చక్కటి అనుభూతి అందించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. నీటి నిర్వహణలో సరికొత్త మార్గాలపై సదస్సులో చర్చించడం ద్వారా భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రకాశం బ్యారేజీకి ప్రతిష్టాత్మక అవార్డు

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో డెల్టా రైతాంగానికి సాగునీటిని అందిస్తున్న ప్రకాశం బ్యారేజీకి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈ ఏడాది ప్రపంచ వారసత్వ నీటి పారుదల నిర్మాణాల అవార్డుల కోసం అందిన నామినేషన్లలో 19 నిర్మాణాలను ఎంపిక చేశారు. వీటిలో మన దేశం నుంచి నాలుగు నిర్మాణాలకు ఈ అవార్డు దక్కింది. అందులో ప్రకాశం బ్యారేజీకి చోటు దక్కింది. విశాఖలో ఐసీఐడీ సదస్సు సందర్భంగా అవార్డును జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డిలకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సీఎం జగన్ కలసి అందించారు. తమిళనాడులోని శ్రీవైకుంఠం ఆనకట్ట, ఒడిశాలోని బలిదా ఇరిగేషన్ జయమంగళ ఆనకట్టలకు కూడా ఈ అవార్డులు లభించాయి.

హైదరాబాద్‌లో బాబు ర్యాలీపై కేసు

- బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు
- అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడంపై చర్యలు

సనత్‌నగర్: తాత్కాలిక బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంలో అనుమతి లేకుండా ఆ పార్టీ నేతలు ర్యాలీ నిర్వహించడంపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు ఇంటి వరకు ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్ సమస్యకు కారణమయ్యారని, దీనివల్ల రెండు గంటలకుపైగా ప్రజలు ఇబ్బంది పడ్డారంటూ బేగంపేట ఎస్‌ఐ జయచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం 5.45 గంటలకు చంద్రబాబు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 50 బైక్‌లు, 20 కార్లతో పాటు సుమారు 400 మంది కార్యకర్తలు ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీ నిర్వహించారు. దీంతో బేగంపేట నుంచి పంజగుట్ట వరకు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించడంతో పాటు ప్రజలను ఇబ్బంది పెట్టినందుకు టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి జీవీజీ నాయుడుతో పాటు మరికొంతమందిపై ఐపీసీ 341, 290 (ఆర్/డబ్ల్యూ), 34, 21 (ఆర్/డబ్ల్యూ) 76 సీపీ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

ఇసుక దందాపై కొరడా

చంద్రబాబు ముఠా రూ.10 వేల కోట్ల ఇసుక దోపిడీపై కేసు నమోదు



ఎంత ఇసుక అందుబాటులో ఉంది.. ఎంత ఇసుక తవ్వుతున్నాం.. ఎంతకు అమ్ముతున్నాం.. అనే సమాచారం ఏదీ రికార్డుల్లో చూపించాల్సిన అవసరం లేకుండా చంద్రబాబు భారీ దోపిడీకి స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా తెరపైకి తీసుకువచ్చిందే 'ఉచిత ఇసుక విధానం'. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు ఉచితం అని భ్రమ కల్పించారు. కానీ వాస్తవంగా జరిగింది వేరు. ఈ విధానం ముసుగులో రాష్ట్రంలో ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్రబాబు తనతోపాటు మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకొచ్చారు. తద్వారా వారి దోపిడీకి అంతేలేకుండా పోయింది. తక్కువలో తక్కువ చంద్రబాబు అండ్ కో 10 వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టింది.

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా సాగిన ఇసుక దోపిడీపై సీఐడీ కొరడా ఝుళిపించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కర్త, కర్మ, క్రియగా వ్యవహరించి, సాగించిన ఇసుక కుంభకోణంపై కేసు నమోదు చేసింది. 'ఉచిత ఇసుక విధానం' ముసుగులో పచ్చ ముఠా బరితెగించి సాగించిన ఇసుక దోపిడీ గుట్టు రట్టు చేసింది. కేంద్ర ప్రభుత్వ చట్టం, గ్రీన్ ట్రిబ్యునల్ విధివిధానాలను ఉల్లంఘించి, కేబినెట్ ఆమోదం కూడా లేకుండా 'ప్రత్యేక మెమో' ద్వారా చంద్రబాబు పన్నిన పన్నాగం ఆధారాలతోసహా బట్టబయలు అయ్యింది. 2016 నుంచి 2019 వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి గండి కొట్టడమే కాక, చంద్రబాబు ముఠా ఏకంగా రూ.10 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడిందన్నది విభ్రాంతి పరుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఏ–1గా పీతల సుజాత (టీడీపీ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రి), ఏ–2గా చంద్రబాబు (అప్పటి ముఖ్యమంత్రి), ఏ–3గా చింతమనేని ప్రభాకర్ (టీడీపీ మాజీ ఎమ్మెల్యే), ఏ–4గా దేవినేని ఉమామహేశ్వరరావు (టీడీపీ ప్రభుత్వంలో జల వనరుల శాఖ మంత్రి)తోపాటు మరికొందరిని ఏ–5గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయాన్ని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానానికి తెలుపుతూ గురువారం పిటిషన్ దాఖలు చేసింది. వీరిపై ఐపీసీ సెక్షన్లు 120 బి, 409 రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 (1) (డి) రెడ్‌విత్ 13 (2) ప్రకారం అభియోగం నమోదు చేశారు.

అంతులేని బాబు ధన దాహం

పదేళ్ల తర్వాత 2014లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు యథేచ్ఛగా అవినీతికి బరితెగించారు. ఆ క్రమంలో ఆయన కన్ను రాష్ట్రంలో ఇసుక రీచ్‌లపై పడింది. యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడాలని పన్నాగం రచించారు. అందుకోసం 2014 నుంచి 2016 వరకు ఓ విధానాన్ని తీసుకువచ్చి, అడ్డూ అదుపు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడ్డారు. అంతటితో ఆయన ధన దాహం తీరలేదు. దాంతో మరింతగా బరితెగించి ఇసుక దోపిడీ సాగించేలా వ్యూహం పన్నారు. అందుకోసం ప్రభుత్వ ఇసుక విధానాన్ని పునఃసమీక్షించాలని కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. అనంతరం కొత్త ఇసుక విధానాన్ని నిర్ణయిస్తూ 2016 జనవరి 15న రెండు జీవోలు (జీవో నంబర్లు 19, 20) జారీ చేశారు. అయినప్పటికీ చంద్రబాబు ఇసుక దాహం తీరలేదు. బరితెగించి ఇసుక దోపిడీకి పాల్పడేందుకు మరో విధానాన్ని తీసుకురావాలని చంద్రబాబు భావించారు. 'ఇసుకను ప్రభుత్వం అమ్మదు.. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు.. ఎవరికి వారు ఇసుక రీచ్‌లకు వెళ్లి ఇసుక తవ్వుకోవచ్చు.. అమ్ముకోవచ్చు.. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలుగానీ, ఆంక్షలుగానీ విధించదు' అని చెప్పారు. ఈ మేరకు 2016 మార్చి 4న ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చి దొరికిన చోట దొరికినట్లు దోచుకున్నారు. ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్రబాబు తన చేతిలోకి, మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకువచ్చారు.

మెమో 3066తో కనికట్టు

- 'ఉచిత ఇసుక విధానం' ముసుగులో గత ప్రభుత్వ పెద్దలు మాయాజాలం చేసి, భారీ అవినీతికి పాల్పడ్డారు. కొత్త ఇసుక విధానాన్ని తీసుకువస్తూ టీడీపీ ప్రభుత్వం 2016 మార్చి 4న ప్రత్యేకంగా 'మెమో నంబరు 3066'ను జారీ చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లన్నీ చంద్రబాబు, ఆయన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు హస్తగతం చేసుకున్నారు.
- రాష్ట్రంలో సహజ వనరులకు సంబంధించి, అందులో రాష్ట్ర ఖజానాకు కీలకమైన ఆర్థిక వనరుకు సంబంధించి కేబినెట్ ఆమోదం లేకుండా కేవలం ఒక మెమో ద్వారా కథ నడిపించడం చంద్రబాబు అవినీతికి పరాకాష్టగా నిలిచింది. ఈ మెమో ద్వారా 2016 నుంచి 2019 వరకు అడ్డూ అదుపు లేకుండా ఇసుకను కొల్లగొట్టారు. జిల్లాల వారీగా ఇసుక రీచ్‌లలో ఎవరెవరు తవ్వుకోవాలో చంద్రబాబు స్వయంగా తన బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎమ్మెల్యేలకు అప్పగించారు.
- అప్పటి వరకు కూలీలతో ఇసుక తవ్వకాలు సాగుతుండగా.. ఒక్కసారిగా భారీ యంత్రాలను ఇసుక తవ్వకాల కోసం తీసుకువచ్చారు. ఇతరులు ఎవరూ ఆ ఇసుక రీచ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా కట్టడి చేశారు. చంద్రబాబు ముఠా రోజూ వేల లారీల్లో లక్షల టన్నుల ఇసుకను తవ్వేసి.. అమ్ముకోసాగింది. రాష్ట్రంలో నదుల్లో అందుబాటులో ఉన్న ఇసుక ఎంత.. రోజుకు ఎంత ఇసుక తవ్వుతున్నారు.. ఎంతకు అమ్ముతున్నారు.. ఎన్ని వేల లారీల ఇసుక రోజూ రాష్ట్రం దాటుతోందన్న లెక్కలకు అంతూపొంతూ లేకుండా పోయింది.
- శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం జిల్లా వరకు అంతటా యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. ఇసుకదోపిడీ కుట్రకు చంద్రబాబు సూత్రధారి కాగా, ఈ కుట్రలో అప్పటి గనుల శాఖ మంత్రి పీతల సుజాత, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోపాటు మరికొందరు ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించారు.
- అక్రమ ఇసుక తవ్వకాలను ప్రశ్నించినందుకు తహసీల్దార్ వనజాక్షిని టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జుట్టు పట్టుకుని మరీ దాడికి పాల్పడటం అప్పట్లో తీవ్రంగా చర్చనీయాంశమైంది. ఇది పచ్చ ముఠాల బరితెగింపునకు నిదర్శనం. అంతగా తహసీల్దార్‌పై దాడికి పాల్పడిన తన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను అప్పటి సీఎం చంద్రబాబు సమర్థించడం విస్మయ పరిచింది. తమ ఇసుక దోపిడీకి అడ్డు వస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని స్పష్టమైన సందేశం ఇచ్చేందుకే చంద్రబాబు అలా వ్యవహరించారు.

నిర్భీతిగా నిబంధనలు బేఖాతరు

వేల కోట్ల రూపాయల ఇసుక దందా కోసం చంద్రబాబు అన్ని నిబంధనలను నిర్భీతిగా ఉల్లంఘించారు. కేవలం ఒక 'మెమో'తో ఇసుక దోపిడీకి పాల్పడటం ఆయన కుతంత్రానికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడే రాష్ట్రాల్లో ఇసుక తవ్వకాల కోసం విధానాలు రూపొందించాలి. ఆ మేరకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి. దాంతోపాటు మరో రెండు విధానాలు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా ఈ మూడింటిలో ఏదైనా ఒకటి కచ్చితంగా పాటించాలి.

- ఇసుక తవ్వకాల కోసం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ రూపొందించిన బిజినెస్ రూల్స్ (మార్గదర్శకాలు) అనుసరించాలి.
- అంతకంటే మెరుగైన విధానం రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే ఆమేరకు ఆర్థిక శాఖ ఆమోదం పొందాలి.
- ఓ విధానాన్ని రూపొందించి అందుకు కేబినెట్ ఆమోదం పొందాలి.

కానీ చంద్రబాబు ప్రభుత్వం మోసపూరితంగా తీసుకువచ్చిన 'ఇసుక విధానం' కోసం ఈ మూడు విధానాల్లో ఏ ఒక్కటీ పాటించ లేదు. అంటే జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను పాటించ లేదు. కొత్త విధానం కోసం ఆర్థిక శాఖ ఆమోదం తీసుకోలేదు. అప్పటి కేబినెట్‌లో కూడా బిల్లు ప్రవేశపెట్టి చర్చించి ఆమోదించ లేదు.


టీడీపీ పెద్దల జేబులోకి రూ.10 వేల కోట్లు

2016 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ పెద్దలు సాగించిన ఇసుక దోపిడీ విలువ ఎంతన్నది నిగ్గు తేల్చడం గనుల శాఖ అధికారులకే అంతుపట్టడం లేదు. గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఇసుక తవ్వకాల ద్వారా ఖజానాకు నాలుగు రకాల ఆదాయం రావాలి. సీనరేజీ, కన్సిడరేషన్ చార్జీలు, డిస్ట్రిక్ట్ మైన్స్ ఫండ్, మెరిట్ ఫీజు చెల్లించాలి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్‌మార్గదర్శకాలను పాటిస్తూ కొత్త ఇసుక విధానాన్ని తీసుకువచ్చింది. ఆ ప్రకారం 2020 నుంచి 2022 వరకు రాష్ట్ర ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ ప్రకారం టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2019 వరకు కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు రావల్సి ఉంటుందని గనుల శాఖ అంచనా వేసింది. అంటే చంద్రబాబు 'ఉచిత ఇసుక' అనే మోసపూరిత విధానంతో ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్లు గండిపడింది. ఇక రాష్ట్రంలో యథేచ్ఛగా తవ్విన ఇసుక ఎంతన్న అంచనాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. 2016 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఠా రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఇసుకను తవ్వి అమ్మేసుకుందన్నది విస్మయం కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పక్కా ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో సీఐడీ తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.


అడ్డగోలుగా దోచేశారు..

ఇసుక దోపిడీపై 2019 ఏప్రిల్ 4న తేల్చి చెప్పిన ఎన్జీటీ

- ఉచిత ఇసుక విధానంతో విజృంభించిన స్మగ్లర్లు
- చంద్రబాబు అక్రమ నివాసానికి కూతవేటు దూరంలోనే తవ్వకాలు
- ప్రకాశం బ్యారేజీ జల విస్తరణ ప్రాంతంలో ఎనిమిది చోట్ల ప్రొక్లెయిన్‌లతో తవ్వకాలు
- రోజూ 2,500 ట్రక్కుల్లో 34 వేల టన్నుల ఇసుక తరలింపు
- ఒక్కో ట్రక్కుకు రూ.5 వేల చొప్పున రూ.1.25 కోట్లు అక్రమ ఆర్జన
- ఆ ఎనిమిది రీచ్‌ల ద్వారానే టీడీపీ పెద్దల జేబులోకి ఏటా రూ.450 కోట్లు
- ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని వేల కోట్లో!
- తక్షణమే తవ్వకాలను ఆపేయాలని ప్రభుత్వానికి ఎన్జీటీ అల్టిమేటం
- పర్యావరణానికి విఘాతం కలిగించినందుకు రూ.వంద కోట్లు జరిమానా
- స్మగ్లర్ల నుంచే ఈ జరిమానా వసూలు చేయాలని స్పష్టీకరణ


In Original Application 110(THC) of 2012, Threat to life arising out of coal mining in south Garo Hills district Vs. State of Meghalaya & Ors. (supra), this Tribunal held the State of Meghalaya liable to deposit a sum of Rs. 100 Crores with CPCB for inaction in preventing illegal rat hole mining. Damage in the present case is of much higher magnitude. Pending further consideration in the light of reports from CPCB and the Chief Secretary, Andhra Pradesh, we direct the State of Andhra Pradesh to deposit an interim amount of Rs. 100 crores with the CPCB within one month from today which may be recovered from the polluters and the persons responsible for illegal mining or the colluding erring officers. Interest @12% will accrue after one month. The amount is to be spent for restoration of the environment.

The Chief Secretary may also prepare a report about the particulars of the licences granted for sand mining in the whole State of Andhra Pradesh and estimated amount of sand


7. The extent of mining as per report of the State PCB is 2,500 trucks per day. More than 34,000 metric tons of sand is extracted daily. The value of sand extracted even @ Rs. 5,000 per truck is Rs. 1.25 crores per day i.e. about Rs. 450/- crores per year only at the location in question. According to Mr. Sravan Kumar, Advocate, present before the Tribunal, who was counsel in another matter on the same subject matter i.e.

ప్రకాశం బ్యారేజీ జల విస్తరణ ప్రాంతంలో 8 రీచ్‌లలోనే ఇసుక అక్రమ రవాణా ద్వారా ఏడాదికి రూ.450 కోట్లు దోచేశారని పేర్కొన్న ఎన్‌జీటీ నివేదిక

అక్రమంగా ఇసుక తవ్వకుండా పర్యావరణాన్ని చావుదెబ్బ తీసినందుకు ప్రభుత్వానికి రూ.100 కోట్లు జరిమానా విధిస్తూ ఎన్‌జీటీ ఇచ్చిన ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో నిబంధనలను ఉల్లంఘించి, జీవనదులను విధ్వంసం చేసి.. పర్యావరణాన్ని చావుదెబ్బ తీస్తూ అడ్డగోలుగా యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగిందని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తేల్చి చెప్పింది. కృష్ణా నదీ గర్భంలో ప్రకాశం బ్యారేజీ జల విస్తరణ ప్రాంతంలో అప్పటి సీఎం చంద్రబాబు నివాసముంటున్న అక్రమ కట్టడానికి కూత వేటు దూరంలో ప్రొక్లెయినర్లతో భారీ ఎత్తున ఇసుకను తవ్వి.. వందలాది ట్రక్కులు, లారీలు, ట్రాక్టర్లలో ఇసుకను స్మగ్లర్లు తరలిస్తున్నా ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించిందని మండిపడింది. ఈ మేరకు 2019 ఏప్రిల్ 4న స్పష్టం చేసింది. టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని 2016 మార్చి 4 నుంచి అమల్లోకి తెచ్చింది. ఆ తర్వాత ఇసుక స్మగ్లర్లు విజృంభించారు. అప్పటి నుంచి ఒక్క ప్రకాశం బ్యారేజీ జల విస్తరణ ప్రాంతంలో ఎనిమిది చోట్ల రోజూ 34 వేల టన్నుల ఇసుకను ప్రొక్లెయిన్‌లతో తవ్వి 2,500 ట్రక్కుల్లో తరలించి.. ఒక్కో ట్రక్కు ఇసుకను కనీసం రూ.5 వేల చొప్పున విక్రయించి రూ.1.25 కోట్ల చొప్పున ఏడాదికి రూ.450 కోట్లను ఇసుక స్మగ్లర్ల ముఠా ఆర్జించిందని ఎన్జీటీ తేల్చింది. శ్రవణ్ కుమార్ అనే న్యాయవాది వేరే కేసులో రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా ఏడాదికి రూ.పది వేల కోట్లను స్మగ్లర్లు సంపాదిస్తున్నారని చెప్పడాన్ని ఎన్జీటీ ఎత్తిచూపింది. అక్రమంగా ఇసుకను తవ్వడం ద్వారా పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిందని.. అందుకు రూ.వంద కోట్ల జరిమానాగా చెల్లించాలని గత ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ రూ.100 కోట్లను ఇసుక స్మగ్లర్ల నుంచే వసూలు చేయాలంటూ 2019 ఏప్రిల్ 4న పేర్కొంది. అప్పట్లో అధికారంలో ఉన్నది టీడీపీ సర్కారే. ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలోనే 8 చోట్ల అక్రమంగా ఇసుకను తవ్వి, తరలించి, విక్రయించి ఏడాదికి రూ.450 కోట్లను ఇసుక స్మగ్లర్లు దోచేస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి, పెన్నా, తుంగభద్ర, వంశధార, నాగావళి, చిత్రావతి సహా జీవనదులు, వాగులు, వంకల్లో ఇసుకను అడ్డగోలుగా దోచేయడం ద్వారా ఇంకెన్ని రూ.వేల కోట్లు దోచుకొని ఉంటారో అంచనా వేసుకోవచ్చు. ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో కృష్ణా నది గర్భంలో అక్రమంగా ప్రొక్లెయిన్‌లతో ఇసుకను తవ్వి, తరలించడం ద్వారా పర్యావరణానికి విఘాతం కలుగుతోందంటూ 2016లో ఎన్జీటీలో రైతులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎన్జీటీ.. తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలను ఆపేయాలని ఆదేశిస్తూ 2017 ఫిబ్రవరి 23న ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. కానీ.. ఎన్జీటీ ఆదేశాలను తుంగలో తొక్కిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలకు దన్నుగా నిలిచింది. ఇదే అంశాన్ని రైతులు మరోసారి ఎన్జీటీ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో.. కృష్ణా నది గర్భంలో అక్రమ ఇసుక తవ్వకాలను నిగ్గు తేల్చాలని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ), రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లను 2018 డిసెంబర్ 21న ఎన్జీటీ ఆదేశించింది. సీపీసీబీ, పీసీబీలకు చెందిన ఏడుగురు అధికారులతో విచారణ కమిటీని నియమించింది.

దోపిడీ గుట్టు రట్టు చేసిన కమిటీ

ఎన్జీటీ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ.. చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ కట్టడానికి కూత వేటు దూరంలో కృష్ణా నది గర్భంలో ఇసుకను తవ్వుతున్న ప్రాంతంతోసహా ఎగువన మరో ఏడు రీచ్‌లను 2019 జనవరి 17, 18న క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసింది. ఆ తనిఖీలో వెల్లడైన అంశాల ఆధారంగా 2019 జనవరి 21న ఎన్జీటీకి నివేదిక ఇచ్చింది. నివేదికలో ప్రధానాంశాలు..


- ప్రకాశం బ్యారేజీ జల విస్తరణ ప్రాంతంలో కృష్ణా నది గర్భంలో అనుమతి లేకుండా.. నదీ పరిరక్షణ చట్టం, పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది చోట్ల భారీ ప్రొక్లెయిన్‌లు, మర పడవల ద్వారా రోజుకు సుమారు 34,650 టన్నుల ఇసుకను తవ్వుతున్నారు. ఇలా తవ్విన ఇసుకను రోజూ 2,500 ట్రక్కులు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ట్రక్కు ఇసుకను కనీసం రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారు. అంటే రోజుకు ఇసుక అక్రమ అమ్మకాలతో రూ.1.25 కోట్లు ఆర్జిస్తున్నారు. ఏడాదికి ఈ 8 రీచ్‌ల నుంచే రూ.450 కోట్ల చొప్పున కొల్లగొట్టారు. ప్రకాశం బ్యారేజ్ జల విస్తరణ ప్రాంతంలో అడ్డగోలుగా ఇసుకను తవ్వేయడం వల్ల జీవనది కృష్ణా విధ్వంసమైంది. కృష్ణా నది గర్భంలో 25 మీటర్ల లోతు వరకు ఇసుకను తవ్వడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. అందువల్ల ప్రవాహ దిశ మారే అవకాశం ఉంది. వరద గట్లు, భవానీ ద్వీపం దెబ్బతిన్నాయి.
- ఈ నివేదికను సమగ్రంగా పరిశీలించిన ఎన్జీటీ.. ఇసుక స్మగ్లర్లకు దన్నుగా నిలిచిన అప్పటి టీడీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. రూ.వంద కోట్లను జరిమానాగా విధించింది.
- ఇసుక దందా గురించి 2016 నుంచి హిందూ వంటి జాతీయ పత్రికలతోపాటు టీవీ చానెళ్లు వరుస కథనాలను ప్రసారం చేయడాన్ని ఎన్జీటీ తన తీర్పులో ప్రస్తావించింది. ఇసుక స్మగ్లర్లు తవ్వేసిన గుంతల్లో పడి.. ఇష్టారాజ్యంగా ట్రక్కులు నడపడం వల్ల వాటి కింది పడి 14 మంది చనిపోవడాన్ని ఎత్తిచూపింది. ఇసుక స్మగ్లర్లు అడ్డగోలుగా దోచేస్తున్నా.. దానికి అడ్డుకట్ట వేయకుండా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడంలో ఔచిత్యం ఏమిటని చంద్రబాబు సర్కార్‌ను నిలదీసింది.

బాబు జమానాలో లెక్కలేనన్ని ఇసుక అక్రమాలు

చంద్రబాబు జమానాలో తవ్వినకొద్దీ లెక్కలేనన్ని ఇసుక అక్రమాలు బయటపడ్డాయి. చంద్రబాబు, లోకేశ్ కనుసన్నల్లో అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు సాగించి, ఇసుకను తరలించింది. అప్పటి టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులైన దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నక్కా ఆనందబాబు, జవహర్, చింతమనేని ప్రభాకర్, కూన రవికుమార్, పెందుర్తి వెంకటేష్, బూరుగుపల్లి శేషారావు, ముళ్లపూడి బాపిరాజు, శ్రావణ్ కుమార్, తంగిరాల సౌమ్య, కొమ్మాలపాటి శ్రీధర్, శ్రీరాం తాతయ్య, ఆలపాటి రాజా తదితరులు ఇసుక అక్రమాల్లో చెలరేగిపోయారు. ఈ ముఠా అంతా ఇసుక ద్వారా దోపిడి చేసిన మొత్తంలో నెలవారీ కమీషన్లు ఏకంగా రూ.500 కోట్లు లోకేశ్‌కు ముట్టజెప్పేవారనేది బహిరంగ రహస్యం. గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదులతోపాటు తమ్మిలేరు తదితర నదులు, ఏరుల్లో సైతం అడ్డు అదుపులేకుండా పెద్ద ఎత్తున ఇసుక దందా సాగించారు. స్వయం సహాయక బృందాల పేరుతో టీడీపీ పెద్దల కనుసన్నల్లోనే పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇసుక దందా నడిపారు. ఇసుక విధానంపై ఇష్టానుసారంగా తమకు అనుకూలంగా నిర్ణయాలు మార్చుకుంటూ దాదాపు 19 సార్లు జీఓలు ఇచ్చారు. వాస్తవానికి ఉచితంగా ఇసుక ఎవరికీ అందలేదు. అధిక ధర చెల్లించి కొనుక్కోవాల్సిన దుస్థితి కల్పించారు. పొరుగు రాష్ట్రాలకు సైతం పెద్ద ఎత్తున ఇసుకను లారీల్లో తరలించారు. అడ్డుకున్న వారిపై టీడీపీ నేతలు రెచ్చిపోయి దాడులు చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం బాధితులనే తప్పు పట్టడం అప్పట్లో సర్వత్రా చర్చనీయాంశమైంది.

ముసుగు దోపిడీ

- ఎస్‌హెచ్‌జీలకు ఇసుక రీచ్‌ల బాధ్యతలు అప్పగించిన గత సర్కార్
- మహిళా సంఘాల పేరుతో కొల్లగొట్టిన టీడీపీ నేతలు
- ఒకే బిల్లుపై వందల టన్నులు తరలించి అక్రమంగా విక్రయాలు
- ఉచితమంటూ దోపిడీకి రాచబాట వేసిన బాబు.. రూ.47.50 కోట్లు రీఫండ్ చేయకుండా ఖజానాకు కన్నం
- ఆ అక్రమాలను కడిగేసిన 'కాగ్'


However, releases and expenditure statement of Society for Elimination of Rural Poverty[15] for the year 2016-17 revealed that, funds of ₹35.52 crore were provided by way of supplementary budget and an expenditure of ₹13.57 crore was incurred for refunding the advances taken earlier, leaving an unspent balance of ₹21.95 crore. Providing funds by way of Supplementary budget (February 2017) for implementing the scheme after closure of the scheme (March 2016) and impounding of funds (₹25.55 crore) available as at March 2016 was unjustified. Details of refund of unspent balance of ₹47.50 crore[16] were not furnished.

2.5.2 School Education (Grant No.XII)

This Grant is administered by the School Education Department. The allocation of budget to the Department constituted 9.12 per cent of the total State budget (₹1,93,671.63 crore) during the

ఇసుక బుకింగ్ కోసం చెల్లించిన రూ.47.50 కోట్లను రీఫండ్ చేయకుండా ప్రభుత్వం లెక్కలు చెప్పలేదని తేల్చిన కాగ్ నివేదిక

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు మహిళా సంఘాల ముసుగులో అడ్డగోలుగా ఇసుకను తవ్వేసి ఖజానాకు కన్నం వేశారు. ఒకే ఇసుక బిల్లుపై అక్రమంగా తరలించిన వేలాది టన్నులను అధిక ధరలకు విక్రయించి దోచుకున్నారు. మహిళ సంఘాల పేరుతో ఇసుక దందాపై తీవ్ర విమర్శలు రావడంతో 2016 మార్చి 4న అప్పటి సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానం పేరుతో దోపిడీకి టీడీపీ నేతలకు రాచబాట వేశారు. అప్పటివరకు ఇసుక సరఫరా కోసం బుకింగ్ చేసుకుని డబ్బులు కట్టిన వారికి రూ.47.50 కోట్లను వెనక్కి చెల్లించలేదు. ఆ డబ్బులకు లెక్కలు చెప్పలేక గత ప్రభుత్వం నీళ్లు నమిలిందని 2018లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక పేర్కొంటూ టీడీపీ నేతల ఇసుక దోపిడీని ఎండగట్టింది.

ఎల్లో గ్యాంగ్ కనుసన్నల్లో రీచ్‌లు

మహిళా సాధికారత పేరుతో రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల నిర్వహణ, అమ్మకాలను స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు అప్పగిస్తూ 2014లో గత సర్కారు ఇసుక విధానాన్ని ప్రకటించింది. ఇసుక విక్రయాల కోసం రాష్ట్రస్థాయిలో సెర్ప్ ఆధ్వర్యంలో, జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ శాండ్ మైనింగ్ ఫెసిలిటీ ఏజెన్సీస్‌లను ఏర్పాటు చేశారు. వాటి పర్యవేక్షణలో ఇసుక అమ్మకాలకు పోర్టల్ ఏర్పాటైంది. ఇసుక కోసం పోర్టల్‌లో బుక్ చేసుకుని ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తే మహిళా సంఘాలు ఇసుకను సరఫరా చేసేలా రూపొందించిన విధానం కాగితాలకే పరిమితమైంది. మహిళా సంఘాల ముసుగులో టీడీపీ నేతలు ఇసుక రీచ్‌లను తమ అధీనంలోకి తీసుకున్నారు. పోర్టల్‌లో ఇసుక కోసం బుక్ చేసుకున్న ఒకే బిల్లుపై వేలాది టన్నులు అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయించారు. దీనిపై విమర్శలు వ్యక్తం కావడంతో 2016 మార్చి 4న దాన్ని రద్దు చేసి ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించారు. అప్పటివరకు ఇసుక కోసం పోర్టల్‌లో బుక్ చేసుకుని సరఫరా చేయని వారికి డబ్బులు రీఫండ్ చేస్తామని పేర్కొంది. ఇందుకోసం 2016–17లో సెర్ప్ రూ.35.52 కోట్లను విడుదల చేయగా రూ.13.57 కోట్లను రీఫండ్ చేశారు. అంటే మిగతా డబ్బులు మిగుల్చుకున్నట్లు స్పష్టమవుతోంది. 2017 ఫిబ్రవరిలో ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి రీఫండ్ చేసేందుకు మరో రూ.25.55 కోట్లను సెర్ప్ విడుదల చేసింది. వాస్తవానికి రీఫండ్ కోసం అప్పటికే విడుదల చేసిన నిధులు మిగిలి ఉండగా మళ్లీ డబ్బులు విడుదల చేయడాన్ని కాగ్ తప్పుబట్టింది. రీఫండ్‌కి సంబంధించి రూ.47.5 కోట్లకు లెక్కలు చెప్పాలని అడిగితే గత సర్కారు నీళ్లు నమిలిందని కాగ్ స్పష్టం చేసింది. దీన్ని బట్టి టీడీపీ నేతలే ఇసుక బుక్ చేసుకుని ఒకే బిల్లుపై వేలాది టన్నుల అక్రమంగా తరలించి డబ్బులు కాజేసినట్లు స్పష్టమవుతోంది.

క్లుప్తంగా...

ఉచిత విద్య, మద్య నిషేధం

ధర్మసమాజ్ పార్టీ మేనిఫెస్టోలో హామీ



కాచిగూడ(హైదరాబాద్): రాష్ట్రంలో మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల జీవితాలలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావడమే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. బర్కత్‌పురాలోని డీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. రాష్ట్రంలో డీఎస్పీ అధికారంలోకి వస్తే ఏటా రూ.33 వేల కోట్ల బడ్జెట్‌తో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తామని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తామని, భూమిలేని నిరుపేదలకు ఎకరం భూమి పంపిణీ చేస్తామని, ఇండ్లు లేని పేదలందరికి నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఏటా రూ.33 వేల కోట్ల బడ్జెట్‌తో ఆధునిక వైద్య వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, ఆరోగ్య బీమా ద్వారా ఉచిత వైద్యం అందిస్తామని చెప్పారు. రైతు కూలీలకు చిన్న, సన్నకారు కౌలు రైతులకు ప్రతీ నెల రూ.5 వేలు బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న 16 మంది అభ్యర్థులతో 3వ జాబితాను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ప్రకటించిన 92 మంది అభ్యర్థులకు బీ ఫాంలను ఆయన అందజేశారు.

భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థులు వీరే

సాక్షి, హైదరాబాద్: భారత చైతన్య యువజన పార్టీ తెలంగాణ అభ్యర్థుల మొదటి జాబితాను ప్రకటించింది. గ్రేటర్ పరిధిలో తమ అభ్యర్థులుగా కుత్బుల్లాపూర్ నుంచి కాత్రమ్ మంజులతారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఓరుగంటి వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ నుంచి పన్నీర్ మోహన్‌రాజు, గోషామహల్ నుంచి మేకల వివేక్‌యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వల్సాదాస్ చంద్రశేఖర్‌గౌడ్ పోటీ చేయనున్నట్లు పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.రాంచందర్‌రావు కోరారు. దాదాపు లక్షమంది రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు ఉచితంగా కల్పించాలని సింగరేణి యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కార్మిక నాయకులకు, సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఫలితం శూన్యమని గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

ఈసారైనా కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఉందా లేదా?

కోమటిరెడ్డిపై జూలకంటి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారైనా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఉందా లేదా? అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకునేవారెవరూ కోమటిరెడ్డిలా మాట్లాడరని పేర్కొన్నారు. కమ్యూనిస్టులకు ఇచ్చే నాలుగు స్థానాల్లో ఓడిపోతారని, వారికి ఓట్లే వేయరంటూ కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలను జూలకంటి తప్పు పట్టారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉండి ఆ పార్టీ జాతీయ నాయకత్వాన్ని, రేవంత్‌రెడ్డిని దుమ్మెత్తిపోసింది ఇదే కోమటిరెడ్డి కాదా... గాంధీభవన్ మెట్లు ఎక్కనని చేసిన శపథాలు ఏమయ్యాయి''అని నిలదీశారు. అమెరికాలో ఉండి మునుగోడు ఉప ఎన్నికల్లో తన తమ్ముడు రాజగోపాల్‌రెడ్డి పేరు మీద బీజేపీకి ఓటేయమని చెప్పావు కదా? ఇవన్నీ ప్రజలు మర్చిపోయారని అనుకుంటున్నారా?'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి జూలకంటి ఒక ప్రకటన జారీ చేశారు.

లక్షన్నర కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి!

▶ మొదటి పేజీ తరువాయి

మధ్య సాగుతున్న ఎన్నికల పోరులో ప్రజలు గెలవాలని, తెలంగాణలో దొరల సర్కారును పారదోలి ప్రజల సర్కారును ఏర్పాటు చేస్తామని అన్నారు. కేసీఆర్ దోచుకున్న సొమ్మును వసూలు చేసి తిరిగి ప్రజలకు చెందేలా చూస్తామని హామీ ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ, అంబట్‌పల్లిలలో గురువారం రాహుల్‌గాంధీ పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన అంబట్‌పల్లిలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సదస్సులో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ ఒక్కటే ప్రజల వైపు..

'రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ఎన్నికల పోరు సాగుతోంది. బీజేపీ, ఎంఐఎంలు బీఆర్ఎస్‌కు మద్దతుగా పని చేస్తున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒకవైపు ఉంటే.. కాంగ్రెస్ ఒక్కటే ఒకవైపు, అదీ ప్రజల వైపు పనిచేస్తోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఒక కుటుంబానికే మేలు జరిగింది. ఉద్యోగాలు, పదవులు అన్నీ కేసీఆర్ కుటుంబానికే దక్కాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజలంతా కలలుగన్నారు. కానీ అందుకు భిన్నంగా కుటుంబ పాలనలో రాష్ట్రం బందీ అయ్యింది. తెలంగాణ భవిష్యత్‌కు మహిళలే మార్గదర్శకం..కానీ కేసీఆర్ కుటుంబ దోపిడీలో మహిళలే ఎక్కువగా నష్టపోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. రాష్ట్రం, కుటుంబం కోసం కష్టపడే మహిళలకు న్యాయం జరిగేలా, నెలకు రూ.4 వేలు ఆదా చేసుకునేలా పథకాలు అమల్లోకి తెస్తాం. సగటున ఒక్కో మహిళకు నెలకు రూ.1,000 ఖర్చు తగ్గేలా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తాం. వీటితో పాటు ప్రతి నెలా మహిళ ఖాతాలో రూ.2,500 జమ చేస్తాం. రైతు భరోసా కింద కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా ఎకరానికి రూ.15 వేలు ఇస్తుంది. వృద్ధులు, వితంతువులకు ప్రతినెలా రూ.4 వేల పింఛను ఇస్తుంది..'అని రాహుల్ చెప్పారు.



గురువారం అంబట్‌పల్లిలో జరిగిన మహిళా సాధికారత సదస్సులో రాహుల్ గాంధీ

మేడిగడ్డ బ్యారేజీ పరిశీలించిన రాహుల్

అంబట్‌పల్లిలోని సభాస్థలి నుంచి రాహుల్‌గాంధీ నేరుగా కారులో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లారు. ఆయన వెంట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఉన్నారు. కాగా రాహుల్ కాలినడకన వెళ్లి బ్యారేజీ 7వ బ్లాక్‌లో పియర్లు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కాగా కొంతమంది స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా బ్యారేజీ సందర్శనకు ఆయన వెంట వెళ్లడానికి ప్రయత్నించారు. పోలీసులు అంబట్‌పల్లి వద్ద వారిని అడ్డుకున్నారు. దీంతో వివిధ గ్రామాల సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు సహా కాంగ్రెస్ కార్యకర్తలు సుమారు అరగంట పాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో బ్యారేజీ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు ప్రత్యేక బలగాల సాయంతో వారిని వెనక్కి పంపించారు. కాగా బ్యారేజీ పరిశీలన అనంతరం రాహుల్ హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.

కాళేశ్వరం కరప్షన్ రావు: రాహుల్ ట్వీట్

'కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీని నేను సందర్శించా. నాసిరకం నిర్మాణం కారణంగా పలు పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయి. పలు పిల్లర్లు కుంగిపోతున్నట్లు కూడా గమనించా. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్, ఆయన కుటుంబం తమ వ్యక్తిగత ఏటీఎంగా వాడుకుంటున్నారు..'అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కింద క్యాప్షన్‌లో కాళేశ్వరం కరప్షన్ రావు, బైబై కేసీఆర్ అంటూ హ్యాష్‌ట్యాగ్ పెట్టారు.

ఐటీ దాడులు కేసీఆరే చేయిస్తున్నారు..

మేడిగడ్డ 25వ పిల్లర్ నుంచి 1వ పిల్లర్ వరకు పూర్తిగా కుంగిపోయిందని చెప్పారు. పిల్లర్లు రెండున్నర అడుగుల మేర కుంగిపోయినట్లు స్వయంగా అధికారులే చెబుతున్నారన్నారు. ప్రాజెక్టును నిర్మించిన ఎల్‌అండ్‌టీ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని రేవంత్ డిమాండ్ చేశారు. మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి ఓడిపోతారని బీఆర్ఎస్‌కు స్పష్టత వచ్చిందని, అందుకే కేంద్రం సహకారంతో కాంగ్రెస్ నాయకులపై కేసీఆర్ ఐటీ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు.

సగం ప్రాజెక్టును కూల్చాల్సిన పరిస్థితి వచ్చింది

సాక్షి, హైదరాబాద్: కోట్లాది రూపాయల అవినీతి కారణంగా నాసిరకం పనులతో కాళేశ్వరంలోని మేడిగడ్డ సగం ప్రాజెక్టును కూల్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ బలి తీసుకుంటే.. ఇప్పుడు ఆ ప్రాజెక్టే కేసీఆర్‌ను బలి తీసుకుంటుందని అన్నారు. మూడురోజుల పర్యటన ముగించుకుని ఢిల్లీ వెళ్తున్న రాహుల్‌గాంధీకి శంషాబాద్ విమానాశ్రయంలో వీడ్కోలు పలికిన అనంతరం రేవంత్ మీడియాతో మాట్లాడారు. గుడినీ, గుడిలో లింగాన్నీ దిగమింగిన కేసీఆర్‌ను తెలంగాణ సమాజం శిక్షించాలన్నారు. కేసీఆర్ పాపం పండి, అవినీతి కుండ పగిలిందని, మేడిగడ్డ కుంగి లక్ష కోట్ల ప్రజాధనం గోదావరిలో పోసిన పన్నీరైందని వ్యాఖ్యానించారు. అవినీతి బీఆర్ఎస్‌ను బీజేపీ కాపాడుతోందన్నారు. కేసీఆర్ అంటే ఇప్పుడు 'కాళేశ్వరం కరప్షన్ రావు'అని సంబోధించుకునే పరిస్థితి వచ్చిందని రేవంత్ ఎద్దేవా చేశారు.

రూ. 80 వేల కోట్ల 'కాళేశ్వరం'లో రూ. లక్ష కోట్ల దుర్వినియోగమా?

కాంగ్రెస్ నేతలు జ్ఞానం ఉండి మాట్లాడుతున్నారా?

- కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌ది దుష్ప్రచారం: మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- చిన్న లోపాలను పెద్దగా చూపిస్తూ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని మండిపాటు



చేగుంట (తూప్రాన్): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలకు కనీస అవగాహన లేదని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 80 వేల కోట్లు ఖర్చు జరిగితే రూ. లక్ష కోట్లు దుర్వినియోగం చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ఎలా సాధ్యపడుతుందని, కాంగ్రెస్ నేతలు జ్ఞానం ఉండి మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేసి గెలవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, ప్రాజెక్టు మునిగిపోతే రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తీరు దుష్ట రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు.

చిన్న లోపాలు సహజమే...

కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నచిన్న లోపాలను పెద్దవిగా చూపించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తంటాలు పడుతున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కొత్త ఇంటి నిర్మాణం చేసుకుంటేనే చిన్న లోపాలు ఏర్పడటం సహజమని, పెద్ద డ్యాం నిర్మిస్తే చిన్న లోపాలు జరుగుతాయని, వాటిని కాంగ్రెస్ నాయకులు పెద్దగా చూపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే మల్లన్నసాగర్‌లో 3 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 12 టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 10 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని గుర్తుచేశారు. వానలు ఆలస్యంగా వస్తే దుబ్బాక నియోజకవర్గంలో రామాయంపేట కాల్వకు నీటిని వదిలి రైతులకు సహకరించిన విషయాన్ని అందరూ గుర్తుచేసుకోవాలన్నారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలంగాణ ప్రచారంలో తమ రాష్ట్రంలో ఐదు గంటల కరెంటు ఇస్తున్నట్లు చెప్పారని, రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంటు చాలని అంటున్నారని విమర్శించారు. రైతులకు మేలు చేసే బీఆర్ఎస్ కావాలో.. రైతులను ఆగం చేసే కాంగ్రెస్ కావాలో గ్రామాల్లో ప్రజలు చర్చించుకోవాలని కోరారు. రూ. 14 వేల కోట్ల రుణమాఫీ చేశామని, మరో రూ. 4 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు.

సన్న బియ్యం అందుకే...

రేషన్ షాపుల్లో అందిస్తున్న దొడ్డు బియ్యాన్ని కొందరు అమ్ముకుంటున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. పేద ప్రజలంతా రేషన్ బియ్యం తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

కూనంనేని పోటీకి దూరంగా ఉండాలి

- కొత్తగూడెంలో సాబీర్ పాషాకు అవకాశం ఇవ్వాలని సీపీఐ మున్సిపల్ కౌన్సిలర్ల డిమాండ్
- మా పార్టీ వారిని ఎవరో మభ్యపెట్టారు: కూనంనేని



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పొత్తుల విషయంలో కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘంగా సాగదీస్తున్నా సీపీఐ తరఫున పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గట్టిగా కౌంటర్ ఇవ్వడం లేదని, కాంగ్రెస్‌తో పొత్తు కుదిరినా, లేకున్నా ఆయన కొత్తగూడెం నుంచి పోటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీకి చెందిన 8 మంది కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు సమావేశమై.. అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి కూనంనేని పోటీ చేయకూడదని తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. ఆయనకు బదులుగా ఈ సారి బీసీ వర్గానికి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాకు పోటీ చేసే అవకాశం కల్పించాల ని డిమాండ్ చేశారు. కూనంనేని పోటీలో ఉండాలని నిర్ణయిస్తే తాము పార్టీకి రాజీనామా చేస్తామని తేల్చిచెప్పారు. ఈ విషయమై 'సాక్షి' కూనంనేనిని సంప్రదించగా.. తమ పార్టీకి చెందిన వారిని ఎవరో మభ్యపెట్టారని తెలిపారు. ఇక కాంగ్రెస్‌తో పొత్తు గురించి మాట్లాడుతూ.. కేవలం ఒక్క సీటు (కొత్తగూడెం) ఇస్తే ఒప్పుకునేది లేదని, ఈ అంశంపై రాష్ట్ర కార్యవర్గంలో చర్చిస్తామని తెలిపారు.

తెలంగాణలో ఇక కాంగ్రెస్‌దే అధికారం

- మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్
- పార్టీ గ్రాఫ్ రోజురోజుకూ పెరుగుతోందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ గ్రాఫ్ రోజురోజుకూ పెరుగుతోందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఇక్కడి గాంధీభవన్‌లో ఆయన కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటనతో తెలంగాణ ప్రజలకు చాలా నిజాలు తెలిసొచ్చాయని, కాళేశ్వరం సందర్శన తరువాత ఆ ప్రాజెక్టులోని అవినీతి, అక్రమాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను పెంచారని ఆరోపించారు. కాంగ్రెస్ మొదలుపెట్టిన అంబేడ్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును బీఆర్ఎస్ కాళేశ్వరంగా మార్చి, ఆ పేరుతో ఓట్లు దండుకుందని విమర్శించారు. కాళేశ్వరంపై బీజేపీ విమర్శలు చేయడమేకానీ అవినీతి, అక్రమాలపై ఎలాంటి విచారణ చేపట్టడం లేదన్నారు. రేణుకా చౌదరి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ కాళేశ్వరం పర్యటన కేవలం రాజకీయ స్వలాభం కోసం కాదని, ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలను ప్రజలకు తెలియజేయడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

అవినీతి పాలన అంతమొందించడమే లక్ష్యం

- రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ వ్యవస్థలను నాశనం చేశారు
- ఖర్గేతో సమావేశం అనంతరం మీడియాతో వివేక్ వెంకటస్వామి



సాక్షి, న్యూఢిల్లీ: బంగారు తెలంగాణ అని చెప్పిన కేసీఆర్..రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసి కుటుంబ, అవినీతి, రాక్షస పాలనకు తెరలేపారని మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. అవినీతి పాలనను అంతమొందించడమే లక్ష్యంగా తాను తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. కేసీఆర్ అవినీతిని అడ్డుకునే శక్తి ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. గురువారం ఢిల్లీలో సతీమణి సరోజ, కుమారుడు వంశీలతో కలసి వివేక్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నాలుగు సంవత్సరాలుగా బీజేపీలో ఉంటూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశానని తెలిపారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ వల్ల చెన్నూర్, మంథని, మంచిర్యాల నియోజకవర్గాల్లోని లక్షలాది ఎకరాలు నీట మునిగాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కమీషన్లకు ఆశపడి కాళేశ్వరం రీడిజైనింగ్ చేశారని, దీని కారణంగానే ఆ నియోజకవర్గాల్లోని రైతులు నష్టపోయారంటూ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ కాంగ్రెస్‌లోకి రావాలని ఫోన్‌లో కోరడం..మరోపక్క ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్ష మేరకు తిరిగి పార్టీలో చేరానని వివరించారు. ప్రజల ఒత్తిడి మేరకు మరింత మంది ఎంపీలు, సీనియర్ నాయకులు కాంగ్రెస్ గూటికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికల్లో పోటీపై అధిష్టానం సూచన మేరకు నడుచుకుంటానని తెలిపారు. పార్టీ మార్పుపై బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బీజేపీ నాలుగేళ్ల ముందు ఎలా ఉంది... తాను పార్టీలోకి వచ్చిన తర్వాత ఎలా ఉందనేది ఆ పార్టీ నేతలు ఒకసారి పరిశీలించుకుంటే బాగుంటుందని సూచించారు.

గాల్లోకి కుర్చీలు.. మంటల్లో రేవంత్ బ్యానర్లు

ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

టికెట్‌ను రామిరెడ్డికే ఇవ్వాలని ఆందోళన.. గాంధీభవన్‌కు తాళాలు

గన్‌ఫౌండ్రీ, నర్సాపూర్: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకున్నారంటూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గురువారం గాంధీభవన్‌లో ఆందోళన చేపట్టారు. ఇబ్రహీంపట్నం సీటును దండెం రామిరెడ్డికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కుర్చీలు విసిరి రేవంత్‌రెడ్డి బ్యానర్లను కాల్చివేశారు. రేవంత్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని గాంధీభవన్‌కు తాళాలు వేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తున్న వారిని కాదని అడ్డగోలుగా టికెట్లను కేటాయించారని ఆరోపించారు. తనకు సీటు కేటాయించకపోతే రెబల్‌గానైనా పోటీ చేస్తానని స్పష్టం చేశారు.



రేవంత్ రెడ్డి బ్యానర్‌ను తగులబెడుతున్న అసమ్మతి నేతలు

నర్సాపూర్ అభ్యర్థి బీఆర్ఎస్ కోవర్టు

నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని మార్చాలని కోరుతూ గురువారం అసమ్మతి నేతలు గాంధీ భవన్‌లో నిరసన వ్యక్తం చేశారు. రాజిరెడ్డి బీఆర్ఎస్ నాయకులకు కోవర్టుగా పని చేస్తున్నారని, ఆయన్ను మార్చి బీసీ నేతకు ఆ స్థానం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను కలిసి ఫిర్యాదు చేశామని పీసీసీ ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ చెప్పారు.

సిద్ధాంతాలకు కట్టుబడి బీఆర్ఎస్‌లో చేరలేదు

2009లో గెలిచి ఉంటే సీఎం అయ్యే అవకాశం ఉండేది: ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి



వనపర్తిటౌన్: బీఆర్ఎస్ పార్టీలో చేరాల్సిందిగా సీఎం కేసీఆర్ పది సార్లు తనను బతిమాలారని, అయితే కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఆ పార్టీలో చేరలేదని మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి తెలిపారు. సోనియాగాంధీ కుటుంబానికి జీవిత కాలం విధేయుడిగా ఉంటానని, ఆమె పాదాల దగ్గర చనిపోయే భాగ్యం దక్కినా చాలన్నారు. బీఆర్ఎస్‌లో చేరి ఉంటే నిరంజన్‌రెడ్డి కంటే ముందే తాను మంత్రిని అయ్యేవాడినని, కానీ కాంగ్రెస్ కోసం అలాంటి పదవిని ఆశించలేదని స్పష్టం చేశారు. గురువారం వనపర్తిలో జరిగిన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఓడిపోతే సీఎం కేసీఆర్ చనిపోతారని, మంత్రి కేటీఆర్ దిక్కులేని వాడవుతారని ఆయన ఈ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి నిరంజన్‌రెడ్డి ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వపరంగా స్వాధీనం చేసుకుంటామన్నారు. 2009 ఎన్నికల్లో గెలిచి ఉంటే మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి, తాను.. ఇద్దరిలో ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అయ్యేవాళ్లమని.. అదృష్టం ఉంటే అప్పుడు చేజారిన అవకాశం ఇప్పుడు రావచ్చని సీఎం పదవిపై పరోక్షంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో 100 ఎకరాల స్థలంలో ప్రపంచంలోని విగ్రహాల కంటే అతిపెద్ద సోనియాగాంధీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. 50 వేల మందితో వనపర్తిలో నామినేషన్ వేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఒంటరిగానే పోటీ చేస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- 17 స్థానాల్లో బరిలోకి దిగుతాం. రెండ్రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తాం
- రాష్ట్రంలో ఒక్క సీటు కూడా బీజేపీ గెలవొద్దన్నదే మా లక్ష్యం
- సీపీఐ మాతో కలిసొస్తే ఓకే... కాంగ్రెస్‌తో ఆ పార్టీ పొత్తు పెట్టుకున్నా మద్దతిస్తాం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ప్రస్తుతం 17 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో బీజేపీ ఒక్క స్థానంలోనూ గెలవకూడదనే లక్ష్యంతో ఈ ఎన్నికల్లో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. గురువారం ఎంబీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు ప్రయత్నించామని, రెండు స్థానాల్లో పోటీ చేయాలనుకున్నప్పటికీ ఆ రెండు స్థానాలేమిటో కాంగ్రెస్ చెప్పలేదన్నారు. కేవలం బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్‌తో పొత్తు ప్రయత్నాలు చేసినట్లు ఆయన చెప్పారు. ఆ పార్టీ వైఖరి వల్లే పొత్తు నుంచి తప్పుకొని ఒంటరిగా పోటీకి నిర్ణయం తీసుకున్నామని తమ్మినేని తెలిపారు. తొలుత 17 స్థానాల్లో పోటీకి నిర్ణయం తీసుకున్నప్పటికీ... ఈ సంఖ్య పెరుగుతుందని, పార్టీ కార్యకర్తలు, బలం ఉన్న చోట పోటీకి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.



ఐక్య పోటీపై సీపీఐ వైఖరి చెప్పలేదు..

ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా పోటీ చేయాలని నిర్ణయించినప్పటికీ సీపీఐ వైఖరి చెప్పలేదని తమ్మినేని పేర్కొన్నారు. అయినప్పటికీ సీపీఐకి మద్దతిస్తామని, ఒకవేళ కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగించి సీపీఐ పోటీ చేసినా ఆ పార్టీకి మద్దతిస్తూ అక్కడ పోటీ చేయబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో సీపీఎం పోటీ చేసే స్థానాల్లో కాకుండా మిగతా చోట్ల బీజేపీని ఓడించే ప్రధాన పార్టీకి మద్దతివ్వాలని తమ కార్యకర్తలకు సూచిస్తామన్నారు. బీజేపీ అభ్యర్థులు బలంగా ఉన్న చోట్ల ఆ తర్వాత స్థానంలో ఉన్న బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్ లేదా ఇతరులెవరున్నా సీపీఎం మద్దతుగా నిలుస్తుందని తమ్మినేని స్పష్టం చేశారు.

17 స్థానాలు ఇవే...

ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా భద్రాచలం (ఎస్టీ), అశ్వారావుపేట (ఎస్టీ), పాలేరు, మధిర (ఎస్సీ), వైరా (ఎస్టీ), ఖమ్మం, సత్తుపల్లి (ఎస్సీ), మిర్యాలగూడ, నల్లగొండ, నకిరేకల్ (ఎస్సీ), భువనగిరి, హుజూర్‌నగర్, కోదాడ, జనగామ, ఇబ్రహీంపట్నం, పటాన్‌చెరు, ముషీరాబాద్ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తమ్మినేని వెల్లడించారు. ఒకట్రెండు రోజుల్లో పార్టీ జిల్లా కార్యదర్శులు, సీనియర్లతో చర్చించిన తర్వాత ఈ సెగ్మెంట్లకు అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. కాగా, ఈ జాబితాలో ముషీరాబాద్ అభ్యర్థిగా సీపీఎం హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దెల దశరథ్ పేరు ఖరారైనట్లు తెలిసింది.

సీపీఎం దారిలో సీపీఐ?

ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగాలని సూత్రప్రాయ నిర్ణయం

- నేడు సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో దీనిపై చర్చ
- ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో అధిక స్థానాల్లో పోటీకి 'లెఫ్ట్'యత్నాలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌తో పొత్తు ప్రయత్నాలు బెడిసికొట్టడంతో ఒంటరిగానే బరిలోకి దిగాలని సీపీఎం నిర్ణయించగా అదే దారిలో నడవాలని సీపీఐ సూత్రప్రాయంగా నిర్ణయించింది. సీపీఐకి కొత్తగూడెం, సీపీఎంకు మిర్యాలగూడ అసెంబ్లీ స్థానాలే ఇస్తామని, అధికారంలోకి వచ్చాక చెరో ఎమ్మెల్సీ ఇస్తామని కాంగ్రెస్ స్పష్టం చేయడంతో వామపక్షాలు భగ్గుమంటున్నాయి. ఐదు సీట్ల నుంచి మూడు... తర్వాత రెండు స్థానాలకు దిగిరాగా ఇప్పుడు చెరొక సీటే ఇస్తామని ప్రకటించడంపై మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగాలని సీపీఎం నిర్ణయించగా సీపీఐ శుక్రవారం జరిగే పార్టీ రాష్ట్ర సమావేశంలో చర్చించి ఒక అభిప్రాయానికి రానుంది. సీపీఎం నిర్ణయానికి అనుగుణంగా ముందుకు సాగాలని సీపీఐ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. సీపీఎం 17 స్థానాలతో మొదటి జాబితా ప్రకటించగా సీపీఐ సైతం అదే స్థాయిలో జాబితా ప్రకటించే అవకాశముంది. నామినేషన్ల గడువు వరకు తుది నిర్ణయం ప్రకటించకుండా తమకు ఆశాభంగం కలిగించిన కాంగ్రెస్‌పై లెఫ్ట్ పార్టీలు గరంగరంగా ఉన్నాయి. ఇది తమను మోసం చేయడమేనని అంటున్నాయి. తమ సత్తా చాటుకోవాలని, పోటీ చేసే అన్నిచోట్లా గణనీయంగా ఓట్లు సంపాదించాలని, ఆ మేరకు కృషి చేయాలని నిర్ణయించుకుంటున్నాయి. సీపీఐ వైఖరి శుక్రవారం వెల్లడైతే వెంటనే ఇరు పార్టీల సంయుక్త సమావేశం జరగనుంది.

45 సీట్లలో ఇరు పార్టీల పోటీ?

బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వామపక్షాలు ఆ మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. సీపీఐ కూడా కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకొని ముందుకు వస్తే, ఈ ఎన్నికల బరిలో వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక కూటమి పోటీలో నిలవనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా సీపీఐ, సీపీఎం కలసి పోటీ చేస్తాయని అంటున్నాయి. ఆ తర్వాత కలిసొచ్చే ఇతర ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో కలసి పోటీలో ఉండాలని ఇరు పార్టీలు భావిస్తున్నాయి. సీపీఐ, సీపీఎం 45కుపైగా స్థానాల్లో పోటీ చేసే అవకాశముంది. మిగిలిన స్థానాల్లో బీజేపీని ఓడించే పార్టీలకు మద్దతు ప్రకటించనున్నాయి.

ఎవరికి ప్రయోజనం?

కాంగ్రెస్‌తో వామపక్షాల పొత్తు చిత్తుకావడం ఎవరికి ప్రయోజనం కలిగిస్తుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. వామపక్షాలకు ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో అధిక బలం ఉండగా మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడా కొంత ఓటుబ్యాంకు ఉంది. అయితే ఇరు పార్టీలు ఎన్నికలకు ఏ నినాదంతో ముందుకు వెళ్తాయోనన్న దానిపై ఏ పార్టీకి లాభం, ఏ పార్టీకి నష్టం జరుగుతుందనేది ఆధారపడనుంది. బీజేపీ పోటీలో లేనిచోట ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలితే అది బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూరుస్తుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అప్పుడు ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ఎక్కువ సీట్లు గెలుస్తామని ఆశిస్తున్న కాంగ్రెస్‌కు కమ్యూనిస్టులు అక్కడ పోటీ చేస్తే కొంత ఇబ్బందికరంగా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. అయితే వామపక్షాలకు అంతగా ఓటు బ్యాంకు లేదని, కాబట్టి తమకు ఎలాంటి నష్టం ఉండదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

45 వన్డే ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా షమీ అవతరించాడు. షమీ ఈ ఘనతను 14 మ్యాచ్‌ల్లోనే అందుకోవడం విశేషం. జహీర్ ఖాన్ (23 మ్యాచ్‌ల్లో 44 వికెట్లు), జవగళ్ శ్రీనాథ్ (34 మ్యాచ్‌ల్లో 44 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును షమీ అధిగమించాడు.

357 వన్డే ప్రపంచకప్‌లో ఇన్నింగ్స్‌లో ఒక్క సెంచరీ లేకుండా అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. పాకిస్తాన్ (348/8; 2019లో ఇంగ్లండ్‌పై) పేరిట ఉన్న రికార్డును భారత్ సవరించింది.

8 వన్డే ఫార్మాట్‌లో ఒకే ఏడాది కనీసం 1000 పరుగులు పూర్తి చేయడం విరాట్ కోహ్లికిది 8వసారి. సచిన్ టెండూల్కర్ (7 సార్లు) పేరిట ఉన్న రికార్డును కోహ్లి అధిగమించాడు.

2 ఒకే ప్రపంచకప్‌లో భారత జట్టు వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో గెలుపొందడం ఇదే రెండోసారి. 2003 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో నెగ్గింది.

8 ప్రపంచకప్ టోర్నీలో భారత్ సెమీఫైనల్ దశకు అర్హత సాధించడం ఇది ఎనిమిదోసారి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు కూడా ఎనిమిదిసార్లు చొప్పున సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

4 భారత్ తరఫున వన్డేల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లను అత్యధికంగా నాలుగుసార్లు తీసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. జవగళ్ శ్రీనాథ్, హర్భజన్ సింగ్ మూడుసార్లు చొప్పున ఈ ఘనత సాధించారు.

ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ × నెదర్లాండ్స్

వేదిక: లక్నో

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సూపర్ సెవెన్‌తో సెమీస్‌కి భారత్

శ్రీలంకపై 302 పరుగులతో టీమిండియా ఘనవిజయం

అదరగొట్టిన గిల్, కోహ్లి, అయ్యర్ • ఐదు వికెట్లతో హడలెత్తించిన షమీ
మెరిపించిన సిరాజ్, బుమ్రా • ఆదివారం దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'

మన టాప్ స్టార్లు పరుగు పెడితే... పేసర్లు పడగొడితే... ఏ ప్రత్యర్థి అయినా ఏం చేస్తుంది... చిత్తుగా ఓడటం తప్ప! మాజీ విశ్వవిజేత శ్రీలంకది కూడా అదే పరిస్థితి. మొదట... శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌ల ధాటికి సింహళ బౌలింగ్ కళ తప్పింది. తర్వాత కొండంత లక్ష్యం ఛేదించబోతే మన పేస్ దళం నిప్పులు చెరిగింది. అంతే నాలుగో ఓవర్ అయినా ముగియకముందే శ్రీలంక 3/4 స్కోరుతో పరాభవానికి వికెట్ల గేట్లెత్తి కేవలం 55 పరుగులకే ఆలౌటై చిత్తుగా ఓడిపోయింది.



షమీ

ముంబై: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో 10 జట్లు తలపడుతున్నాయి. నెదర్లాండ్స్, బంగ్లాదేశ్‌లాంటి చిన్న జట్లు... న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలాంటి మేటి టీమ్‌లు... ఐదుసార్లు జగజ్జేత ఆస్ట్రేలియా, డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ బరిలో ఉన్నా... ఒకే ఒక్క జట్టు, నంబర్‌వన్ భారత్ అప్రతిహత జైత్రయాత్ర ముందు ఏ ఒక్కటీ నిలువలేకపోతున్నాయి. తాజాగా భారత్ బల ప్రదర్శనకు 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక కుదేలైంది. టీమిండియా ఆల్‌రౌండ్ ఆటతీరుకు లంక అతలాకుతలమైంది. బ్యాటింగ్ ధాటికి తట్టుకోలేక, బౌలింగ్ దాడిని ఎదుర్కోలేక శ్రీలంక 302 పరుగుల భారీ తేడాతో భారత్ చేతిలో ఓడింది. వరుసగా ఏడో విజయంతో రోహిత్ శర్మ బృందం 14 పాయింట్లతో ఈ మెగా ఈవెంట్‌లో సెమీఫైనల్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకున్న తొలి జట్టుగా నిలిచింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 5న కోల్‌కతాలో దక్షిణాఫ్రికా జట్టుతో ఆడుతుంది.

అంతకుముందు శ్రీలంక కెప్టెన్ కుశాల్ మెండిస్ టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన రోహిత్ బృందం 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 357 పరుగుల భారీస్కోరు చేసింది. గిల్ (92 బంతుల్లో 92; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), కోహ్లి (94 బంతుల్లో 88; 11 ఫోర్లు), అయ్యర్ (56 బంతుల్లో 82; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) చెలరేగారు. మదుషంకకు 5 వికెట్లు దక్కాయి. తర్వాత శ్రీలంక కనీసం టి20 ఫార్మాట్‌కు తగ్గ ఓవర్లయినా ఆడలేకపోయింది. 19.4 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలి ప్రపంచకప్ చరిత్రలో తమ అత్యల్ప స్కోరును నమోదు చేసింది. పదో స్థానంలో దిగిన కసున్ రజిత (14) టాప్‌స్కోరర్ అంటే భారత బౌలింగ్ ప్రత్యర్థి బ్యాటర్లను ఎంతగా బయపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. బుమ్రా ఇన్నింగ్స్ తొలి బంతికే శ్రీలంక పతనానికి నాంది పలికితే... మరుసటి ఓవర్లలో సిరాజ్ (3/16) చావు దెబ్బ తీశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షమీ (5/18) బంతినందుకున్నాక శ్రీలంక ఆలౌట్ కావడానికి ఎంతోసేపు పట్టలేదు.



కోహ్లి, గిల్



అయ్యర్



సిరాజ్

మాథ్యూస్ క్లీన్‌బౌల్డ్

శతకం లేకపోయినా చితగ్గొట్టారు...

మ్యాచ్ మొదలవకముందు టాస్ నెగ్గిన ఆనందం, భారత ఇన్నింగ్స్ ఆరంభించగానే కెప్టెన్ రోహిత్ శర్మ (2 బంతుల్లో 4; 1 ఫోర్) అవుటైన సంబరం ఈ పోరులో లంకకు లభించిన అల్ప సంతోషాలు. తదనంతరం ఓపెనర్ గిల్ దూకుడు టాపార్డర్ బ్యాటర్ కోహ్లి క్లాసిక్ ఇన్నింగ్స్ వాంఖెడేలో క్రికెట్ ప్రియుల్ని ఆనంద పరవశం చేశాయి. ఇద్దరే 29.4 ఓవర్లు బ్యాటింగ్ చేశారు. లంక బౌలర్ల పని పట్టి స్కోరు బోర్డును పరుగు పెట్టించారు. దీంతో 16వ ఓవర్లోనే భారత్ 100కు చేరింది. ముందుగా కోహ్లి (50 బంతుల్లో), కాసేపటికే గిల్ (55 బంతుల్లో) అర్ధ సెంచరీలు పూర్తిచేసుకున్నారు. ఆ తర్వాత కూడా బ్యాటింగ్ ధాటి కొనసాగడం, లంక బౌలింగ్ తేలిపోవడంతో సెంచరీల దిశగా సాగారు. కానీ సఫలం కాలేకపోయారు. రెండో వికెట్‌కు 189 పరుగులు జోడించాక గిల్, కోహ్లి మూడు పరుగుల వ్యవధిలో పెవిలియన్ చేరారు. దీంతో వన్డేల్లో అత్యధిక సెంచరీల చేసిన ప్లేయర్‌గా సచిన్ టెండూల్కర్ (49) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సమం చేయలేకపోయాడు.

అయ్యర్ సూపర్

నాలుగో స్థానంలో క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ వాళ్లిద్దరి ఇన్నింగ్స్‌లను తలపించేలా బ్యాటింగ్ చేశాడు. అది కూడా దూకుడు జతచేసి! భారీ సిక్సర్లతో అయ్యర్ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. వేగంగా 36 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. రాహుల్ (21; 2 ఫోర్లు), సూర్యకుమార్ (12) చేసింది తక్కువే అయినా అయ్యర్ మెరుపులతో 45వ ఓవర్లోనే భారత్ 300 మార్కు దాటింది. శ్రేయస్ చితగ్గొట్టాడు... కానీ గిల్, కోహ్లిలలాగే శతకం మాత్రం కొట్టలేకపోయాడు. జడేజా (24 బంతుల్లో 35; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 4; గిల్ (సి) మెండిస్ (బి) మదుషంక 92; కోహ్లి (సి) నిసాంక (బి) మదుషంక 88; అయ్యర్ (సి) తీక్షణ (బి) మదుషంక 82; రాహుల్ (సి) హేమంత (బి) చమీర 21; సూర్యకుమార్ యాదవ్ (సి) మెండిస్ (బి) మదుషంక 12; జడేజా (రనౌట్) 35; షమీ (రనౌట్) 2; బుమ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 357. వికెట్ల పతనం:** 1-4, 2-193, 3-196, 4-256, 5-276, 6-333, 7-355, 8-357. **బౌలింగ్: మదుషంక 10-0-80-5**, చమీర 10-2-71-1, కసున్ రజిత 9-0-65-0, ఏంజెలో మాథ్యూస్ 3-0-11-0, తీక్షణ 10-0-67-0, హేమంత 8-0-52-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 0; కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 0; కుశాల్ మెండిస్ (బి) సిరాజ్ 1; సమరవిక్రమ (సి) అయ్యర్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) జడేజా (బి) షమీ 1; మాథ్యూస్ (బి) షమీ 0; హేమంత (సి) రాహుల్ (బి) షమీ 0; చమీర (సి) రాహుల్ (బి) షమీ 0; తీక్షణ (నాటౌట్) 12; రజిత (సి) గిల్ (బి) షమీ 14; మదుషంక (సి) అయ్యర్ (బి) జడేజా 5; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 55. వికెట్ల పతనం:** 1-0, 2-2, 3-2, 4-3, 5-14, 6-14, 7-22, 8-29, 9-49, 10-55. **బౌలింగ్:** బుమ్రా 5-1-8-1, సిరాజ్ 7-2-16-3, షమీ 5-1-18-5, కుల్దీప్ యాదవ్ 2-0-3-0, జడేజా 0.4-0-4-1.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	7	7	0	14	2.102
దక్షిణాఫ్రికా	7	6	1	12	2.290
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
న్యూజిలాండ్	7	4	3	8	0.484
పాకిస్తాన్	7	3	4	6	-0.024
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	7	2	5	4	-1.162
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్



అజేయంగా భారత్

కొరియాపై 5-0తో ఘనవిజయం

రాంచీ: సొంతగడ్డపై తొలిసారి జరుగుతున్న ఆసియా హాకీ మహిళల చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. దక్షిణ కొరియా జట్టుతో గురువారం జరిగిన చివరిదైన ఐదో లీగ్ మ్యాచ్‌లో భారత్ 5-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున సలీమా టెటె (6వ, 36వ ని.లో) రెండు గోల్స్ చేయగా... నవ్‌నీత్ కౌర్ (36వ ని.లో), వందన కటారియా (49వ ని.లో), నేహా (60వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తొమ్మిది పాయింట్లతో చైనా రెండో స్థానంలో, జపాన్ మూడో స్థానంలో, ఏడు పాయింట్లతో కొరియా నాలుగో స్థానంలో నిలిచి భారత్‌తోపాటు సెమీఫైనల్‌కు అర్హత పొందాయి. శనివారం జరిగే సెమీఫైనల్స్‌లో జపాన్‌తో చైనా; కొరియాతో భారత్ తలపడతాయి.

ముంబైకు చుక్కెదురు

ముల్లన్‌పూర్ (చండీగఢ్): సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు కథ క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బరోడా జట్టు మూడు వికెట్ల తేడాతో ముంబైను ఓడించి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ముందుగా ముంబై 20 ఓవర్లలో 8 వికెట్లకు 148 పరుగులు చేసింది. శివమ్ దూబే (36 బంతుల్లో 48; 1 ఫోర్, 3 సిక్స్‌లు), సర్ఫరాజ్ ఖాన్ (22 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం బరోడా జట్టు 18.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి నెగ్గింది. విష్ణు సోలంకి (30 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) బరోడా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో పంజాబ్ ఐదు వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై, ఢిల్లీ 39 పరుగుల తేడాతో విదర్భ జట్టుపై, కేరళ జట్టుపై అస్సాం ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్ చేరుకున్నాయి.



విష్ణు సోలంకి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
490	144
64,081	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోరి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,260	▲ 199
డోజోన్స్	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲ 104
డాక్స్	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్	31,950	▲ 348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,092 ▲	80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847 ▲	79
వెండి (కిలో)	71,684 ▲	700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.49	84.26
£	బ్రిటన్ పౌండ్		99.73	101.94
€	యూరో		86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)		54.27	55.87
AUS	ఆస్ట్రేలియా డాలర్		51.63	54.39
S$	సింగపూర్ డాలర్		59.12	60.98
SAR	సౌదీ రియాల్		21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్		21.87	23.49
¥	చైనా యువాన్		10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు



ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.

ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్లు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్లు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం



న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటోకార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

రాష్ట్రీయం

రాహుల్‌కు దమ్ముంటే నాపై పోటీ చేయాలి

ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



సంగారెడ్డి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్‌గాంధీకి దమ్ముంటే హైదరాబాద్‌లో తనపై పోటీ చేయాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సవాల్ విసిరారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. పిల్లి పాలు తాగితే ఎవరూ చూడరన్న సామెతగా రాహుల్‌గాంధీ బీజేపీతో వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని ఒవైసీ దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి మైనారిటీలను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తోందని ఆరోపించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాప్రయత్నంపై రాహుల్ సమాధానం చెప్పాలని ఒవైసీ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డిని ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలోనే మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందన్నారు.

నదుల అనుసంధానానికి 8 మంది సీఎంలతో ఒప్పందం!

- గోదావరి-కావేరి, బెడ్తి-వార్దా అనుసంధానంపై కేంద్రం కసరత్తు
- రాష్ట్రాలకు చేరిన ముసాయిదా ఎంఓయూ
- 10న జలసౌధలో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరి, బెడ్తి-వార్దా నదుల అనుసంధానం ప్రాజెక్టు కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రులు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి మధ్య పరస్పర అవగాహన ఒప్పందానికి (ఎంఓయూ) కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఈ మేరకు ముసాయిదా ఎంఓయూను సిద్ధం చేసింది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించి ఆయా రాష్ట్రాల నుంచి సమ్మతి పొందడానికి ఎన్‌డబ్ల్యూడీఏ ఈ నెల 10న జలసౌధలో 5వ సంప్రదింపుల సమావేశం నిర్వహించనుంది. ముసాయిదా ఎంఓయూపై ఇప్పటికే ఆయా రాష్ట్రాల సలహాలు, సూచనలను కోరింది. ప్రాజెక్టు కాంపోనెంట్స్, రాష్ట్రాల మధ్య నీటి వాటాల పంపకాలు, ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం/రాష్ట్రాలు భరించాల్సిన వాటాలు, ప్రాజెక్టు నిర్మాణానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు, భూసేకరణ, పరిహారం చెల్లింపు, ప్రాజెక్టు పర్యవేక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు తదితర అంశాల ప్రస్తావన ఎంఓయూలో ఉంది.



ఇచ్చంపల్లి నుంచే తరలింపు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచే నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల రిజర్వాయర్ (పెన్నా) మీదుగా గ్రాండ్ ఆనికట్ (కావేరి)కు తరలించేందుకు డీపీఆర్‌ను ఖరారు చేసినట్టు ఎన్‌డబ్ల్యూడీఏ తెలిపింది. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణంపై ఇప్పటికే తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసినా, ఎన్‌డబ్ల్యూడీఏ ముందుకు వెళ్లడం గమనార్హం. కాగా ఇచ్చంపల్లి నుంచి గ్రాండ్ అనికట్ వరకు 1,085.73 కి.మీల లింక్ కాల్వను నిర్మించనున్నారు. గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా మూడు దశల్లో మొత్తం 148 టీఎంసీలను ఎత్తిపోయనున్నారు. అందులో తెలంగాణకు 45.06 టీఎంసీలు, ఏపీకి 43.86 టీఎంసీలు, తమిళనాడుకు 40.92 టీఎంసీలు, కర్ణాటకకు 15.89 టీఎంసీలు, పుదుచ్చేరికి 2.18 టీఎంసీలను కేటాయించనున్నట్టు తెలిపింది. వీటి ద్వారా తెలంగాణలో 2,38,236 హెక్టార్లు, ఏపీలో 2,21,998 హెక్టార్లు, తమిళనాడులో 1,13,663 హెక్టార్లు కలిపి మొత్తం 5,73,897 హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరును ప్రతిపాదించింది.

గజ్వేల్, మేడ్చల్‌లో భారీగా నామినేషన్లు

- కేసీఆర్, మంత్రి మల్లారెడ్డిపై పోటీ చేస్తామన్న వక్ఫ్‌బోర్డు భూబాధితుల జేఏసీ

పంజగుట్ట: సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్‌లో 200పైగా నామినేషన్లు, మంత్రి మల్లారెడ్డి నిలబడుతున్న మేడ్చల్‌లో 300పైగా నామినేషన్లు వేస్తామని వక్ఫ్‌బోర్డు భూబాధితుల సంయుక్త కార్యాచరణ సమితి(బోడుప్పల్, ఘట్‌కేసర్) ప్రకటించింది. శుక్రవారం మేడ్చల్‌లో మొట్టమొదటి నామినేషన్ తమ జేఏసీ నుంచే ఉంటుందని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కో చైర్మన్ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బోడుప్పల్, ఘట్‌కేసర్‌లో 2002లో ఏర్పడ్డ లేఔట్లలో బ్యాంకు రుణాలు తీసుకుని స్థలాలు కొనుగోలు చేశామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఎల్ఆర్ఎస్, హెచ్ఎండీఏ పర్మిషన్ ఉన్నప్పటికీ 2018లో ఇవి వక్ఫ్ బోర్డు స్థలాలంటూ జీవో జారీ చేసి నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్లు ఆపేయడంతో సుమారు 30 కాలనీల్లోని 7 వేల కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని తెలిపారు. 2018 ఎన్నికల్లో గెలవగానే సమస్యను పరిష్కరిస్తామన్న మల్లారెడ్డి మంత్రిగా ఉండి కూడా జీవోను ఆపలేకపోయారని, ఇప్పుడు మీ సమస్య ఏంటో తనకు తెలియదని అంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ప్రభుత్వానికి హెచ్చరికగా ఉండేందుకే నామినేషన్లు వేసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. సమావేశంలో బాధితులు భాస్కర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పద్మ, ప్రహ్లాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తొలిజాబితా

పంజగుట్ట (హైదరాబాద్): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(వంచిత్ బహుజన్ అఘాడీ) పార్టీ 17 మంది అభ్యర్థులను ప్రకటించింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి బోర్లకుంట దీపక్‌కుమార్ అభ్యర్థులను ప్రకటించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రకాశ్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు అభ్యర్థులను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 100 స్థానాల్లో పోటీ చేస్తున్నామని, మొదటి విడతగా 17 మందిని ప్రకటిస్తున్నామని, మరో రెండు రోజుల్లో పూర్తి అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

అభ్యర్థులు వీరే: ఆదిలాబాద్- భగవాన్ కాంబ్లే, సిర్పూర్- దీపక్ కుమార్ జాడే, బెల్లంపల్లి- ఆర్.శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్-ఎస్.కె.మీరజ్, బాల్కొండ- సుజాత, కామారెడ్డి-బాబా అంగేటి, బాన్సువాడ-అబ్దుల్ హఫీజ్, జుక్కల్- సత్యం సిద్ధార్థ్, మధిర- కొప్పుల రాజ, సత్తుపల్లి- కర్ణే బేబి దుర్గ, పాలేరు- పాట్టిటి సునీల్‌కుమార్, సూర్యాపేట- దైద మాధవి, హుస్నాబాద్- కొత్తకొండ నాగరాజు, నకిరేకల్- వేణుకుమార్, మునుగోడు-విజయ్ కుమార్, నల్లగొండ - అరుణజ్యోతి.

జీవవైవిధ్య అంచనాకు నాన్ ఇన్వాసీవ్ పద్ధతి

సరికొత్త పద్ధతిని ఆవిష్కరించిన సీసీఎంబీ

సాక్షి, హైదరాబాద్: జీవుల జీవవైవిధ్యాన్ని అంచనా వేసేందుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు సరికొత్తగా నాన్ ఇన్వాసీవ్ పద్ధతిని అభివృద్ధి చేశారు. అంతరించిపోతున్న జీవజాతుల సంరక్షణకు ఈ విధానం ఎంతో ఉపయోగకరమని సీసీఎంబీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జి.ఉమాపతి తెలిపారు. జీవవైవిధ్యాన్ని పర్యవేక్షించడానికి, పరిరక్షించడానికి శాస్త్రవేత్తలు వివిధ ఆవాసాలలో నివసిస్తున్న జీవులను సర్వే చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా కాలక్రమేణా వాటి మార్పులను కూడా గమనిస్తూ ఉండాలి. కానీ అందుబాటులో ఉన్న జీవవైవిధ్య అంచనా పద్ధతులు పర్యావరణ వ్యవస్థలో నివసించే అన్ని సూక్ష్మజీవులు, మొత్తం జాతుల వైవిధ్యాన్ని అంచనా వేయలేవు. సాంప్రదాయిక పర్యవేక్షణ పద్ధతులకు విస్తృతమైన వర్గీకరణ నైపుణ్యం కూడా అవసరం. ఇది అత్యంత ఖరీదైన, శ్రమతో కూడుకున్న అంశం. ఈ పరిమితులను అధిగమించడానికి సీసీఎంబీ పరిశోధకులు ఎస్.మనూ, డాక్టర్ జి.ఉమాపతి ఫ్రీ-ఫ్లోటింగ్ ఎన్విరాన్‌మెంటల్ డీఎన్ఏ (ఈడీఎన్ఏ)లో ఎన్‌కోడ్ చేయబడిన జన్యు సమాచారాన్ని సంగ్రహించడానికి, చదవడానికి, లైసిస్ పీసీఆర్-రహిత పరమాణు విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈడీఎన్ఏ అనేది అన్ని జీవులు తమ జీవితకాలంలో లేదా మరణానంతరం సహజ ప్రక్రియల ద్వారా తమ పరిసరాల్లోకి పంపే డీఎన్ఏ. ఈ కొత్త పద్ధతిలో పరిశోధకులు పర్యావరణ నమూనాల నుండి ఈడీఎన్ఏను ఫిల్టర్ చేసి, వాటి సీక్వెన్స్‌లను చదివి, తద్వారా డీఎన్ఏ తాలుకు మూలాలను గుర్తిస్తారు.

తెలంగాణ పవర్ డిప్లొమో ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం

హన్మకొండ: తెలంగాణ పవర్ డిప్లొమో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని గురువారం హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. రిటైర్డ్ డీఈ వై.మోహన మురళి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా ఎల్.మధుసూదన్, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాస్‌లు, వి.సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పీబీసీ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా ఎస్.నర్సింహులు, టి.చంద్రశేఖర్, ఫైనాన్స్ కార్యదర్శిగా టి.నరేశ్ కుమార్, అసిస్టెంట్ ఫైనాన్స్ సెక్రటరీగా జె.చంద్రశేఖర్, కార్యాలయ కార్యదర్శిగా ఎల్.శ్రీనివాస్‌లు, సహాయ కార్యాలయ కార్యదర్శిగా టి.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.ఇంద్రసేనారెడ్డి, ఎస్.మాధవరెడ్డి, రాజ సురేంద్రచారి, వెల్ఫేర్ ఫండ్ కమిటీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా సీహెచ్.శ్రీనివాసులు, కోశాధికారిగా ఎస్.రమేష్ ఎన్నికయ్యారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.